17 . 12. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 197 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper



ఆదిలాబాద్ మండలం చిచ్ధరి గ్రామ సర్పంచ్ గా స్వతంత్ర అభ్యర్థి మరుసుకుల కేశవ్ గెలవడం జరిగింది. మంగళవారం రోజున గౌరవ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారి ఆధ్వర్యంలో బిజెపిలో చేరడం జరిగింది

ఆదిలాబాద్ వెలుతురు డిసెంబర్ 16:

# హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి



- అవసరమైన 200 ఎకరాల భూమి ఇస్తాం
- ట్రాన్సిట్ క్యాంపస్‌లో వెంటనే తరగతులు ప్రారంభం
- ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు మంజూరు
- జిల్లాలకు అనుగుణంగా 9 కేంద్రీయ విద్యాలయాలు
- 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయండి
- కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు సీఎం రేవంత్ వినతి

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 వెలుతురు:** హైదరాబాద్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఐఐఎంను మంజూరు చేయాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఏరో స్పేస్, డిఫెన్స్, లాజిస్టిక్స్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లో ముందున్న హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సీఎం తెలిపారు. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పార్లమెంట్‌లోని ఆయన ఛాంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. దేశంలో 19 రాష్ట్రాల్లో 1 కేంద్ర పాలిత ప్రాంతంలో కలిపి 21 ఐఐఎంలు ఉన్నాయని, తెలంగాణ రాష్ట్రంలోనూ ఐఐఎం ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన 200 ఎకరాల భూమిని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రాంగణంలో గుర్తించామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. ఐఐఎం తరగతులు వెంటనే ప్రారంభించేందుకు ట్రాన్సిట్ క్యాంపస్ సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రి సీఎం వెల్లడించారు. ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేయడంతో పాటు అవసరమైన వసతులు కల్పనకు తాము సిద్ధంగా ఉన్నట్లు సీఎం తెలిపారు. దేశంలోని అన్ని ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు వీలుగా హైదరాబాద్‌కు ఎయిర్, రైల్, రోడ్ కనెక్టివిటీ ఉందని, అనుకూల వాతావరణం, భిన్న రంగాల



# కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో దూకాలి

### పారిశుధ్యం, విద్య, వైద్య సేవలపై దృష్టి సారించాలి

### రాజకీయాలకు అతీతంగా ముందుకు నడవాలి

### సర్పంచ్‌లకు సన్మాన సభలో డిప్యూటీ సీఎం భట్టి

**ఖమ్మం,డిసెంబర్ 16 వెలుతురు:** కొత్తగా ఎన్నికైన సర్పంచులు గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారు. గ్రామాల్లో పారిశుధ్యం, విద్య, వైద్య సేవల మెరుగుదలపై సర్పంచులు ప్రధానంగా దృష్టి

# నరేగా రద్దు.. పార్లమెంటు ముందుకు కొత్త చట్టం

- వికసిత్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్
- బిల్లును ప్రవేశ పెట్టిన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్
- బిల్లుపై భగ్గుమన్న విపక్ష సభ్యులు.పోడియం వద్ద నిరసన
- ప్రభుత్వ తీరును ఏకి పారేసిన కాంగ్రెస్ ఎంపి ప్రియాంక
- గాంధీ పేరు మార్పంపై మండిపడ్డ శశిథరూర్
- ప్రభుత్వ తీరుకు నిరసనగా విపక్ష సభ్యుల వాకౌట్

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 వెలుతురు:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకం చట్టం ఎంజీ నరేగా రద్దుపై పార్లమెంటులో తీవ్ర గందరగోళం చెలరేగింది. నరేగా రద్దును నిరసితిస్తూ విపక్ష సభ్యులు స్పీకర్ పోడియం వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ఇది గాంధీని అవమానించడమేనని





అన్నారు. నరేగా స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకొస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన 'వికసి త్ భారత్ రోజ్‌గార్, ఆజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) (వీబీ–జీ రామ్ జీ) బిల్లు–2025'ను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మంగళ వారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లును ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మాట్లాడుతూ కేంద్రంపై విమర్శలు

- ములుగు అభివృద్ధిపై మంత్రి సీతక్క సవాల్
- ఆదివాసి బిడ్డకు బాధ్యతలు జీర్ణించుకోలేకే బీఆర్ఎస్ అసహనం
- ములుగు నియోజకవర్గంలో 105 గ్రామాల్లో 85కి పైగా కాంగ్రెస్ సర్పంచ్‌లు
- కార్యకర్తలకే ఈ విజయం అంకితం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా తప్పుడు ప్రచారం
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ స్వగ్రామం దేవగిరి పట్నంలోనూ కాంగ్రెస్ గెలుపు
- బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం పై మంత్రి సీతక్క ఆగ్రహం

# పది ఏళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించాం



**ములుగు జిల్లా వెలుతురు డిసెంబర్ 16:** ములుగు జిల్లా అభివృద్ధిపై తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క గారు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల్లో చేయలేని అభివృద్ధిని, ప్రజా ప్రభుత్వం కేవలం రెండేళ్లలోనే చేసి చూపించిందని స్పష్టం చేశారు. ములుగు అభివృద్ధిపై ఎవరైనా చర్చకు రావాలంటే తాము సిద్ధమేనని సవాల్ విసిరారు. ములుగు డీసీసీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, ములుగు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఇతర నాయకులతో కలసి ములుగు లో మంత్రి సీతక్క మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ములుగు ప్రజల ఆశీర్వాదంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఓ ఆదివాసి బిడ్డ బాధ్యతలు చేపట్టడం కొందరు బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజల మధ్య ఉండే వారికి పెద్ద బాధ్యతలు అప్పగిస్తే ఓర్వలేకపోవడమే వారి అసహనానికి కారణమని అన్నారు. ములుగు అభివృద్ధి విషయంలో బీఆర్ఎస్ లాగా తాము కాగితాల మీద జీవోలిచ్చి చేతులు దులుపుకోవడం లేదని. అభివృద్ధిని ఆచరణలో చేసి చూపిస్తున్నామని స్పష్టం చేశారు. ములుగు జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరు చేయడం, ములుగును మున్సిపాలిటీగా అభివృద్ధి చేయడం, మల్లంపల్లి మండలాన్ని ఏర్పాటు చేయడం వంటి కీలక నిర్ణయాలను

# మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?

### ఎవరు లీకు చేసి ఉంటారో తెలుసుకోవాలి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరా





# మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు

### మంత్రుల తొలగింపు వార్తలు అబద్ధం

### చేరికలే తప్ప తొలగింపు ఉండదన్న పిసిసి చీఫ్

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16( వెలుతురు):** తెలంగాణలో మంత్రిమండలి విస్తరణపై చాలా రోజులుగా కొనసాగుతున్న ఉత్కంఠకు త్వరలో తెరపడే అవకాశం ఉంది. జనవరిలో కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రిమండలిలో మరో ఇద్దరు మంత్రులను తీసుకోవడానికి వీలుంది, అంటే రెండు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేయడంతో పాటు, ప్రస్తుతం కేబినెట్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురిని తొలగిస్తారనే ప్రచారం విస్తృతంగా జరిగింది. అయితే, ఈ విషయంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ విస్తరణపై

# గాంధీ అన్నా.. పేదలన్నా మోడీకి నచ్చదు

- నరేగా రద్దుతో పేదల ఉపాధికి పెద్ద దెబ్బ
- ఉద్యోగాలు ఇవ్వకుండా..ఉపాధి కూడా ఎత్తేస్తారా
- కేంద్రం తీరుపై మండిపడ్డ విపక్షనేత రాహుల్
- పార్లమెంట్ వరకు నిరసనలు తెలుపుతామని వెల్లడి



**న్యూఢిల్లీ,డిసెంబర్ 16 వెలుతురు:** మహాత్మాగాంధీ జాతీయ గ్రామిణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని రద్దు చేస్తూ దాని స్థానంలో కేంద్రం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి బిల్లు ప్రవేశపెట్టడాన్ని విపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మహాత్మా గాంధీ ఆదర్శాలను అవమానించమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుంటోందని

# ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధన


### వైద్యారోగ్య రంగంలో ప్రమాణాలకు పెద్దపీట

### ప్రజల జీవన ప్రమాణాలు పెంచే యత్నం

### సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ రికార్డులు

### వైద్యా ప్రముఖులతో చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్

**అమరావతి,డిసెంబర్16 వెలుతురు:** వైద్యారోగ్య రంగంలో వివిధ ప్రమాణాలను అందుకునేలా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన



సూచనలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 2047 స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల ద్వారా అంతిమంగా ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ప్రయత్నాలు చేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్య సమస్యల కోసం యోగాతో పాటు నేచురోపతిని ప్రోత్సహించాల్సి ఉందని

# ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ బాబు ఆలోచన

### మరికొద్ది నెలలో భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభం

### ఏవియేషన్ అభివృద్ధి ఘనత ప్రధాని మోడీదే

### కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి



# కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు

### ఉద్యోగాలు పొందిన వారికి సీఎం, డిప్యూటి సీఎం అభినందనలు

**అమరావతి,డిసెంబర్ 16 వెలుతురు:** ఏపీలో పోలీస్ కానిస్టేబుల్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి వంగలపూడి అనితలు నియామక పత్రాలు అందచేశారు. అలాగే వారిని అభినందిస్తూ ప్రశంసల వర్షం కురిపించారు.





పాడేరుకు చెందిన గిరిజన యువకుడు బాబురావును సీఎం చంద్రబాబు అభినందించారు. అతడు మరింత ఉన్నత స్థానాలకు అధిరోహించాలని ఆకాంక్షించారు. అఖిల భారత సర్వీసు సాధించి జిల్లాకు ఎస్పీ కావాలన్నారు. అనంతరం బాబురావు మాట్లాడు తూ.. తన ఊరికి రహదారి వేయాలని సీఎం చంద్రబాబ ును కోరారు. ఆ బాధ్యత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తీసుకుంటారని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. బలభద్రపురం గ్రామానికి చెందిన మణికంఠ సైతం ఉన్నత స్థానానికి వెళ్లాలన్నారు. మణికంఠ బీఎస్సీ కెమిస్ట్రీ చదవి కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారని సీఎం చంద్రబాబు వివరించారు. చిన్నతనం నుంచి ప్రభుత్వ

## మోడీతో భేటీ అంశాలు బయటకు ఎలా వచ్చాయి?

న్యూఢిల్లీ,డిసెంబర్16 : తెలంగాణలో బిజెపి నేతలు క్షేత్రస్థాయిలో సరిగా పనిచేయడం లేదని, పార్టీ బలోపేతంపై దృష్టి సారించడం లేదని ఇటీవల ప్రధాని మోడీ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోదీతో ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు సమావేశం అయిన విషయం తెలిసిందే. ఈ సమావేశం లో నేతలకు పలు కీలక అంశాలపై ప్రధాని మోదీ దిశానిర్దేశం చేశారు. అయితే ఈ భేటీలో ప్రస్తావించిన విషయాలు బయటకు వచ్చాయి. ఈ విషయంపై ఢిల్లీలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో తెలంగాణ బీజేపీ ఎంపీల సమావేశంపై వచ్చిన లీకులపై కిషన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీతో చర్చించిన విషయాలు బయటకు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఎవరో కావాలనే ఈ విషయాలను లీకు చేశారన్ని ÷ర్ అయ్యారు. ఈ సమావేశంలో ప్రస్తావించిన అంశాలను బయటకు చెప్పొద్దని మోదీ చెప్పారని గుర్తుచేశారు కిషన్‌రెడ్డి. కానీ మీటింగ్‌లో జరిగిన విషయాలను బయటకు ఎవరు ఎందుకు చెప్పారని మండిపడ్డారు. వారెవరో చెబితే వారిపైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాని మోదీ మీటింగ్‌లో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలని మాత్రమే చెప్పారని పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీని మరింతగా బలోపేతం చేయాలని మోదీ కోరారని అన్నారు. దక్షిణాది నుంచి ఇప్పటివరకు ఇద్దరు ఉపరాష్ట్రపతులు అయ్యారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి షాకింగ్ కామెంట్స్ చేశారు. ప్రధాని మోదీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలు సరికాదని అన్నారు. ఆయన అనైతికంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ స్థాయిని తగ్గించేలా రాహుల్ వ్యాఖ్యలు ఉన్నాయని మండిపడ్డారు. రాహుల్‌గాంధీ విపక్ష నేతగా ఉండటం దురదృష్టకరమని కిషన్‌రెడ్డి విమర్శించారు.

## కానిస్టేబుల్ అభ్యర్థులకు నియామక పత్రాలు

ఉద్యోగం చేయాలని గుంటూరు అర్బన్ ప్రాంతానికి చెందిన కాశింశెట్టి అఖిల్ గోపీచంద్‌కు ఉండేదన్నారు. బిఎస్సీ కంప్యూటర్స్ చేసిన అఖిల్.. ఆ దిశగా కష్టపడి చదవి ఈ ఉద్యోగం సాధించారని చెప్పారు. మీ ముఖాల్లో ఆనందం చూడాలని తాము కూటమిగా ఏర్పడి కష్టపడి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. కార్యక్రమానికి హాజరై నియామక పత్రం పొందిన మహిళా కానిస్టేబుల్ కొమ్ము శిరీష్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా మారుమూల గ్రామం నుండి తాను వచ్చానన్నారు. తన తండ్రిని ఆడపిల్లలను చదివించ వద్దంటూ అందరూ చెప్పేవారన్నారు. తనకు ఆడబిడ్డలు అయినా.. మగబిడ్డలయినా ఒకరే వారికి తన తండ్రి చెప్పేవారని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తన సోదరి బిహార్ రాజధాని పాట్నాలోని ఎన్ఐటీలో సివిల్ ఇంజినీరింగ్ చదువుతోందని ఈ సందర్భంగా కొమ్ము శిరీష వెల్లడించారు. తనను ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివించారని ఈ సందర్భంగా శిరీష తెలిపింది. శిరీష వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు స్పందించారు. మామూలు కుటుంబంలో జన్మించిన వారిని అసాధారణ పట్టుదలతో ఆ తల్లిదండ్రులు చదివించారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారికి సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

## కొత్త సర్పంచ్‌లు గ్రామాభివృద్ధిలో దూకాలి

సారించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా పనిచేస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాల్సిన బాధ్యత సర్పంచులపై ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మధిర నియోజకవర్గంలో ఇటీవల ఎన్నికైన సర్పంచులను భట్టి విక్రమార్క ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని 2047 నాటికి ప్రపంచంతో పోటీపడే స్థాయిలో నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు. గ్లోబల్ సమ్మిట్‌లో 2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రదర్శించినట్లు చెప్పారు. 2047 కల్లా రాష్ట్రంలో ఒక లక్ష 30 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా పనిచేస్తున్నామని వెల్లడించారు.తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో 5 లక్షల 70 వేల కోట్ల రూపాయల పెట్టుబడి ఒప్పందాలు కుదిరినట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు పోటీ పడుతున్నారని పేర్కొన్నారు. మధిర నియోజకవర్గంలో మొత్తం 131 గ్రామపంచాయతీలకు గాను 90 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ మద్దతు ఉన్న అభ్యర్థులు గెలవడం చరిత్రలో ఒక మైలురాయిగా అభివర్ణించారు. ప్రజా సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో 93 లక్షల కుటుంబాలకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు 20 వేల కోట్ల రూపాయలతో వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని, రైతులకు 9 వేల కోట్ల రూపాయలతో రైతు భరోసా అందజేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను ప్రపంచంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలబెట్టడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరోసారి స్పష్టం చేశారు.

## ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశిత లక్ష్యాల సాధన

అన్నారు. మంగళవారం సచివాలయంలో వైద్యారోగ్య రంగంలో అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పౌరులకు సంబంధించిన డిజిటల్ హెల్త్ రికార్డులను సంజీవని ప్రాజెక్టు ద్వారా రూపొందిస్తున్నామని ఈ సందర్భంగా సీఎం తెలిపారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో కుప్పం, చిత్తూరు జిల్లాల్లో డిజిటల్ నెర్వ్ సెంటర్ ద్వారా ఈ వివరాలను సేకరించి ఇంటిగ్రేట్ చేశామన్నారు. రియల్ టైమ్‌లోనే వారి వివరాలు తెలుసుకునేలా సంజీవని ద్వారా ఇంటిగ్రేట్ చేస్తున్నామని చెప్పారు. వివిధ అంశాల్లో పౌరులకు సంబంధించిన ఆరోగ్య సమాచారం అందుబాటులో ఉంటుందన్నారు. ప్రివెంటివ్ వెల్ నెస్, డిజిటల్ ఏఐ ఎనేబుల్డ్ హెల్త్, హెల్త్ ÷నాన్సింగ్ రిఫార్మ్స్ లాంటి కీలకమైన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.వైద్యారోగ్య రంగంలో మౌలిక సదుపాయాలు పెద్ద ఎత్తున పెరగాలన్నారు. ఏపీలో మెడ్ టెక్ పార్కు ద్వారా అధునాతన వైద్య పరికరాలను రూపొందిస్తున్నామని సీఎం తెలిపారు. రోగం వచ్చిన తర్వాత తీసుకునే జాగ్రత్తల కంటే ఆ జబ్బు రాకుండా ముందస్తుగానే నియంత్రించేలా ప్రివెంటివ్ టెక్నాలజీస్‌పై దృష్టి పెట్టాలని సూచనలు చేశారు. తద్వారా వైద్యారోగ్యంపై వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. వైద్యారోగ్య రంగంలో మరింత వినూత్నంగా ప్రాజెక్టులు చేపట్టేందుకు అత్యున్నత స్థాయి ఎక్స్‌పర్ట్ గ్రూప్ సలహాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ప్రతీ రంగంలోనూ టెక్నాలజీ ద్వారా అత్యుత్తమ ప్రమాణాలు తీసుకుని రావాలన్నదే తమ లక్ష్యమని స్పష్టంచేశారు. సామర్థ్యాల పెంపుతో పాటు ప్రజలకు అత్యున్నత సేవలు అందాలన్నారు. క్వాంటం, ఏఐతో రియల్ టైమ్ డేటా విశ్లేషణ లాంటి వాటి ద్వారా ప్రజలకు సేవలు అందాలని చెప్పారు. ప్రస్తుతం ఏఐ ద్వారా నాలెడ్జి వ్యవస్థీకృతం అయ్యిందన్నారు. గ్లోబల్ కమ్యూనిటీకి సేవలు అందించేలా ప్రస్తుతం అంతా సామర్థ్యాలను పెంచుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. కాగా... అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంలో యూఎస్ ఏఐడీఎస్ ప్రతినిధి పీటర్ పాయిట్, డబ్ల్యూహెచ్‌వో సైంటిస్ట్ సౌమ్య స్వామినాథన్, ఎఐజీ ఛైర్మన్ డి.నాగేశ్వర్ రెడ్డి, సింగపూర్ ప్రతినిధి ప్రొఫెసర్ ఇక్ ఇంగ్ టియో, ఆర్తి అహుజా, రిజ్వాన్ కొయిటా, శ్రీకాంత్ నాదముని, గగన్ దీప్ కాంగ్, మార్గరెట్ ఎలిజిబెత్, నిఖిల్ టాండన్, ఇతర వైద్య నిపుణులు ఉన్నారు. ఈ సమావేశంలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎపి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం

### - చైల్డ్ కేర్ లీవ్ వయో పరిమితి ఎత్తివేత

**అమరావతి,డిసెంబర్ 16 వెలుతురు :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మహిళా ప్రభుత్వ ఉద్యోగులకు మరో శుభవార్త అందించింది. చైల్డ్ కేర్ లీవ్ వినియోగంపై పిల్లల వయో పరిమితిని పూర్తిగా తొలగిస్తూ ఆర్థిక శాఖ జీవో ఎంఎస్ నం.70 జారీ చేసింది. ఇకపై మహిళా ఉద్యోగులు, ఇంకా, ఒంటరి పురుష ఉద్యోగులు మొత్తం 180 రోజుల చైల్డ్ కేర్ లీవ్‌ను తమ ఉద్యోగ విరమణ వరకు ఎప్పుడైనా వినియోగించుకోవచ్చు. పిల్లల వయసు ఎంతైనా సరే, దివ్యాంగ పిల్లల సంరక్షణతో సహా వివిధ అవసరాలకు ఈ సెలవు అందుబాటులో ఉంటుంది. గతంలో పిల్లల వయసు 18 ఏళ్లు (దివ్యాంగులకు 22 ఏళ్లు) దాటితే ఈ సదుపాయం లభ్యం కాదు. ఇప్పుడు ఆ పరిమితి ఎత్తివేతతో మహిళా ఉద్యోగులు పిల్లల అవసరాలు, వైద్య పరీక్షలు, అనారోగ్యం లేదా ఇతర కారణాలు కోసం సర్వీసు ముగిసే వరకు ఈ లీవ్ తీసుకోవచ్చు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఉద్యోగుల సంఘాలతో జరిపిన సమావేశంలో ఈ హామీ ఇచ్చిన నేపథ్యంలో ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ నిర్ణయంతో మహిళా ఉద్యోగుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

## హైదరాబాద్‌కు ఐఐఎంను ఇవ్వండి

ప్రముఖులను అందజేసిన చరిత్ర హైదరాబాద్‌కు ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ లో ఐఐఎం ఏర్పాటు చేస్తే అది తెలంగాణ రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లల అవకాశాలను మెరుగుపర్చుతుందని సీఎం అన్నారు. తెలంగాణలో పెరిగిన జిల్లాల సంఖ్యకు అనుగుణంగా నూతనంగా 9 కేంద్రీయ విద్యాలయాలు, 16 జవహర్ నవోదయ విద్యాలయాలను మంజూరు చేయాలని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న పట్టణీకరణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటు అవసరం ఉందని సీఎం అన్నారు. కొమురం భీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, జోగులాంబ గద్వాల, నారాయణపేట, నాగర్‌కర్నూల్, సూర్యాపేట, వికారాబాద్, నిర్మల్ జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు, హనుమకొండ, జనగాం, జయశంకర్ భూపాలపల్లి, జోగులాంబ గద్వాల, మహబూబాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, మెదక్, ములుగు, నారాయణపేట, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, వనపర్తి, యాదాద్రి భువనగిరి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాలు వెంటనే ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి కోరారు. కేంద్రీయ విద్యాలయాలు, జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన స్థలం, ఇతర వసతులు కల్పించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సీఎం కేంద్ర మంత్రికి తెలిపారు. సమావేశంలో ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, మందాడి అనిల్ కుమార్, ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. మంగళవారం కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, ధర్మేంద్ర ప్రధాన్‌తో ఆయన భేటీ అయ్యారు. తెలంగాణ విజన్ డాక్యుమెంట్‌ను నిర్మలా సీతారామన్‌కు సీఎం అందజేశారు. యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లకు పెట్టే ఖర్చును ఎఫ్ఆర్‌బీఎం పరిధి నుంచి తొలగించాలని రేవంత్ కోరారు. యంగ్ ఇండియా స్కూళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ను పంపాలని ముఖ్యమంత్రికి కేంద్ర మంత్రి సూచించారు. దాన్ని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# నరేగా రద్దు..పార్లమెంటు ముందుకు కొత్త చట్టం

**(మొదటి పేజీ తరువాయి..)**

గుప్పించారు. ఇది ఎంజీ నరేగా చట్టాన్ని బలహీనపర్చడమేనని దుయ్యబ ట్టారు. ప్రభుత్వ పథకాల పేర్లను మార్చడం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని. అయినా కేంద్రం మారుస్తూనే ఉంది. పథకాల పేర్లను మార్చడం అంటే మోదీ ప్రభుత్వానికి ఎందుకంత ఇష్టమో అర్థం కావట్లేదని అన్నారు. ఎంజీ నరేగా చట్టం పేద ప్రజలకు 100 రోజుల ఉపాధి హామీ కల్పిస్తోంది. ఈ కొత్త బిల్లుతో ప్రస్తుత చట్టాన్ని బలహీనపర్చే ప్రయత్నం చేస్తున్నారు. ఈ బిల్లులో ఒకటో, రెండో కొత్త విషయాలు చేర్చారు. పని దినాలను పెంచారు. అంతేగానీ.. వేతనాన్ని పెంచారా అని ప్రియాంక ప్రశ్నించారు. గతంలో గ్రామ పంచాయతీలు ఈ పథకం కింద పని చేయించేవి. ఇప్పుడు కొత్త బిల్లుతో పంచాయతీలకు ఆ హక్కును దూరం చేస్తున్నారు. ఇక, ఈ బిల్లుతో ఉపాధి హామీ పథకంపై కేంద్రం నియంత్రణను పెంచి, నిధులను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. ఎవరి ఇష్టానుసారం గానో బిల్లులను ఆమోదించుకుంటామంటే కుదరదు. ఈ బిల్లును తక్షణమే కేంద్రం ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక అన్నారు. ప్రియాంక మాట్లాడుతుండగా.. ట్రెజరీ బెంచ్‌లో కొందరు 'ఫ్యామిలీ' అంటూ వ్యాఖ్యలు చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ.. మహాత్మా గాంధీ మా కుటుంబానికి చెందిన వ్యక్తి కాదు కానీ, మా కుటుంబసభ్యుడితో సమానం. గాంధీజీని యావత్ దేశం అలాగే భావిస్తోందని కౌంటర్ ఇచ్చారు. అనంతరం టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ మాట్లాడుతూ రాముడి పేరుతో కేంద్రం దోపిడీకి పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఉద్దేశపూర్వకంగా గాంధీ పేరును తొలగించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. అయితే, విపక్షాల ఆరోపణలను కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తిప్పికొట్టారు. మహాత్మాగాంధీ అంటే తమకు ఎంతో గౌరవమని, ఆయన సిద్ధాంతాలను తమ ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వాల కంటే మోదీ సర్కారు ఎంతో కృషి చేసిందని తెలిపారు. పేదల సంక్షేమం, ఉపాధి పెంపు కోసమే ఈ బిల్లును తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ బిల్లుపై లోక్‌సభలో గందరగోళ వాతావరణం నెలకొంది. కేంద్రం తీరును నిరసిస్తూ విపక్షాలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టాయి. అనంతరం గాంధీజీ ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభ నుంచి వాకౌట్ చేశాయి. అంతకుముందు కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కూడా ఈ బిల్లును వ్యతిరేకించారు. ఈ పథకానికి గాంధీ పేరును తొలగించడం అనైతికమని అన్నారు. అంతేగాక, రాముడి పేరును అపవిత్రం చేయొద్దంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కూడా థరూర్ ఈ పేరు మార్పుపై ఎక్స్ వేదికగా స్పందించారు. ఎంజీనరేగా పేరు మార్చి.. కేంద్రం కొత్తగా జీ రామ్ జీ బిల్లు తీసుకురావడంపై జరుగుతున్న వివాదం దురదృష్టకరం. గ్రామ స్వరాజ్ సిద్ధాంతాలు, రామరాజ్య ఆదర్శాలు ఎన్నటికీ ఒకదానితో ఒకటి పోటీపడేవి కాదు. గాంధీజీ దృక్పథానికి అవి రెండు మూల స్తంభాల్లాంటివి. ఇప్పుడు పథకానికి పేరు మార్చడం అంటే ఆయన ఆదర్శాలను విస్మరించినట్లే. ఆయన వారసత్వాన్ని అగౌరవపర్చే ప్రయత్నం చేయొద్దని థరూర్ అన్నారు. శశిథరూర్ గత కొంతకాలంగా కాంగ్రెస్ తో విభేదిస్తూ మోదీ ప్రభుత్వంపై బహిరంగంగానే ప్రశంసలు కురిపిస్తోన్న సంగతి తెలిసిందే. దీంతో సొంత పార్టీ నేతల ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా బిల్లు విషయంలో కాంగ్రెస్‌కు మద్దతుగా మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.

# పది ఏళ్లలో చేయలేనిది రెండేళ్లలో చేసి చూపించాం

ప్రజా ప్రభుత్వం అమలు చేసిందని గుర్తు చేశారు. ములుగు నియోజకవర్గ అభివృద్ధిని సహించ లేక, పాకాల కొత్తగూడెంలో తలపెట్టిన 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటును బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మండిపడ్డారు. రెండు విడతల్లో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడం పట్ల పంచాయతీ రాజ్ యంత్రాంగానికి, జిల్లా అధికారులు, కలెక్టర్లు, పోలీసు సిబ్బంది సహా ఎన్నికల నిర్వహణలో కష్టపడ్డ ప్రతి అధికారికి మంత్రి సీతక్క హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు 62 శాతం స్థానాల్లో విజయం సాధించారని పేర్కొన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు మెంబర్లకు శుభాకాంక్షలు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే నిర్ణయం వల్ల గత రెండేళ్లుగా సుమారు మూడు వేల కోట్ల రూపాయల నిధులు ఆగిపోయాయని, మార్చి లోపు ఎన్నికలు జరిగితే పూర్తి స్థాయి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని మంత్రి వివరించారు. ములుగు నియోజకవర్గంలో 105 గ్రామాల్లో 85కి పైగా కాంగ్రెస్ అభ్యర్థులు సర్పంచ్ లుగా గెలుపొందారని వెల్లడించారు. నాలుగు చోట్ల కాంగ్రెస్ రెబల్స్ కూడా గెలిచారని తెలిపారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు విజయం అంకితమన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సొంత గ్రామం దేవగిరి పట్నంలో కూడా కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని మంత్రి సీతక్క తెలిపారు.

## నరేగా పేరు మార్పుపై 17 కాంగ్రెస్ దేశవ్యాప్త ఆందోళన

**న్యూఢిల్లీ,డిసెంబర్ 16( వెలుతురు):** మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరు మార్పునకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న దేశవ్యాప్త ఆందోళనలకు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు హక్కుల ఆధారిత సంక్షేమాన్ని నిర్వీర్యం చేయడానికి ప్రయత్నిస్తున్నాయని, దానిని కేంద్రం నుండి నియంత్రించే దాతృత్వ సంస్థతో భర్తీ చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. గాంధీజీ వారసత్వంపైన, కార్మికులు, వారి హక్కులైనా బిజెపి కుట్రపూరితంగా దాడి చేస్తోంది.

మహాత్మాగాంధీ పేరును, ఆయన విలువలను తుడిచేయడానికి బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 17న జిల్లా ప్రధాన కార్యాలయాల్లో గాంధీజీ చిత్రపటాలతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మంగళవారం ఎక్స్‌లో పోస్టు చేసింది.

# మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు

వస్తున్న ఊహాగానాలను మహేష్ గౌడ్ తోసిపుచ్చారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలను తప్పిస్తారనే ప్రచారం జరిగింది. దీనిపై మహేష్ గౌడ్ స్పందిస్తూ, ఆ ఇద్దరు మంత్రులు కేబినెట్‌లో కొనసాగుతారని స్పష్టత ఇచ్చారు. కేబినెట్‌లో తీసివేతలు ఉండవని, కేవలం చేరికలే ఉంటాయని ఆయన అన్న మాటలు కొందరికి ఊరట కలిగించాయి. కాంగ్రెస్ హైకమాండ్‌తో చర్చించిన తర్వాతే ఆయన ఈ ప్రకటన చేశారా లేదా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చలు జరిగాయా అనే చర్చ రాష్ట్ర కాంగ్రెస్ వర్గాల్లో జరుగుతోంది. కొంతమంది మంత్రులపై వివిధ రకాల ఆరోపణలు ఉన్నాయని, సొంత పార్టీ ఎమ్మెల్యేలు కూడా అధిష్టానానికి ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. అయినప్పటికీ, వారిని తొలగించే అవకాశం లేదని, అయితే శాఖల మార్పు మాత్రం ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ ఇండికేషన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. శాఖల మార్పులు చేసే విషయంలో కాంగ్రెస్ అధిష్టానమే తుది నిర్ణయం తీసుకుంటుంది, అయితే ఈ విషయంలో సీఎం రేవంత్ రెడ్డికి కూడా కొంత స్వేచ్ఛను ఇచ్చినట్లు సమాచారం. మంత్రివర్గ విస్తరణలో ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులు ఎవరిని వరిస్తాయనేది ప్రధానంగా చర్చనీయాంశమైంది. ఈ పదవుల కేటాయింపులో సామాజిక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుంటారా లేదంటే కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కని జిల్లాలకు ప్రాధాన్యత ఇస్తారా అనేది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు అజారుద్దీన్‌ను మంత్రివర్గంలోకి తీసుకున్నారు. జనవరిలో జరగబోయే ఈ విస్తరణతో కేబినెట్ పూర్తిస్థాయిలో కొలువుదీరే అవకాశం ఉంది.

# ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ బాబు ఆలోచన

**విశాఖపట్నం, అమరావతి, డిసెంబర్16 వెలుతురు :** విశాఖ ప్రపంచానికే కేంద్రంగా తయారవుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. సీఎం చంద్రబాబు ఆలోచనలు నుంచి పుట్టినది ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ అని చెప్పుకొచ్చారు. మరికొద్ది నెలలో భోగాపురం ఎయిర్పోర్ట్ ప్రారంభమవుతుందని.. మరో నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రస్తుతం ఏవియేషన్ బాగా ప్రాచుర్యం పొందుతోందన్నారు. మనదేశంలో ఏవియేషన్ అభివృద్ధి చెందుతుందంటే ఈ ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని తెలిపారు. ప్రతి ఏటా 12 శాతం గ్రోత్ రేట్‌తో ఏవియేషన్ రంగం ఎదుగుతోందన్నారు. సాధారణ వ్యక్తి విమానంలో ప్రయాణం చేసే స్థాయికి భారతదేశం ఎదిగిందని తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్ క్రాఫ్ట్ సంఖ్య ఎనిమిది వేలకు పెరిగే అవకాశం ఉందని అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు అవుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఏవియేషన్ విశ్వవిద్యాలయాలకు జీఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ కేంద్రంగా ఉంటుందని కేంద్రమంత్రి చెప్పారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ కోసం ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వస్తారన్నారు. ఉత్తరాంధ్రలో పూసపాటి కుటుంబం ఉండడం అందరి అదృష్టమన్నారు. కోట్ల విలువచేసే భూమిని పూసపాటి కుటుంబం విద్యకు ఇస్తున్నారని తెలిపారు. ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీకి 136 ఎకరాల భూమిని ఇచ్చారని అన్నారు. భవిష్యత్ తరాలకు ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విమానయాన రంగంలో ట్రైనింగ్ కెపాసిటీ ఇంకా పెరగాల్సి ఉందని.. దీనికి జీఎంఆర్ - మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ఉపయోగపడుతుందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని వచ్చే నెలలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విశాఖలో రాడిసన్ బ్లూ రిసార్టులో రాష్ట్ర మంత్రి లోకేశ్ సమక్షంలో జీఎంఆర్- మాన్సాస్ ఏవియేషన్ ఎడ్యుసిటీ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రాజెక్టు ప్రారంభ కార్యక్రమంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఎయిర్‌పోర్టును ప్రారంభించాలనుకున్నామని.. కానీ ఒక నెల ముందుగానే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఎడ్యుసిటీ ఉంటే ఎన్నో విద్యాలయాలు, యూనివర్సిటీలు పెట్టుకోవచ్చన్నారు. ఏవియేషన్ రంగంలో శిక్షణ ఇచ్చేందుకు ఇది ఉపకరిస్తుందని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మిస్తున్న భోగాపురం ప్రాంతాన్ని తొలి ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషన్, ఇన్నోవేషన్ హబ్‌గా ప్రభుత్వం నిలపనుంది. దీనిలో భాగంగా విజయనగరం-విశాఖపట్నం సరిహద్దుల్లో దేశంలోనే తొలి ఏవియేషన్ ఎడ్యుకేషన్ సిటీ ఏర్పాటు చేయనుంది. గోవా గవర్నర్, మాన్సాస్ ట్రస్ట్ ఛైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, జీఎంఆర్ గ్రూప్ సంస్థల ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఈ ప్రాజెక్టులో కీలకం కానున్నారు. దీనికి జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యు సిటీ ప్రాజెక్ట్‌గా నామకరణం చేశారు.

## గాంధీ అన్నా..పేదలన్నా మోడీకి న చ్చదు

దుయ్యబట్టారు. ఉద్యోగాలు ఇవ్వకుండా యువత భవిష్యత్తును నాశనం చేసిన మోదీ ప్రభుత్వం..ఇప్పుడు గ్రామీణ ప్రజలకు కూడా ఉపాధి లేకుండా చేస్తోందని మండిపడ్డారు. ఈ ప్రజా వ్యతిరేక బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ర్యాలీగా పార్లమెంటు వరకు వెళ్లి తమ నిరసనను తెలియజేస్తాయన్నారు. మహాత్మా గాంధీ ఆలోచనలు, పేదల హక్కులపై ప్రధాని మోదీకి ముందు నుంచి తీవ్రమైన అయిష్టత ఉంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే గాంధీ ఆలోచనకు ఎంజీ నరేగా ఓ సజీవ స్వరూపం. ఎన్నో ఏళ్లుగా ఇది లక్షలాది మంది గ్రామీణ ప్రజలకు జీవనాడిగా ఉంది. కొవిడ్ సమయంలో కూడా ఈ పథకం పేదలకు ఆర్థిక భద్రతను ఇచ్చింది. కాంగ్రెస్ తీసుకువచ్చిన ఎంజీ నరేగా ప్రధాని మోదీని ఎప్పుడూ కలవరపెడుతూనే ఉంది. కాబట్టి దీనిని బలహీనపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా ప్రయత్నిస్తోంది. అందులో భాగంగానే దీనిని పూర్తిగా తుడిచిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారని రాహుల్ సోషల్ మీడియాలో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం స్థానంలో కేంద్రం కొత్త బిల్లును తీసుకురావాలని యోచిస్తున్న సమయంలో, కేంద్ర ప్రభుత్వంపై ప్రతిపక్ష ఎంపీ రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది మహాత్మాగాంధీ ఆదర్శాలకు అవమానమని అన్నారు. గ్రామీణ కుటుంబాలకు ప్రతీ ఏడాది 100 రోజుల వేతన ఉపాధికి చట్టపరమైన హామీని అందించే పథకాన్ని రద్దు చేయాలని మోడీ సర్కార్ యోచిస్తోందని మండిపడ్డారు. కేంద్రం కొత్తగా రోజ్‌గార్ మరియు అజీవిక మిషన్ బిల్లు, 2025ను తీసుకురావడంపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ప్రధాని మోడీకి రెండు విషయాలు నచ్చవని, మహాత్మాగాంధీ ఆలోచనలు, పేదల హక్కులు నచ్చవని ఎక్స్‌లో ఆరోపించారు. కేంద్రం తీసుకురాబోతున్న కొత్త బిల్లుకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రోడ్ల నుంచి పార్లమెంట్ వరకు నిరసన తెలుపుతాయని ఆయన అన్నారు. కొత్త బిల్లు మహాత్మా గాంధీ ఆదర్శాలకు అవమానమని, నిరుద్యోగం ద్వారా భారత దేశ యువత భవిష్యత్తును నావనం చేసిన తర్వాత, మోడీ ప్రభుత్వం ఇప్పుడు గ్రామీన పేదల జీవనోపాధిని లక్ష్యంగా చేసుకున్నారని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం 2005లో తీసుకువచ్చింది.

# ఇంకా కొలిక్కిరాని ఫిరాయింపుల కేసు

- నిర్ణీత గడువు లేకపోవడంతోనే సమస్యలు
- రాజకీయ పార్టీల విన్యాసాలకు చెక్ పడాల్సిందే



**హైదరాబాద్,డిసెంబర్16 వెలుతురు:**
తెలంగాణలో పార్టీ ఫిరాయింపుల కేసు ఓ కొలిక్కి రాలేదు. ఈలోగా కేసును విచారించిన చీఫ్ జస్టిస్ గవాయ్ పదవీవిరమణ పొందారు. ఈ తీర్పు ..తద్వారా తీసుకునే నిర్ణయం ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయిన అనుకున్నారు. కానీ స్పీకర్ వద్ద పదిమంది ఎమ్మెల్యేల ఫిరాయింపు వ్యవహారం ఎటూ తేలడం లేదు. సుప్రీం ఇచ్చిన మూడు నెలల గడువు అయిపోయింది. స్పీకర్ మరికొంత సమయం కోరారు. ఇప్పుడు దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకుంటారా అన్న ఉత్కంఠ నెలకొంది. ఏదేని సభ్యుడు పార్టీ ఫిరాయించాడని భావిస్తే, ఆ సభ్యుడి మిగతా కాలానికి సభ్యత్వం రద్దుచేసే అధికారం రాజ్యాంగం స్పీకర్‌కు ప్రసాదించింది. పార్టీ ఫిరాయింపు అనర్హత పిటిషన్ స్పీకర్ ముందు పెండింగ్‌లో ఉన్న సమయంలో, సభ్యుడు స్వయంగా సభ్యత్వానికి రాజీనామా కూడా సమర్పించవచ్చు. ఈ రెండు సందర్భాల్లోనూ ఆ సభ్యుడు తిరిగి జరుగబోయే ఉప ఎన్నికలో లేదా సాధారణ ఎన్నికల్లో తనకు నచ్చిన రాజకీయ పార్టీ సభ్యుడిగా పోటీ చేయవచ్చు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ పార్టీ మారిన సభ్యుడి సభ్యత్వ రద్దుకు మాత్రమే పరిమితమైంది. సభ్యత్వ రద్దు కాకుండా ఇతర చట్టపరమైన చర్యల గురించి ఎలాంటి ప్రస్తావన లేకుండటంతో పార్టీలు మారేవారు దానిని తమకనుకూలంగా మార్చుకుంటున్నారు. దీనికి భిన్నంగా ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్లు, 8 నుంచి 10లో ప్రస్తావించిన నేరాలకు సంబంధించి శిక్షకు గురికాబడిన సభ్యుడు, 3 నుంచి 6 ఏండ్ల పాటు చట్టసభలకు పోటీ చేయడానికి అనర్హుడు. అయితే, ఈ అనర్హతను రద్దుచేసే లేదా కాలవ్యవధిని తగ్గించే అధికారం కేంద్ర ఎలక్షన్ కమిషన్‌కు ఆ చట్టం కట్టబెట్టింది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద స్పీకర్ ముందు దాఖలైన ఫిర్యాదుల్లో తీర్పు తమకు వ్యతిరేకంగా వస్తుందని భావించి నాటి ఏపీ శాసనసభలోని ఆరుగురు సభ్యులు ముందుగానే తమ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దానితో అప్పటి స్పీకర్ వారి రాజీనామాలను ఆమోదిస్తూ ఎటువంటి తీర్పు ప్రకటించకుండా ఫిర్యాదులను మూసివేశారు. రాజీనామాలు ఆమోదించినా, భారత రాజ్యాంగంలో తదుపరి తీసుకోవలసిన శిక్షా నిబంధనల గురించి ఎలాంటి ప్రస్తావన లేదు. దీంతో మరే విధమైన చర్యలు తీసుకోకుండా అనర్హత వేటు ఫిర్యాదులను మూసివేయవలసి వచ్చిందని స్పీకర్ ప్రకటించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలో ఏ విధంగానైతే కొన్నేండ్ల పాటు పోటీ చేయడానికి అనర్హత వేటు కల్పించబడిందో అదేవిధంగా లక్షల ఓటర్ల అభీష్టం మేరకు ఒక పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడి ఆ పార్టీకి రాజీనామా చేయ కుండా వేరొక రాజకీయ పార్టీలోకి ఫిరాయిస్తే ఆ సభ్యుడి సభ్యత్వం రద్దు చేయాలి. అంతేకాదు తిరిగి చట్టసభలకు పోటీ చేయడానికి అనర్హుడిగా ప్రకటించే హక్కును స్పీకర్‌కు కల్పిస్తూ రాజ్యాంగ సవరణ చేయాలి. పార్టీ ఫిరాయింపు ఫిర్యాదును స్పీకర్ పరిష్కరించే కాలవ్యవధి కూడా రాజ్యాంగ సవరణ ద్వారా గడువు విధించాలి. అప్పుడే ఈ ఫిరాయింపుదారుల కట్టడి చేసినట్టవుతుంది. తెలంగాణలో పదిమంది ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించారు. వారి వ్యవహారం గత ఏడాదిన్నరగా ఎటూ తేలడం లేదు. సుప్రీం తీర్పు ఇచ్చినా కర్ర విరగకుండా..పాము చావకుండా అన్న రీతిలో సాగింది,. చట్ట సభలకు ఎన్నికైన వారు పార్టీలు మారే సందర్భంలో ఖచ్చితమైన నిబంధనలు ఉంటే తప్ప సభ్యుల్లో జవాబుదారీతనం పెరగదు. అధికారంలో ఉన్న పార్టీకి ప్రతిపక్ష పార్టీ సభ్యులను ప్రలోభపరిచే అవకాశం రాదు. అలాగే ప్రతిపక్ష పార్టీతో చేతులు కలిపి అధికార పక్ష పార్టీని అస్థిరపరచే కుట్రలకు అడ్డుకట్ట పడుతుంది. ఒకవేళ తాను ఎన్నుకోబడిన పార్టీ విధానాలు నచ్చకపోతే సభ్యుడు పార్టీకి రాజీనామా చేయాలి తప్ప పార్టీ మారడం ద్వారా ఓటర్ల తీర్పును కాలరాయరాదు. రాజకీయాల్లో సంస్కరణలు వస్తేనే ఇవన్నీ పరిష్కారం అవుతాయి. అందుకు రాజకీయ పార్టీలు సిద్ధంగా లేవు. ప్రజలే ఈ డిమాండ్లను పార్టీల ముందుంచాలి. చర్చించడం ద్వారా చైతన్యం తేవాలి.

## ఐడీపీఎల్ భూములపై ప్రభుత్వం విచారణ

**హైదరాబాద్,డిసెంబర్ 16( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలోని ఐడీపీఎల్ భూములపై తెలంగాణ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. కూకట్‌పల్లిలోని సర్వే నంబర్ 376లో రూ.4 వేల కోట్ల విలువైన భూములపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. భూ కబ్జాలపై ఇటీవల ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. కవిత భర్త అనిల్‌పై మాధవరం కృష్ణారావు భూకబ్జా ఆరోపణలు చేశారు. ఈ వివాదం సంచలనంగా మారిన నేపథ్యంలోనే ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

# ఢిల్లీలో జరిగే జాతీయ చింతన్ శిబిరంకు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని ఆహ్వానించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

- ప్రధాన రంగాల్లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, సమాలోచనలు వంటి కీలక అంశాలు చర్చిద్దామని మంత్రి కోమటి రెడ్డికి ఆహ్వానం
- ఇంటిగ్రేటెడ్ కనెక్టివిటీ ప్లానింగ్ - రీజినల్ మాస్టర్ ప్లాన్,రోడ్ నెట్వర్క్ అభివృద్ధి, ప్రాజెక్ట్ అంచనా, పెట్టుబడుల విధానం పై చర్చిద్దామని ఆహ్వాన లేఖలో పేర్కొన్న గడ్కరీ
- ఈనెల 19,20వ తేదీల్లో ఢిల్లీ వేదికగా జరగనున్న చింతన్ శిబిరం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ఆహ్వానం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఫెడరలిజం భావం పెంపొందిస్తుందన్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- బిన్న ప్రభుత్వాలు ఉన్నా ప్రజల అభివృద్ధి కేంద్రీకృతంగా జరిగే కేంద్ర, రాష్ట్రాల సమన్వయం ప్రజా స్వామ్యంలో శుభ సూచకమన్నా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి
- రాజకీయ పార్టీ నేపథ్యం వేరైనా వ్యక్తిగతంగా గడ్కరీ తనకు ఆప్తుడని..రాష్ట్ర అభివృద్ధి కోసం కలిసి పనిచేసేందుకు తమకు ఎలాంటి శషబిషలు లేవన్న మంత్రి
- రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంతో పనిచేసేందుకు సుముఖంగా ఉన్నామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అనేక వేదికల మీద చెప్పారని గుర్తు చేసిన మంత్రి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ చింతన్ శిబిరం-2025 కు ఆహ్వానించినందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 19-20 తేదీల్లో న్యూఢిల్లీ, యశోభూమి వేదికగా నిర్వహించనున్న ఈ చింతన్ శిబిరం కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. రహదారి మౌలిక వసతుల అభివృద్ధి, భూసేకరణలో డిజిటలైజేషన్, స్మార్ట్ రోడ్లు, రోడ్డు భద్రత, నాణ్యత ప్రమాణాల పెంపు వంటి అంశాలపై జరగనున్న చర్చలు రాష్ట్రాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రోడ్డు కనెక్టివిటీ, హైవే అభివృద్ధి,రోడ్డు భద్రత విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సన్నిహితంగా కలిసి పనిచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. జాతీయ చింతన్ శిబిరంలో తెలంగాణ రాష్ట్రం చురుకైన పాత్ర పోషిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అనుభవాలు మరియు ఉత్తమ విధానాలను ఈ వేదికపై పంచుకుంటామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో విజన్ 2047 తెలంగాణ రైసింగ్ నినాదంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకెళ్తుందని,ఇటీవల నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ లో తెలంగాణ రాష్ట్ర రోడ్ పాలసీని ఆవిష్కరించామని గుర్తు చేశారు. 49వేల కి.మీ రోడ్ నెట్వర్క్ ఉన్న తెలంగాణలో ప్రతి



రహదారి 4లేన్,6లేన్ రహదారులుగా మార్చే విజన్ తో వెళున్నామని లక్ష 15వేల కి.మీ రోడ్ నెట్వర్క్ లక్ష్యంగా పనిచేస్తున్నామని మంత్రి తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు,నేషనల్ హైవేలు పలు కారిడార్లు, మన్ననూరు - శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, NH 65 హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారి 8లేన్ విస్తరణ,భారత్ ఫ్యూచర్ సిటీ నుండి సౌత్ ఇండియా రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు అమరావతి,చెన్నై,బెంగళూరు, మచిలీపట్నం పోర్టు తో పాటు నాగపూర్ కు హై స్పీడ్ హైవే,బుల్లెట్ ట్రైన్ కారిడార్ల నిర్మాణ విజన్ తో పనిచేస్తున్నామని, అందుకు కేంద్ర సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల చర్చలు, సమన్వయం ద్వారా జటిలమైన సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. నితిన్ గడ్కరీ లేఖ ఫెడరల్ స్ఫూర్తికి నిదర్శనంగా నిలుస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఈ శిబిరంలో పాల్గొనేందుకు తెలంగాణ ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు హాజరవుతారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఈ సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి లేవనెత్తే అంశాలపై పూర్తి అజెండా రూపొందించాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీచేశారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు దేశ ఆర్థిక ప్రగతికి దోహదపడుతున్నాయని పేర్కొంటూ, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ నాయకత్వాన్ని మంత్రి అభినందించారు.

# ముఖ్యమంత్రికి మామయినా వినియోగదారుడే !

- ఇన్సూరెన్స్ క్లెయిమ్ తిరస్కరణ కమిషన్ లో పిర్యాదు
- డిల్లీకి రాజైనా తల్లికి కొడుకేనన్న సామెత లాగా ..
- ముఖ్యమంత్రికి మామయినా సాధారణ వినియోగదారుడే అని నిరూపించిన వైనమిది.
- నివా బూపా ఇన్సూరెన్స్ కంపెనీ తన మెడికల్ క్లెయిమ్ తిరస్కరించడంతో హైదరాబాద్ లోని రెండవ వినియోగదారుల కమిషన్ లో పిర్యాదు దాఖలు చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి కి స్వయానా మామ అయిన సూదిని పద్మారెడ్డి

**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
తెలంగాణ ముఖ్యమంత్రి కి స్వయానా మామ అయిన సూదిని పద్మారెడ్డి నివా బూపా ఇన్సూరెన్స్ కంపెనీ తన మెడికల్ క్లెయిమ్ తిరస్కరించడంతో హైదరాబాద్ లోని రెండవ వినియోగదారుల కమిషన్ లో పిర్యాదు దాఖలు చేశారు. బంజారాహిల్స్ లోని రోడ్ నంబర్ 10 లోని యంయల్ఏ యంపీ కాలనీలో నివసించే పద్మారెడ్డి 2024 మే 13 న గుండెనొప్పితో మెడికవర్ హాస్పిటల్ లో జాయిన్ అయ్యారు. చికిత్స కు అయిన సొమ్ము 23.50 లక్షలు చెల్లించి నివా బూపా కంపెనీ పాలసీ ప్రకారం ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేశారు. గత ఐదేళ్లుగా ప్రీమియం చెల్లిస్తూ 20 లక్షల పాలసీ ని రెన్యూ చేయించుకుంటున్నారు.తన మూడో ఏట నుండే పోస్ట్ పోలియో పెరాలసిస్ తో బాధపడుతున్న పాలసీ దారు క్లెయిమ్ ను పాలసీ ఇచ్చినప్పుడు అభ్యంతరం చెప్పని నివా బూపా ఇన్సూరెన్స్ కంపెనీ తీరా చికిత్స పొంది అయిన ఖర్చు క్లెయిమ్ చేశాక ఆ కారణం తో తిరస్కరించడం తో పిర్యాదీ ఫోరాన్ని ఆశ్రయించాడు. స్వయానా ముఖ్యమంత్రి మామ కే ఇలాంటి పరిస్థితి ఎదురైందంటే సామాన్య వినియోగ దారుల పరిస్థితి ఎలా ఉంటుందో అనడానికి ఇదొక చక్కటి ఉదాహరణ. సహేతుకం కాని కారణాలతో వివిధ ఇన్సూరెన్స్ కంపెనీ లు ఇదే రీతిలో వ్యవహరిస్తూ వినియోగదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. వినియోదరుల కమిషన్ లు వినియోగదారుల కు ఉపశమనం అందించినా అప్పీలు, పై అప్పీలు అంటూ కాల యాపన సైతం షరా మామూలైంది. తీర్పు అమలు కు కమిషన్ జారీ చేసే వారంట్లను పోలీసు యంత్రాంగం అమలు చేయక కాలయాపన చేయడం మరొక అడ్డంకి గా మారిందనడంలో ఎలాంటి సందేహం లేదు. గతంలో సీ యస్, సీ యస్ సీ లు వినియోగదారులే తెలంగాణ పూర్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన శాంతికుమారి , సివిల్ సప్లయిస్ కమిషనర్ లుగా పనిచేసిన డీ యస్ చౌహాన్ కూడా వినియోగదారుల కమిషన్ లను ఆశ్రయించారు. శాంతికుమారి మార్నింగ్ వాక్ కోసం కొనుగోలు చేసిన ఘూష్ విషయం లో హైదరాబాద్ వన్ కమిషన్ లో పిర్యాదు చేశారు. చౌహాన్ పోలీసు అధికారి హోదాలో కొనుగోలు చేసిన బోస్ కంపెనీ బ్లూటూత్ పనిచేయకపోవడంతో హైదరాబాద్ టూ కమిషన్ లో పిర్యాదు దాఖలు చేశారు. బోస్ కంపెనీ నోటీసులు అందకున్న మొట్టమొదటి వాయిదా లోనే లోపం ఉన్న బ్లూటూత్ బదులు సరికొత్త బ్లూటూత్ అందించి కేసు ముగించుకోవడం విశేషం. లేని పక్షం లో నష్టపరిహారం కేసు ఖర్చులు చెల్లించ వలసి వచ్చేది.అనేక కేసుల పరిష్కారం లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న వినియోగదారుల కమిషన్ లలో అవసరమైన వసతుల కల్పన పైన సుప్రీంకోర్టు తీర్పుతో ప్రభుత్వం దగ్గర పెండింగ్ లో ఉన్న వివిధ పెండింగ్ సమస్యలు త్వరంగా పరిష్కారం కమిషన్లు నూతన జవసత్వాలు అందిపుచ్చుకొని మరింత చురుకుగా పనిచేయడానికి ఉపకరిస్తుంది.

# హైదరాబాద్‌లోని సాలర్ జంగ్ మ్యూజియంలో ఫౌండర్స్ గ్యాలరీని ప్రారంభించిన గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ

**హైదరాబాద్, వెలుతురు డిసెంబర్ 16:**
హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియం 74వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫౌండర్స్ గ్యాలరీని తెలంగాణ గౌరవ గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ ఈ రోజు ప్రారంభించారు. సాలార్ జంగ్ మ్యూజియం వారసత్వాన్ని ప్రధానంగా ప్రస్తావించిన గవర్నర్... కళ, విజ్ఞానం పట్ల దార్శనికత, ఉత్సుకత, గౌరవాల అరుదైన సమ్మేళనాన్ని ఈ సంస్థ ప్రతిబింబిస్తుందని అన్నారు. భారతీయ, పాశ్చాత్య, తూర్పు ప్రాంతాల సంప్రదాయాలను సూచిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన గ్యాలరీలతో పాటు... అరుదైన చేతిరాత ప్రతులు, కాలిగ్రాఫిక్ రచనలు ఉన్న గొప్ప లైబ్రరీతో ఈ సాలార్ జంగ్ మ్యూజియం భవిష్యత్ తరాలకు సాంస్కృతిక వారసత్వాన్ని అందించే ముఖ్య భాండాగారంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. గురుదేవ్ రవీంద్రనాథ్ ఠాగూర్ మాటలను ఉటంకిస్తూ... “అత్యున్నత విద్య కేవలం మనకు సమాచారాన్ని అందించేది మాత్రమే కాదు, అది మన జీవితాన్ని సమస్త సృష్టితో సామరస్యంగా ఉండేలా చేస్తుంది” అని గవర్నర్ గుర్తుచేశారు. ఈ ఆదర్శాన్ని సాకారం చేయడంలో మ్యూజియంలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తూ... మ్యూజియాలను శక్తిమంతమైన అభ్యసన కేంద్రాలుగా మార్చాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. మ్యూజియాలు కేవలం స్థిరమైన ప్రదర్శన స్థలాలుగా, సందర్శకులను ఆకర్షించే సాధారణ ప్రదేశాలుగా కాకుండా యువత క్రియాశీల భాగస్వామ్యాన్ని పెంపొందించే అద్భుత అభ్యసన కేంద్రాలుగా పరిణామం చెందాలని ఆయన వ్యాఖ్యానించారు. కొత్త ప్రదర్శన స్థలాలను అభివృద్ధి చేయడం పట్ల మ్యూజియం అధికారులను అభినందించిన గవర్నర్... యువ ప్రేక్షకులను











ఆకర్షించడానికి వినూత్న విధానాలను అవలంబించడం కొనసాగించాలని కోరారు. దేశవ్యాప్తంగా మ్యూజియంలు ఎదుర్కొంటున్న సవాళ్లను, తగ్గుతున్న సందర్శకుల సంఖ్యనూ ప్రస్తావించిన గవర్నర్... సాలార్ జంగ్ మ్యూజియం సమాజ సేవలో భాగస్వామ్య, సమ్మిళిత, శక్తిమంతమైన సంస్థగా ఎదగడం ద్వారా ఒక నమూనాగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి శ్రీ ఎం. దాన కిషోర్, ఐఏఎస్... శ్రీమతి చందా పండిత్, ఐఏ & ఏఎస్... సాలార్ జంగ్ కుటుంబ సభ్యులు శ్రీ నవాబ్ అథెర్మ్ అలీ ఖాన్... హైదరాబాద్‌లోని సాలార్ జంగ్ మ్యూజియం డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక మేరీ ఫ్రాన్సిస్, ఐఏఎస్... ఉస్మానియా విశ్వవిద్యాలయం వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగరామ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రారంభించిన ఫౌండర్స్ గ్యాలరీ... సాలార్ జంగ్ కుటుంబంలోని మూడు తరాలకు చెందిన సాలార్ జంగ్ I, సాలార్ జంగ్ II, సాలార్ జంగ్ III ల అమూల్య కళా సేకరణలను ప్రదర్శిస్తుంది. ఈ కళాకృతులే మ్యూజియం ఏర్పాటుకు పునాది వేశాయి. ప్రపంచవ్యాప్తంగా అరుదైన కళా వస్తువులను సేకరించి, వాటిని జాగ్రత్తగా సంరక్షించడానికి తన జీవితాన్ని అంకితం చేసిన సాలార్ జంగ్ III పై ప్రత్యేక దృష్టి సారించిన ఈ ఫౌండర్స్ గ్యాలరీ... ప్రముఖ రాజనీతిజ్ఞులు, నిర్వాహకులు, కళా పోషకులుగా వారి పాత్రలను హైలైట్ చేస్తుంది. కళాత్మక చిత్రాలు, ఆయిల్ పెయింటింగ్‌లు, వ్యక్తిగత వస్తువులు, సావనీర్‌లు, ఉత్సవ వస్తువుల ద్వారా ఈ గ్యాలరీ సందర్శకులకు సాలార్ జంగ్ కుటుంబ జీవనశైలి, సాంస్కృతిక వాతావరణం, శాశ్వత వారసత్వం గురించి మంచి అవగాహనను అందిస్తుంది. భవిష్యత్ తరాల కోసం హైదరాబాద్ చరిత్రలోని ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని ఇది సంరక్షిస్తుంది.

# సంపాదకీయం.. ఎన్నికల సంస్కరణలపై ఆసక్తిలేని కాంగ్రెస్ ?

కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకపోవడంతో నానా తంటాలు పడుతోంది. పదేళ్లపాటు యూపిఎ ద్వారా ఓ వెలుగు వెలిగి నానా అరాచకాలకు పాల్పడింది. ఆనాడు పదేళ్లు ఎలా అధికారంలోకి వచ్చిందన్నది చెప్పడం లేదు. కేవలం ఓటు చోరీపైనే అధికారంలోకి వచ్చారా అన్నది ప్రజలకు చెప్పాలి. స్వాతంత్ర్యానం తరం అనేక ఏళ్లపాటు అధికారంలో ఉంది. అప్పుడు మరి ఓటు చోరీ చేశారా అన్నది చెప్పాలి. పార్లమెంటు లో ఓటు చోరీ సందర్భంగా కొన్ని మౌళిక ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. వాటికి కాంగ్రెస్ పార్టీ, విపక్ష నేత రాహుల్ సమాధానం చెప్పలేక పోయారు. హోంమంత్రి అమిత్ షా అనేక విషయాలను ప్రస్తావించారు. స్వాతంత్ర్యానంతరం ఎవరు ప్రధానిగా ఉండాలని ఓటింగ్ జరిగితే అంతా సర్దార్ పటేల్ పేరు చెప్పారు. కానీ నెహ్రూ మత్రమే ప్రధాని అయ్యారు. ఇందిర హయాంలె అలహాబాద్ హైకోర్టు, ఆమె ఎన్నిక చెల్లదని తీర్పు చెప్పింది. అలాగే ప్రధాన న్యాయమూర్తుల సీనియారిటీని కాదని ఐదో స్థానంలో ఉన్న వ్యవక్తిని చీఫ్ జడ్జిగా నియమించారు.ఇలా అనేక అంశాలను అమిత్ షా ప్రస్తావించారు. ఇవన్నీ ఎందుకు చర్చించాలంటే ... కాంగ్రెస్ అధికారం కోల్పోతే ఓట్ చోరీ జరగిందని ఇటీవల రాహుల్ రంకెలు వేస్తున్నారు. ఢిల్లీలో ర్యాలీలు తీసి నానా హంగామా చేశారు. నిజానికి సర్‌పై చర్చలో ప్రధాన అంశాలేవీ చర్చకు రాలేదు. ఎన్నికల సంస్కరణలపై చర్చలో కాంగ్రెస్‌కు పెద్దగా ఆసక్తి లేదు. కేవలం ఓట్ల తొలగింపుపైనే కాంగ్రెస్ మండిపడుతోంది. అయితే పాక్, బంగ్లాదేశ్‌ల నుంచి అక్రమంగా వసలవచ్చిన వారి ఓట్లను తొలగించడం ద్వారా ఎన్నికల సంఘం తన విధిని తాను చేసుకుంటూ పోతోంది. రాజ్యాంగ సంస్థ అయిన



ఎన్నికల సంఘాన్ని తప్పుపట్టడం ద్వారా రాహుల్ రాజ్యాంగ ద్రోహానికి పాల్పడ్డారనే భావించాలి. అలాగే భారత రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో పేర్కొన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద దాఖలైన ఫిర్యాదులపై చట్టసభల స్పీకర్ ఉత్తర్వులు వెలువరించటానికి కాలవ్యవధిని నిర్దేశిస్తూ సుప్రీంకోర్టు గత తీర్పుల్లో ప్రకటించింది. కోర్టు ధిక్కార ఉత్తర్వుల దాకా వెళ్లిన దాఖలాలూ ఉన్నాయి. అయినా, రాజ్యాంగం ప్రసాదించిన విచక్షణ హక్కును సభాపతి సహేతుకమైన సమయంలో ఉపయోగించట్లేదనేది వాస్తవం. దీనిని ఎక్కడా రాహుల్ ప్రస్తావించలేదు. పార్లమెంట్ చర్చలో ఎక్కడా ఫిరాయింపులపై మాట్లాడడం లేదు. ఎందుకంటే ఒక రాజకీయ పార్టీ టికెట్‌పై ఎన్నికల్లో గెలిచిన ఒక సభ్యుడు ఎన్నికల తర్వాత అధికార పార్టీలో చేరడం అలవాటు చేసుకున్నాడు. దేశవ్యాప్తంగా ఇది జరుగుతోంది. గెలిచిన వారు మరో రాజకీయ పార్టీలో చేరటం ఆనవాయితీగా మారింది.

ఒక రాజకీయ పార్టీ ప్రతినిధిగా ఎన్నుకోబడిన సభ్యుడు ఆ ఓటర్ల తీర్పును కాలరాచి తన ఇష్టానుసారంగా అధికారంలో ఉన్న పార్టీలోకి మారిపోతున్నారు. పార్టీలు మారే ఈ విధానం మొట్టమొదటగా హర్యానాలో 'ఆయారామ్ గయారామ్'గా, ప్రచారంలోకి వచ్చింది. అధికారంలో ఉన్న పార్టీలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఎక్కువగా తెచ్చుకునే అవకాశం ఉంటుందని చెప్పడం ద్వారా రాజకీయ పార్టీలు ప్రజలను వంచిస్తున్నాయి. అంటే విపక్షంలో ఉంటే నియోజకవర్గ అభివృద్ధిని పట్టించుకోక పోవడం అధికార పార్టీ తప్పిదంగా గుర్తించాలి. ఇలా పార్టీలు మారడం తెలుగు రాష్ట్రాల్లో చూశాం. తన నియోజక వర్గంలోని ఓటర్ల అభీష్టం మేరకే అధికార పార్టీ కండువా కప్పుకొన్నట్టు చెప్పుకోవటం సాకు మాత్రమే. అక్రమంగా వెనుకేసుకున్న ఆస్తులను సీబీఐ లేదా ఇతర దర్యాప్తు సంస్థల నుంచి కాపాడుకునేందుకు, దర్యాప్తులు జరగకుండా చూసుకునేందుకు చేస్తున్న విన్యాసాలు తప్ప మరోటి కాదు. ఇది కళ్లకు కనిపిస్తున్న నిజం. కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. దీనిపై పార్లమెంటులో చర్చించడం రాహుల్‌కు ఇష్టం ఉండదు. ఎందుకంటే కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ ప్రోత్సహించింది. ఇలా చర్చిస్తే తమ బండారం ఎక్కడ బయట పడుతుందో అన్న భయం. అందుకే అక్రమంగా ఉన్న ఓట్లను తొలగించడం రాహుల్‌కు నచ్చదు. ఓట్ చోరీ అంటూ ప్రచారం చేసి బీహార్‌లో బొక్కబోర్లా పడ్డారు. కాంగ్రెస్ ఓట్ చోరీకి ఇండియా కూటమితో సంబంధం లేదని కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా తాజాగా చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌కు కనువిప్పు కావాలి.

ఇండియా కూటమిలో దీనిపై స్పష్టత లేదా ఏకాభిప్రాయం లేదని అర్థం అవుతోంది. 'పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం' అనేది ఒకటి ఉన్నదని, దానికి కట్టుబడి ఉండాలనే నియమం చాలామంది చట్టసభల సభ్యుల్లో కనపడడం లేదు. ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలో చేరిన సభ్యుల సభ్యత్వం రద్దు ఫిర్యాదులు ఎంతకాలానికి పరిష్కారమవుతాయో చెప్పలేని పరిస్థితి నెలకొన్నది. ఐదేండ్ల సభ కాలపరిమితి కూడా ముగిసిపోతోంది. కోర్టుల్లో కూడా కేసులు తేలడం లేదు. తెలంగాణలో వేములవాడ ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని రమేశ్ పౌరసత్వ వివాదం దాదాపు ఓ దశాబ్ద కాలం నడిచింది. ఆయన భారత పౌరుడా కాదా అన్నది కూడా తేల్చడంలో ఏళ్లు పడితే ఎలా. ఇవన్నీ కూడా ఎన్నికల సంస్కరణలో చర్చించాల్సిన అంశాలే. ఎన్నికల అంశాలన్నింటిని చర్చించి పారదర్శక విధానాలు అవలంబించాలి. అప్పుడే మన ఎన్నికల వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది. అది చేయకుండా కేవలం ఓట్ చోరీ అంటూ అక్రమ వలసదారులకు అండగా దేశంలో స్థానం కల్పించడం దేశద్రోహమే అవుతుంది. అందువల్ల సమగ్ర ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగాలి. తద్వారా రాహుల్ మంచి ఇమేజ్ సంపాదించుకోవచ్చు. అందుకు కాంగ్రెస్ పూనుంటే బాగుండేది. కానీ ఎన్నికల సంస్కరణలకు ఎవరు కూడా సిద్దంగా లేరని అర్థం అవుతోంది. అందుకే చర్చ అసమగ్రంగానే సాగింది.

## బ్రెజిల్‌లో తుఫాన్ బీభత్సం

**- బలమైన గాలులకు కుప్పకూలిన స్టాట్యూ ఆఫ్ లిబర్టీ**



**న్యూఢిల్లీ,డిసెంబర్16( వెలుతురు):**

బ్రెజిల్ బలమైన తుఫాను అతలాకుతలం చేసింది. బలమైన గాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దక్షిణ బ్రెజిల్‌లోని రియో గ్రాండే డో సుల్ రాష్ట్రంలో గాలుల తీవ్రత అధికంగా ఉంది. ఈ గాలుల తీవ్రతకు మెట్రోపాలిటన్ ప్రాంతంలోని పోర్టో అలెగ్రే సమీపంలో గల గువైబా నగరంలో ఉన్న స్టాట్యూ అఫ్ లిబర్టీ విగ్రహం ఒక్కసారిగా నేలకూలిపోయింది.దాదాపు 24 మీటర్ల పొడవున్న ఈ విగ్రహం హవాన్ రిటైల్ దుకాణంలోని పార్కింగ్ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. అయితే, బలమైన గాలులకు అది ఒక్కసారిగా కూలి పార్కింగ్ ప్లేస్‌లో పడిపోయింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో అక్కడ ప్రజలు ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విగ్రహం కూలుతున్న దృష్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక తుఫాన్ సమయంలో గాలి వేగం గంటకు 90 కిలోమీటర్లకు మించి నమోదైనట్లు స్థానిక మీడియా పేర్కొంది. మెట్రోపాలిటన్ ప్రాంతమంతా తీవ్రమైన వాతావరణ హెచ్చరికలు జారీ అయ్యాయి.

# ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డు

**600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరిక**

**న్యూయార్క్,డిసెంబర్16( వెలుతురు):**

అమెరికన్ టైకూన్, ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సరికొత్త రికార్డును నెలకొల్పారు. వ్యక్తిగత సందప పరంగా మస్క్ ఏకంగా 600 బిలియన్ డాలర్ల క్లబ్‌లోకి చేరారు . తద్వారా ప్రపంచంలోనే తొలిసారి ఈ రికార్డు నెలకొల్పిన వ్యక్తిగా మస్క్ చరిత్ర సృష్టించారు. మస్క్ స్థాపించిన అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ విలువ 800 బిలియన్ డాలర్లకు చేరుకుని, ఐపీఓగా వచ్చే అవకాశం ఉందనే వార్తల నేపథ్యంలో ఆయన సంపద ఈ స్థాయికి పెరగడం విశేషం. వచ్చే ఏడాది స్పేస్‌ఎక్స్ పబ్లిక్‌లోకి వెళ్లడానికి సిద్ధమవుతోందని రాయిటర్స్ వార్తాసంస్థ గత వారం నివేదించిన విషయం తెలిసిందే. స్పేస్‌ఎక్స్‌లో మస్క్‌కు దాదాపు 42శాతం వాటా ఉంది. ఈ సంస్థ వాల్యూ పెరగడంతో మస్క్ సంపద కూడా వృద్ధి చెందింది. ఒక్క రోజులోనే 168 బిలియన్ డాలర్లు పెరిగి సోమవారం మధ్యాహ్నం సమయానికి మస్క్ నికర సంపద దాదాపు 677 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ వెల్లడించింది. ఇక ఈ ఏడాది అక్టోబరులో మస్క్ నికర సంపద 500 బిలియన్ డాలర్లు దాటిన సంగతి తెలిసిందే. 2022లో మస్క్ సంపద 200 బిలియన్ డాలర్ల కంటే దిగవుకు పడిపోయింది. ఆ తర్వాత మస్క్ సంపద పెరుగుతూ వస్తోంది. ఈ మూడేళ్లలోనే మస్క్ సంపద 600 బిలియన్ డాలర్లు దాటడం విశేషం. ఇప్పటివరకు ప్రపంచంలో ఏ కుబేరుడు ఈ స్థాయిలో సంపదను ఆర్జించలేదు. మరోవైపు కార్పొరేట్ చరిత్రలోనే




అత్యధిక జీతం అందుకుంటున్న సీఈవోగా మస్క్ రికార్డు క్రియేట్ చేశారు. జీతం కింద మస్క్‌కు ట్రిలియన్ డాలర్లు ఇచ్చేందుకు టెస్లా కంపెనీ షేర్‌హోల్డర్లు ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. టెక్సాస్‌లోని ఆస్టిన్‌లో గత నెల జరిగిన టెస్లా వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పే ప్యాకేజీలో కొత్త రికార్డు క్రియేట్ అయ్యింది. మస్క్‌కు ట్రిలియన్ డాలర్ల పే ప్యాకేజీ అందాలంటే ఆయన ముందు కొన్ని టా÷-గ్గ÷ట్లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం టెస్లా మార్కెట్ విలువ 1.4 ట్రిలియన్ల డాలర్లుగా ఉన్నది. అయితే ఆ మార్కెట్ విలువను ఆయన 8.5 ట్రిలియన్ డాలర్లకు చేర్చాల్సి ఉంటుంది. స్వీయ డ్రైవింగ్ చేస్తున్న లక్షల సంఖ్యలో రోబోట్యాక్సీ వాహనాలను ఆయన కమర్షియల్ ఆపరేషన్‌లోకి తీసుకురావాల్సి ఉంటుంది. ఒకవేళ అన్నీ అనుకుట్లే సాగితే, ప్రపంచ కుబేరుడు మస్క్ ప్రపంచంలోనే తొట్టతొలి ట్రిలియనీర్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

## శ్రీవారి ఆలయంలో నేటినుంచి తిరుప్పావై సేవ

**తిరుమల,డిసెంబర్16( వెలుతురు):**



ధనుర్మాసం సందర్భంగా తిరుమల శ్రీవారి అలయంలో సుప్రభాత సేవ బదులు తిరుప్పావై పాశురాలను ప్రవచిస్తారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం నుంచి నెల రోజుల పాటు సుప్రభాత సేవ రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని సూచించారు. ఈమేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం మధ్యాహ్నం 1:23 గంటలకు ధనుర్మాస ఘడియలు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. బుధవారం నుంచి తిరుప్పావై పాశురాలతో శ్రీవారికి మేలుకొలుపు జరుపుతున్నట్లు వివరించారు. ధనుర్మాసం సందర్భంగా మూల విరాట్టుకు బిల్వపత్రాలతో సహస్ర నామార్చన జరిపిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. శ్రీవల్లి పుత్తూరు చిలుకలతో రోజూ స్వామి వారికి అలంకరణ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీవారికి విశేష నైవేద్యాలుగా బెల్లం దోశ, శొండెలు, సీరా, పొంగల్ వంటి ప్రత్యేక ప్రసాదాలు నివేదన చేస్తున్నట్లు వివరించారు. భోగశ్రీనివాసమూర్తికి బదులుగా శ్రీకృష్ణస్వామి వారికి ఏకాంతసేవ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

## పరకామణి లెక్కింపు ఇంకా పాతపద్ధతేనా?

**- ఆధునీకరణ దిశగా సాగాలి...ఎఐ వినియోగం చేపట్టండి**

**- ఎపి హైకోర్టు కీలక సూచనలు**



**అమరావతి,డిసెంబర్16( వెలుతురు):**

టీటీడీ పరకామణి లెక్కింపును ఆధునీకరించాలని రాష్ట్ర హైకోర్టు సూచించింది. ఆధునికకాలంలో కూడా పాతపద్ధతిలో లెక్కింపు సరికాదని తెలిపింది. పరకామణి చోరీ కేసుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఇరుపక్షాల న్యాయవాదుల మధ్య వాదోపవాదనలు జరిగాయి. ఈ సందర్భంగా హైకోర్టు పలు కీలక సూచనలు చేసింది. తిరుమల శ్రీవారి పరకామణిలో జరిగే చోరీలను సాధారణ దొంగతనంగా చూడటానికి వీల్లేదని స్పష్టం చేసింది. కానుకల రూపేణా వచ్చిన సొమ్ము చోరీకి గురయితే కోట్లాదిమంది భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని హైకోర్టు తెలిపింది. పరకామణిలో కానుకల లెక్కింపు ప్రక్రియను ఆధునీకీకరించాల్సిన అవసరముందని వెల్లడించింది. మానవ ప్రమేయాన్ని తగ్గించి.. యంత్రాలు, ఏఐ టెక్నాలజీని వినియోగించాలని తిరుమల తిరుపతి దేవస్థానానికి సూచించింది. టీటీడీలో ఇలాంటి చోరీ ఘటనలు జరుగుతున్నా కానుకలు లెక్కించేందుకు అదే పాత విధానాన్ని అనుసరించడం సరికాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. కానుకల లెక్కింపునకు సేవాభావంతో వచ్చిన భక్తులను దుస్తులు లేకుండా సోదాలు చేయడం, దొంగల్లా అవమానించడం తగదని పేర్కొంది. కానుకలు లెక్కింపునకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను వినియోగించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో తగిన సూచనలు, సలహాలతో తమ ముందుకు రావాలని సూచించింది. ఈ క్రమంలోనే ఇరుపక్షాల న్యాయవాదులకు ఏపీ హైకోర్టు పలు సూచనలు చేసింది.

## ఉచిత బస్సుతో పెరిగిన ఆర్టీసీ ఆదాయం

**- తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి**

**భద్రాచలం,డిసెంబర్16( వెలుతురు):**

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ప్రభుత్వం నుంచి ఆర్టీసీకి రాబడి పెరుగుతోందని తెలంగాణ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి అన్నారు. మంగళవారం భద్రాచలం ఆర్టీసీ డిపోను ఎండీ నాగిరెడ్డి సందర్శించారు. మొక్కలు నాటిన తరువాత బస్సులను పరిశీలించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రోజూ 10 వేల బస్సుల్లో 60 లక్షల మందిని తరలిస్తున్నామని, వీరిలో దాదాపు 45 లక్షల మంది మహిళలు ఉన్నారని తెలిపారు. ఇప్పటి వరకు 250 కోట్లకు పైగా మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు వివరించారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు రూ.8,500 కోట్లు ఆదా అయ్యిందని అన్నారు. రెండేళ్లలో 2,500 కొత్త బస్సులు కొనుగోలు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో 800కు పైగా ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయని తెలిపారు. మూడేళ్లలో హైదరాబాద్ వ్యాప్తంగా.. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లోనూ ఎలక్ట్రిక్ బస్సులు తీసుకువస్తామని నాగిరెడ్డి తెలిపారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం ధరలు

**ముంబై,డిసెంబర్16( వెలుతురు):**

మార్కెట్లో బంగారం ధరలు కాస్తంత తగ్గాయి. గుడ్ రిటర్న్ వెబ్‌సైట్ ప్రకారం.. హైదరాబాద్‌లో మంగళవారం నాటికి దేశంలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారంపై రూ.1520 మేర తగ్గి.. రూ.1,33,860గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ గోల్డ్‌పై రూ.1,400 పతనమై.. రూ.1,22,700గా ఉంది. ఇక వెండి విషయానికొస్తే.. నిన్న ఆకాశాన్నంటిన వెండి ధరలు.. మంగళవారం కాస్త తగ్గాయి. ప్రస్తుతం.. కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారెట్ల మేలిమి పసిడి ధర రూ.1,34,730గా ట్రేడవుతోంది. ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి రేటు రూ.1,34,010గా ఉంది.

సోమవారం భారీ స్థాయిలో గరిష్ఠ స్థాయికి ఎగబాకిన వెండి రేట్లు నేడు కాస్త తగ్గాయి. నిన్నటితో పోల్చగా.. కిలో వెండిపై రూ.3,900 మేర తగ్గింది. ప్రస్తుతం.. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రేటు రూ.2,11,000గా ఉంది. చెన్నై సహా పలు ప్రముఖ నగరాల్లోనూ దాదాపు ఇవే ధరలు కొనసాగుతున్నాయి. భారత్-అమెరికా డీల్‌పై కొనసాగుతున్న సందిగ్ధత, డాలర్‌తో పోలిస్తే తగ్గుతున్న రూపాయి మారకం విలువ, ఫెడ్ వడ్డీ రేటులో కోత వెరసి పసిడి, వెండి ధరలకు రెక్కలొచ్చేలా చేస్తున్నాయి. పైన పేర్కొన్న బంగారం, వెండి రేట్లు మార్కెట్లలో ఎప్పటికప్పుడు మారుతుంటాయి.

## ధన్వంతరి ఫౌండేషన్ రెండు వేయుల మంది నుండి 220 కోట్లు వసూలు చేశారని బాధితుల ఆందోళన




**బషీర్ బాగ్ వెలుతురు 16 డిసెంబర్ :**
ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులను జప్తు చేయాలంటూ నాంపల్లి క్రిమినల్ కోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు సమర్థిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఉత్తర్వుల పట్ల ధన్వంతరి ఫౌండేషన్ బాధితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ధన్వంతరి అగ్రీవుడ్ ఇన్వెస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అన్నమరాజు నాగరాజు మాట్లాడుతూ.... కమలాకర శర్మ ధన్వంతరి ఫౌండేషన్ ఏర్పాటు చేసి , తమకు అధిక లాభాలు ఆశచూపి , సుమారు రెండు వేల మంది నుండి 220 కోట్లు వసూలు చేశారని తెలిపారు. 2023 లో బాధితులైన తాము హైదరాబాద్ సీసీఎస్ లో ఫిర్యాదు చేశామని.సీసీఎస్ డిసిపి శ్వేతా , ఏసీపీ ఆదినారాయణ పర్యవేక్షణలో కేసు పురోగతి సాధించిందన్నారు. ఈ కేసులో నాంపల్లి క్రిమినల్ కోర్టు ధన్వంతరి ఆస్తులను జప్తు చేసి , బాధితులకు న్యాయం చేయాలని తీర్పు ఇచ్చిందన్నారు. అయితే కమలాకర శర్మ ఆ తీర్పు పై స్టే కోరుతూ హైకోర్టులో ఫిటిషన్ దాఖలు చేశారన్నారు. సీసీఎస్ పోలీసులు , పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలతో హైకోర్టు కింది కోర్టు తీర్పును సమర్థించిందని తెలిపారు. త్వరిత గతిన ఒక జ్యుడీషియల్ కమిటీ వేసి ధన్వంతరి ఆస్తులను అమ్మి బాధితులమైన తమకు న్యాయం చేయాలని తీర్పు వెల్లడించిందని పేర్కొన్నారు. న్యాయస్థానం తీర్పును తొందరగా అమలు చేసి , తమకు న్యాయం చేయాలని సీసీఎస్ పోలీసులను కోరారు.

## ప్రాణహాని ఉందంటూ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన కందురీ చిన్న లింబయ్య



**బషీర్ బాగ్ వెలుతురు 16 డిసెంబర్ :**
కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లి గ్రామానికి చెందిన రైతు కందురీ చిన్న లింబయ్య తనకు తాత -ముత్తాతల నుండి వంశపారంపర్యంగా వచ్చిన సుమారు 7 ఎకరాల స్వంత వ్యవసాయ భూమిని అక్రమంగా కబ్జా చేయాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. తన కులానికి చెందిన కొందరు వ్యక్తులు పోలీసుల ప్రోత్సాహంతో తన భూమిని స్వాధీనం చేసుకోవాలనే ఉద్దేశంతో తనను అడ్డుతొలగించేందుకు ప్రయత్నిస్తున్నారని లింబయ్య వాపోయారు. ఈ క్రమంలో తనను చంపుతామని బెదిరింపులు చేస్తూ, తన కుటుంబాన్ని వేధిస్తున్నారని తెలిపారు.ఆక్రమణదారులు మాసురి అనిల్, మాసురి బైరయ్యతో పాటు మరికొందరు వ్యక్తులు తనపై దాడులు చేస్తున్నారని, ఇప్పటికే మూడుసార్లు తనపై దాడి చేసి గాయపరిచినప్పటికీ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం కాకుండా, తనపైనే కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో న్యాయం కోసం సోమవారం నాంపల్లి లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను లింబయ్య ఆశ్రయించారు. తన ప్రాణాలకు రక్షణ కల్పించాలని, అక్రమ భూకబ్జా ప్రయత్నాలను అడ్డుకోవాలని, తన వ్యవసాయ భూమిని కాపాడి శాంతియుతంగా వ్యవసాయం చేసుకునేలా న్యాయం చేయాలని కమిషన్‌ను విజ్ఞప్తి చేశారు.

## 41 నాన్ డ్యూటి పెయిడ్ లిక్కర్ పట్టివేత..



**బషీర్ బాగ్ వెలుతురు 16 డిసెంబర్ :**
శంషాబాద్ ఎయిర్ పోర్టు సమీపంలోని ప్రధాన రహదారిపై ఎస్టీఎఫ్ ఏ టీమ్ లీడర్ అంజిరెడ్డి సిబ్బంది కలిసి తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో 41 మద్యం బాటిళ్ల ఢిల్లీ, గోవా ప్రాంతాల నుంచి మద్యం బాటిళ్లను కొనుగోలు చేసి తెలంగాణ తీసుక వస్తున్నారు. నాన్ డ్యూటి పె యిడ్ లిక్కర్ (ఎన్‌డీపీఎల్) కేసు నమోదు చేశారు.మద్యం బాటిళ్లను మీర్‌పేట్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించినట్లు అంజిరెడ్డి తెలిపారు.

## విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను చదువుతున్న పీజీ,పీహెచ్డీ విద్యార్థులందరికీ స్కాలర్ షిప్ లు,ఫెలోషిప్ లు అందించాలి

**- న్యూఢిల్లీ లోనీ యూజీసీ చైర్మన్ గారిని కలిసి విజ్ఞప్తి చేసిన బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**


**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 16:**
విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసిస్తున్న పీజీ,పీహెచ్డీ విద్యార్థులందరికీ స్కాలర్ షిప్ లు,ఫెలోషిప్ లు అందించాలని కోరుతూ మంగళవారం రోజున న్యూఢిల్లీ లోనీ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ గారి కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేసినట్లు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారూ. ఈ సందర్బంగా లింగంగౌడ్ మాట్లాడుతూ ఉన్నత విద్యలో సమానత్వం మరియు నాణ్యతను ప్రోత్సహించడంలో యూజీసీ అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యను అభ్యసించేది 90% బడుగు బలహీన వర్గాల విద్యార్థులేనని ఫెలో షిప్ లు స్కాలర్ షిప్ లు,పరిశోధన గ్రాండ్లకు యూజీసీ సహాయం చేసి ఉన్నత విద్యను మరింత బలోపేతం చేసే విధంగా యూజీసీ మరింత కృషి చేయాలని అన్నారు.నాన్ నెట్ ఫెలోషిప్ లు పునరుద్ధరించి ఆర్థిక సాయం పెంచాలి అంతేకాకుండా మహాత్మ జ్యోతిబాపూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పరిశోధక కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతిపత్రంలో లింగంగౌడ్ పేర్కొన్నారు.



## బడంగ్పేట్ డివిజన్ ను ఎల్బీనగర్ జోన్ కు మార్చాలని డిమాండ్

**- బిజెపి రాష్ట్ర నేత మాజీ సింగల్ విండో చైర్మన్ కొలను శంకర్ రెడ్డి**

**బడంపేట్ వెలుతురు డిసెంబర్ 16:**



బడంపేట్ కార్పొరేషన్ను ఎల్బీనగర్ జోన్ లో కలపాలని జోనల్ కమిషనర్ ని బిజెపి సీనియర్ నాయకులు కలవడం జరిగింది, బడంపేట్ కార్పొరేషన్లు వెంటనే ఎల్బీనగర్ ఎల్బీనగర్ జోన్ కు మార్చి ఆత్రుతని ప్రత్యేక జోనుగా ప్రకటించాలని బిజెపి డిమాండ్ చేస్తున్నాము బడంపేట్ కార్పొరేషన్ ను వెంటనే ఎల్బీనగర్ మార్చాలని ఆ తర్వాత బడంగ్పేట్ కార్పొరేషన్ ను ప్రత్యేక జోన్గా ప్రకటించాలని బిజెపి రాష్ట్ర నేత మాజీ సింగల్ విండో చైర్మన్ కొలను శంకర్ రెడ్డి బృందం డిమాండ్ చేశారు మహేశ్వరం ఎల్బీనగర్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మలక్పేట్ నియోజకవర్గంలో ఉండేది కావున అలాగే మున్సిపాలిటీ లో ప్రాంతాలు బాగాలు బాగాలుగా బడంగ్పేట్ మీర్పేట్ తుర్కయంజాల్ ఆదిపట్ల తుర్కయంజాల్ హస్తినాపురం ప్రాంతాలలో కలుపుకో పోతుగా కలిసి ఉన్నాయి అందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎల్బీనగర్ జోన్ కి తాత్కాలికంగా మార్చాలని ఆధ్వరితనే ఇవ్వడం ప్రత్యేక జోన్గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాము అలాగే డివిజన్ ఏర్పాటు కూడా పాతబస్తీ హైదరాబాదులోని విధానాన్ని అన్ని ప్రాంతాలలో ఒకే కొనసాగించాలని బిజెపి రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేషన్ ను డిమాండ్ చేస్తుంది ప్రజల సంక్షేమం ప్రజల అభివృద్ధికి అనుకూలంగా చేయాలని విజ్ఞప్తి కొలను శంకర్ రెడ్డి బిజెపి రాష్ట్ర సీనియర్ నాయకుడు శేఖర్ రెడ్డి రాముడి మహేందర్ రెడ్డి జోనల్ కమిషనర్ ని చార్మినార్ జోన్ ని కలిసి ఇవ్వడం జరిగింది

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి వెల్లడించాలి

- **బీసీలను అణిచివేయాలని చూస్తే దేశంలో తిరుగుబాటు తప్పదు..**
- **బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్**
- **బీసీ బిల్లుకు మద్దతు తెలిపి ప్రధాని బీసీలపై చిత్తశుద్ధి నిరూపించుకోవాలి.**
- **మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్**



**న్యూఢిల్లీ వెలుతురు డిసెంబర్ 16:**
బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుపై కేంద్ర ప్రభుత్వ వైఖరి వెల్లడించాలనీ కోరుతూ ఢిల్లీలోని తెలంగాణ భవన్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద బీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు ఈ సందరరేగా బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేసి కేంద్ర ప్రభుత్వనికి పంపిందని ఇంతవరకు ఆ బిల్లుపై ఎలాంటి నిరయం తీసుకోకుండా నాన్చుడు ధోరణి అవలంభించడం సరికాదని అన్నారు. మాజి మంత్ర వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు అమలు కాకుండా బిజెపి అడుగడుగున అడ్డుకుంటుందని బీసీ రిజర్వేషన్లపై రాజకీయ పార్టీలకు చిత్తశుద్ధి ఎండగట్టడానికి పార్లమెంటులో బిఆర్ఎస్ ప్రవేట్ బిల్లును ప్రవేశపెట్టామని,కాంగ్రెస్ బిజెపిలకు చిత్తశుద్ధి ఉంటే టిఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన ప్రైవేటు బిల్లుకు మద్దతు తెలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష?, వీరస్వామి బండి గారి రాజు తాటికొండ శ్రీనివాసాచారి కవులే జగన్నాథం జాజుల భాస్కర్ మాధవ్ లలిత సునీత భాగ్యమ్మ భాస్కర్ వెంకట్ యాదవ్ రజని లు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో అధికారులు విధులు జాగ్రత్తగా వ్యవహరించాలి

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి**



పోలింగ్ సామాగ్రిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి



మంచాలలో అధికారులకు సూచనలు ఇస్తూ ప్రసంగిస్తున్న రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి

**మంచాల వెలుతురు డిసెంబర్ 16:**
మంచాల మండలం మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల సందరరేగా మంచాల మండలం కేంద్రంలోని దండేట్ కార్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్నిజిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి సందర్శించి మాట్లాడుతూ బుధవారం జరిగే మూడవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతి అధికారి జాగ్రత్తగా వ్యవహరించాలని చిన్న పొరపాట్లు జరగకుండా విధులునిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి గ్రామ పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎలక్షన్ మెటీరియల్ పంపిణిని పరిశీలించారు ప్రతి పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామాగ్రిని పోలింగ్ కేంద్రం వారిగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు పోలింగ్ మెటీరియల్ పంపిణీ ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు ఎన్నికల సామాగ్రిని బ్యాలెట్ పేపర్లను పోలింగ్ బాక్సులను పరిశీలించారు బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటి రియల్ క్షుణ?ంగా పరిశీలించి అన్ని సరిగా ఉన్నాయ లేవ నిర్ధారణ చేసుకొని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి బయలుదేరాలని సూచించారుఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని త్రాగునీరు లైటింగ్ పార్కింగ్ ప్రదేశాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు పోలింగ్ సిబ్బంది నిర్వహించే వారి విధులను క్షుణ?ంగా వివరించారు ఈ కార్యక్రమంలో ఇబ్ర హీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి తహసీల్దార్లు ఎంపిడిఓలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

## కుష్టు వ్యాధి నిర్మూలన ప్రోగ్రాంలో భాగంగా ఈనెల 18 నుండి 31 వరకు వర్క్ షాప్..




రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి డాక్టర్ లలితా దేవి

**రంగారెడ్డి జిల్లా వెలుతురు డిసెంబర్ 16:**
జిల్లా వైద్య, , ఆరోగ్య శాఖాధికారి, రంగారెడ్డి జిల్లా కార్యాలయం లో జాతీయ కుష్ఠ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా, కుష్ఠ వ్యాధి గుర్తింపు ఉద్యమం, ఎల్సిడిసి కార్యక్రమం పై జిల్లాలోని జిల్లా స్థాయి అధికారులు, వైద్యాధికారులు, సిబ్బందికి వర్క్ షాప్, శిక్షణ కార్యక్రమం ఈనెల 18 నుండి 31 వరకు జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. లలితా దేవి తెలిపారు. ఈ మేరకు మంగళవారం రోజున జిల్లా వైద్యాధికారి కార్యాలయం నుండి పత్రికా ప్రకటన విడుదల చేశారు. వర్క్ షాప్ ప్రోగ్రాంలో భాగంగా ఆశ కార్యకర్తలు ఉదయం ప్రతీ ఒక్కరి ఇంటికి వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలకోసం పరీక్షలు చేస్తారని చెప్పారు. అనుమానం ఉన్నవారిని దగ్గర లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తారని చెప్పారు. ప్రతీ ఒక్కరు అంకిత భావంతో పనిచేసి కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి, డా. పాపా రావు మాట్లాడుతూ, వ్యాధి వ్యాప్తి చెందే విధానం, లక్షణాలు, చికిత్స గురించి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా పారా మెడికల్



అధికారి సులోచన మాట్లాడుతూ కుష్ఠ వ్యాధి గుర్తింపు ఉద్యమంలో ప్రతీ రోజు, సర్వే చేసే విధానం, రిపోర్టు తయారు చేసే పద్ధతి గురించి వివరిస్తూ మాట్లాడారు. ఈ కార్యక్రమం లో జిల్లాలోని వివిధ ప్రోగ్రాం అధికారులు, ఉప జిల్లా వైద్య , ఆరోగ్య అధికారులు, వైద్యాధికారులు, లేప్రసి సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, పాల్గొన్నారు.

## గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ హ్యూమన్ పాపిలోనా వైరస్ వ్యాక్సిన్ పైన అవగాహన సదస్సు






**రంగారెడ్డి జిల్లా వెలుతురు డిసెంబర్ 16:**
రంగారెడ్డి జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి ఆధ్వర్యంలో మంగళవారం రోజున జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు గర్భాశయ క్యాన్సర్ వ్యాక్సిన్ హ్యూమన్ పాపిలోనా వైరస్ వ్యాక్సిన్ పైన అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలోని స్త్రీలలో వచ్చు గర్భాశయ నోటి , జననేంద్ర క్యాన్సర్లను హెచ్ పి వి వ్యాక్సిన్ నివారిస్తుందని ఆమె తెలియజేశారు . ప్రభుత్వం ఈ హ్యూమన్ పాపిలోమా వైరస్ వ్యాక్సిన్ అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితముగా ఇవ్వడానికి నిర్ణయం తీసుకుందని , ఈ వైరస్ వ్యాక్సిన్ ను జిల్లాలోని 14 సంవత్సరాలు నిండిన ఆడపిల్లలకు ఒక డోస్ చొప్పున కందరాలలో ఇచ్చుటకు నిర్ణయించడం జరిగిందన్నారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా యువ నేషన్ అధికారి జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ చైతన్య పాఠశాల, తూప్రాన్-2లో నాసా కిట్ల పంపిణీ



**తూప్రాన్, వెలుతురు డిసెంబర్ 16:**
తూప్రాన్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల, తూప్రాన్ - 2 శాఖలో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే లక్ష్యంతో నాసా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నాసా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టి.జి.ఆర్.ఎస్. మరియు జె.సి.పి.జి.టి (భౌతిక శాస్త్రం) శ్రీ పి. రామచంద్రం మాట్లాడుతూ నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని, నాసా వంటి ప్రతిష్ఠాత్మక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, పరిశోధనా దృక్పథం మరింతగా వికసిస్తుందని అన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో అంతరిక్ష శాస్త్ర రంగంలో గొప్ప విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మల్లిఖార్జున్ రెడ్డి మాట్లాడుతూ నాసా కిట్లు విద్యార్థులకు శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడమే కాకుండా, ప్రయోగాత్మక అవగాహనను కల్పిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భావి శాస్త్ర వేత్తలుగా దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో పెంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జన్ ప్రసాద్, నాసా ఇన్‌చార్జులు నేహ, పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థులు నాసా కిట్లను స్వీకరించి ఉత్సాహంగా పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

## జనవరి 3 నుంచి టెట్ పరీక్షలు



**హైదరాబాద్,డిసెంబర్ 16( వెలుతురు):**
తెలంగాణ రాష్ట్ర టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ జనవరి -2026 పరీక్షల షెడ్యూల్‌ను సంబంధిత అధికారులు విడుదల చేశారు. ఈ పరీక్షలు జనవరి 3 నుంచి జనవరి 20 వరకు ఆన్‌లైన్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మొత్తం 9 రోజుల్లో 15 సెషన్లలో ఈ పరీక్షలు జరగనున్నాయి. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో ప్రతి రోజూ రెండు సెషన్ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నారు. సెషన్-ఎ పరీక్ష ఉదయం 9.00 గంటల నుంచి 11.30 గంటల వరకు కొనసాగుతుంది. సెషన్-ఎఎ పరీక్ష మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు అభ్యర్థులు ముందుగానే హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష కేంద్రాలకు సమయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.

## ఎన్నికల పోలింగ్ కేంద్రాల పరిశీలన

**- గుండాలలో డీసీపీ ఆకాంక్ష యాదవ్ పర్యటన**






**గుండాల, డిసెంబర్ 16 (వెలుతురు):**
గుండాల మండలంలో మూడవ విడత గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ ఏర్పాట్లను యాదాద్రి భువనగిరి జిల్లా డీసీపీ ఆకాంక్ష యాదవ్ పరిశీలించారు.ఈ సందర్భంగా గుండాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని అదనపు డీసీపీ లక్ష్మీనారాయణతో కలిసి సందర్శించారు.ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.అనంతరం గుండాలలో ఎన్నికలు జరిగే ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని బాంబు స్క్వాడ్ బృందం పూర్తిస్థాయిలో తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, ఎస్సై తేజంరెడ్డి, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుండాల మండలం పాచిల్ల గ్రామంలో గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలన జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**గుండాల, డిసెంబర్ 16 (వెలుతురు):**
గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడత పోలింగ్ నిర్వహించనున్న గుండాల మండలం పాచిల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రీన్ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ హనుమంత రావు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో చేపట్టిన ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, పరిశుభ్రత, పర్యావరణహిత చర్యలు అమలు చేయాలని సూచించారు.ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించి, పచ్చదనం ప్రతిబింబించేలా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.పోలింగ్ రోజున శాంతియుత వాతావరణంలో,నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## షూటర్లుగా మారనున్న ఓటర్లు







**వెలుతురు నారాయణఖేడ్ డిసెంబర్ 16 :**
సంగారెడ్డి జిల్లా :- తెలంగాణ రాష్ట్రంలో థర్డ్ ఫేస్ పంచాయతీ ఎన్నికల్లో నారాయణఖేడ్ నియోజకవర్గంలో రేపు ఓట్ల పండుగ జరగనుంది.అయితే ఈ ఎన్నికల్లో ఓటర్లు షూటర్లుగా మారనున్నారు. నామినేషన్ ప్రక్రియ ప్రారంభం నుండి విత్ డ్రాల అనంతరం వివిధ మండలాల్లోని గ్రామాల్లో రాజకీయ వేడి ఏర్పడింది.రాజకీయంలో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు అనే విధంగా ప్రచార పర్వం జోరుగా కొనసాగింది. నియోజకవర్గంలో మూడు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ బీఆర్ఎస్,బిజెపి అగ్ర నేతలు అందరూ ఆయా ఊర్లలో తమ మద్దతు దారులకు సపోర్టుగా సుడిగాలి పర్యటనతో చుట్టివచ్చారు.ముఖ్యంగా నారాయణఖేడ్ మండలం,నియోజకవర్గంలో మైగ్రేషన్ ఓటర్లు ఎక్కువ ఉండడంతో నాయకులు హైదరాబాదుకు వెళ్లి వాళ్ళతో మాట్లాడి తమకు మద్దతు తెలిపాల్సిందిగా వేడుకున్నారు.

# ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటా

### యాదగిరిగుట్ట దేవస్థానం మాజీ ధర్మకర్త, సీనియర్ నేత పెలిమెల్లి శ్రీధర్ గౌడ్



**యాదగిరిగుట్ట, డిసెంబర్ 16 ( వెలుతురు )**
ఆపదలో కష్టాలలో ఉన్న వారికి తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, ప్రజాసేవలో అనేక సంవత్సరాలుగా తాను నిస్వార్థంగా ముందుకు కొనసాగుతున్నానని యాదగిరిగుట్ట దేవస్థానం మాజీ ధర్మకర్త , సీనియర్ నేత పెలిమిల్లి శ్రీధర్ గౌడ్ అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలోని ఏడవ వార్డులో ఇటీవల అనారోగ్యంతో మరణించిన మల్లేష్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆయన అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకుంటూ , వారికి అండగా ఉంటున్నానని అన్నారు . యాదగిరిగుట్ట దేవస్థానం ధర్మకర్తగా, గతంలో యాదగిరిగుట్ట గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా, ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా ప్రజలకు ఎల్లప్పుడూ తాను అందరికీ అన్నివేళలా అందుబాటులో ఉంటూ అనేక రకాల సేవా కార్యక్రమాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించానని అన్నారు. ఇప్పటికి ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటూ ముందుకు కొనసాగుతున్నానని అన్నారు. ప్రజలకు ఎప్పుడు ఏ కష్టం వచ్చినా, తాను ముందుండి వారి కష్టాన్ని ఇబ్బందులను తీర్చేలా కృషి చేస్తున్నానని అన్నారు . ప్రజల సేవ కోసమే తాను నిరంతరం కృషి చేస్తూ ముందుకు కొనసాగుతున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఆయన వార్డులో గుండ్లపల్లి గ్రామంలో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు వాటిని పరిష్కరించేందుకు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సహకారంతో కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలు , ఇబ్బందులను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య దృష్టికి తీసుకెళ్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుండు నరసింహ గౌడ్, యాదగిరిగుట్ట కాంగ్రెస్ పార్టీ టౌన్ కార్యదర్శి మొలుగు నరసింహ, నాయకులు లకన్ భాయ్, దేవా , శంకర్ , ఐలయ్య, పాండు తదితరులు పాల్గొన్నారు.

## న్యాల్కల్ మండలంలో మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని 38 గ్రామ పంచాయతీలకు ఈ నెల 17వ తేదీన జరగనున్న మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికల్లో మూడు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. రుక్మాపూర్ గ్రామ సర్పంచ్‌గా సురేష్, చీకుర్తి గ్రామ సర్పంచ్‌గా మేత్రి రమేష్ యాదవ్ (కాంగ్రెస్ మద్దతు) కాగా, మరియంపూర్ గ్రామ సర్పంచ్‌గా ఒక్కరేణి నాగేశ్వరి (స్వతంత్ర) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిగిలిన 35 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ పదవుల కోసం 98 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, 298 వార్డులకు గాను 678 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. మండలంలో మొత్తం 332 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో 48,919 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిర్వహణ కోసం 8 రూట్లలో 8 మంది రూట్ అధికారులు, 4 మంది జోనల్ అధికారులు, 35 మంది ఫేజ్-2 అధికారులు, 615 మంది పోలింగ్ మరియు సహాయ పోలింగ్ అధికారులను నియమించారు. భద్రతా ఏర్పాట్లలో భాగంగా 5 మంది సీఐలు, 23 మంది ఎస్సైలు, 10 మంది ఏఎస్సైలు, 114 మంది పోలీస్ సిబ్బందిని మోహరించారు.





## మామిడిపల్లి సర్పంచ్ మహబూబ్ పటేల్‌ను సన్మానించిన సిపిఐ సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్



**జహీరాబాద్ వెలుతురు డిసెంబర్ 16:**
సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన మహబూబ్ పటేల్ బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా గెలుపొందిన సందర్భంగా ఆయనను సీపీఐ జిల్లా కార్యదర్శి జలాలుద్దీన్ ఘనంగా సన్మానించారు. జహీరాబాద్ పట్టణం భారత్‌నగర్‌లోని జలాలుద్దీన్ నివాసంలో పూలమాలతో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా జలాలుద్దీన్ మాట్లాడుతూ మహబూబ్ పటేల్ నాయకత్వంలో గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలో సహకరించిన గ్రామ ప్రజలందరికీ మహబూబ్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ బీఆర్ఎస్ నాయకుడు మొయిన్, మామిడిపల్లి వార్డు మెంబర్ బాబా పాల్గొన్నారు.



# జీహెచ్ఎంసీ కౌన్సిల్‌లో వార్డుల పునర్విభజనపై రచ్చ

- ఎంఐఎం-బీజేపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం
- గెజిట్ పత్రాలు చింపి మేయర్ పోడియం వద్దకు దూకుడు
- కౌన్సిల్ వాయిదా.. బయట బీజేపీ ఆందోళన



**హైదరాబాద్,డిసెంబర్ 16( వెలుతురు):**
జిహెచ్ఎంసి ప్రత్యేక కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. ఈ సమావేశంలో ప్రధానంగా వార్డుల పునర్విభజన అంశంపై చర్చ కొనసాగింది. జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల విలీనం చేసిన 27 మునిసిపాలిటీలతో పాటు, ప్రస్తుతం ఉన్న 150 వార్డులను 300 వరకు పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన డీలిమిటేషన్‌పై బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చర్చల సమయంలో సభలో ఒక్కసారిగా గందరగోళం నెలకొంది. దారుస్సలంలో వార్డుల విభజన జరిగిందంటూ బీజేపీ కార్పొరేటర్లు చేసిన వ్యాఖ్యలపై ఎంఐఎం కార్పొరేటర్లు అభ్యంతరం తెలిపారు. దీంతో ఎంఐఎం, బీజేపీ కార్పొరేటర్ల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో బీజేపీ కార్పొరేటర్లు గెజిటెడ్ పత్రాలను చింపి సభలో విసిరివేసి, మేయర్ పోడియం వైపు దూసుకెళ్లారు. దీనిపై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గందరగోళం మధ్య పునర్విభజనపై కార్పొరేటర్ల నుంచి వచ్చిన అభిప్రాయాలు, అభ్యంతరాలను ప్రభుత్వానికి నివేదిస్తామని మేయర్ ప్రకటించారు. అనంతరం ప్రత్యేక కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. సభ వాయిదా అనంతరం బీజేపీ కార్పొరేటర్లు జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. రేవంత్ సర్కార్ ఎంఐఎంకు అనుకూలంగా వార్డుల విభజన చేపట్టిందని, జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పుల తడకగా ఉందని ఆరోపించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అక్కడ భారీగా పోలీసు బలగాలను మోహరించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద భాజపా కార్పొరేటర్లు నిరసన చేపట్టారు. డివిజన్ చోరీ జరిగిందంటూ ఆందోళన నిర్వహించారు. జీహెచ్ఎంసీ విడుదల చేసిన మ్యాప్ తప్పులతడకగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్ల పునర్విభజన గెజిట్ పత్రాలను చించేశారు. అంతకుముందు ఈ అంశంపై ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో పాటు కార్పొరేటర్లు మాట్లాడారు. డీలిమిటేషన్‌పై తమ అభ్యంతరాలను సభ దృష్టికి తీసుకెళ్లారు.

# పోలీసులకు చిక్కిన 17మంది మావోలు


- పట్టుబడ్డ వారిలో కీలక నేత చొక్కారావు?

**ఆదిలాబాద్,డిసెంబర్16( వెలుతురు):**
మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేక మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మృతిచెందగా.. భారీ సంఖ్యలో మావోలు లొంగిపోయారు. ఇప్పుడు తాజాగా మావోయిస్టు కీలక నేత పోలీసులకు చిక్కినట్లు తెలుస్తోంది. మావోయిస్టు అధినేత చొక్కరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మంగళవారం ఆదిలాబాద్ జిల్లాలోని సిర్పూర్ (యూ )లో 15 మంది మావోయిస్టులు పోలీసులకు చిక్కారు. పట్టుబడ్డ వారిలో 9 మంది మహిళలు ఉండగా 7 పురుషులు ఉన్నట్టు సమాచారం. అలాగే వారిలో మావో అగ్రనేత బడే చొక్కారావు అలియాస్ దామోదర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వారందనీ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి తరలిస్తున్నారు. మావోయిస్టులు పట్టుబడటంపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇంటర్ పరీక్షలో స్వల్ప మార్పు

- మార్చి 3 నాటి పరీక్ష 4కు వాయిదా

**హైదరాబాద్,డిసెంబర్ 16( వెలుతురు):**
తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌లో స్వల్ప మార్పు చోటు చేసుకుంది. మార్చి 3న జరగాల్సిన ఇంటర్ సెకండియర్ మ్యాథ్స్ 2ఏ, బోటనీ, పొలిటికల్ సైన్స్ పరీక్షలను మరుసటి రోజు అంటే మార్చి 4న నిర్వహించనున్నట్లు తెలిపింది. మార్చి 3న హోలీ పండగ ఉండటంతో పరీక్షల తేదీలో మార్పు చేసినట్లు వెల్లడించింది. మిగతా పరీక్షలు యథాతథంగా నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఇప్పటికే పరీక్షల షెడ్యూల్ విడుదలయ్యింది.




# తండ్రి మృతికి కారణమైన వారిని శిక్షించాలని కూతురి ధర్నా..

- వ్యక్తిని కారుతో గుద్దిన ప్రియదర్శిని కాలేజీ డైరెక్టర్ చలపతిరావు..
- మృతి చెందిన సాల్మన్ రాజ్ అనే దళితుడు...
- పరారీలో ప్రియదర్శిని కాలేజ్ డైరెక్టర్ చలపతిరావు..
- న్యాయం కోసం బాధితులు కాలేజ్ ముందు ధర్నా
- బాధితులను ఒప్పించేందుకు పోలీసుల ప్రయత్నం..
- బాధితుల పక్షాన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు..
- కుటుంబానికి మద్దతిచ్చిన దళిత సంఘాలు..








**భద్రాద్రి కొత్తగూడెం వెలుతురు డిసెంబర్ 16:**
తన తండ్రి మృతికి కారణమైన వ్యక్తిని శిక్షించాలని తమ కుటుంబానికి న్యాయం చేయాలని ఓ దళిత బిడ్డ సంఘవి (మృతుని కుమార్తె )పోరాటం చేస్తుంది. ఆమె పోరాటానికి దళిత సంఘాల నేతలు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మద్దతునిచ్చారు.
వివరాల్లోకి వెళితే రామాంజనేయ కాలనీకి చెందిన సంగయ్య ఎలియాస్ సాల్మన్ రాజు కొత్తగూడెం ఎంజీ రోడ్ దుర్గా టెక్స్ టైల్స్ లో పనిచేస్తుండేవాడు. సోమవారం మధ్యాహ్నం విద్యానగర్ కాలనీలో మూడు గంటల ప్రాంతంలో రోడ్డుపై పడిపోయి ఉండగా ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ డైరెక్టర్ అతనిపై నుంచి కారును పోనిచ్చి అతని చావుకు కారణమయ్యాడు. ఈ నేపథ్యంలో అతనిపై చుంచుపల్లి పోలీసులు కేసును నమోదు చేశారు. నిర్లక్ష్యంగా వ్యక్తిని కారుతో గుద్ది అతనిపై నుంచి కారును పోనిచ్చి అతని చావుకు కారణమైన వ్యక్తిని అదుపులోనికి తీసుకుని శిక్షించాలని కుటుంబ సభ్యులు దళిత సంఘాల నాయకులు మంగళవారం హెచ్చరించారు. కారు యజమాని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ప్రియదర్శిని కాలేజీ డైరెక్టర్ శ్రీ రామనేని చలపతిరావు సోమవారం వ్యక్తి మరణించిన అనంతరం కారణం పోలీస్ స్టేషన్లో అప్పజెప్పి వెళ్లిపోయినాడు. కనీసం 10 నుంచి 20 కిలోమీటర్ల స్పీడులో కూడా వెళ్లలేని కాలనీ రోడ్డులో ఒక మనిషి పైనుంచి కారును పోనిచ్చి అతని చావుకు కారణం అవ్వడమే కాకుండా నిర్లక్ష్యంగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చేతులు దులుపుకొని పరారవ్వడం పట్ల కుటుంబ సభ్యులు దళిత సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం వరకు కాలేజీ ఎదుట తండ్రి మృతదేహాన్ని పెట్టుకొని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ రాష్ట్ర కార్యవర్గ, పీసీసీ సంవిధాన్ బచావో కమిటీ సభ్యులు ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ జె బాలశౌరి మాట్లాడుతూ ప్రియదర్శిని కాలేజీ యాజమాన్యం డైరెక్టర్ చలపతిరావు వెంటనే ఇక్కడకు రావాలని డిమాండ్ చేస్తూ ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో డీఎస్పీ ఆధ్వర్యంలో ఎలక్షన్ విధుల్లో ఉన్న పోలీసులు అక్కడికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను సముదాయించే ప్రయత్నం చేశారు.. కుటుంబ సభ్యుల మాత్రం తన తండ్రి చావుకు కారణమైన వ్యక్తిని వెంటనే పోలీస్ స్టేషన్కు తీసుకురావాలని మొండిపట్టు పట్టారు. తండ్రి చావుకు కారణమైన ప్రియదర్శిని డిగ్రీ కాలేజీ డైరెక్టర్ చలపతిరావును అదుపులోకి తీసుకోవాలని పోలీసులు ప్రయత్నించినా గాని కోదాడకు పరారైన చలపతిరావు అందుబాటులోకి రాలేదు. ఏది ఏమైనా ఎలక్షన్ విధులకు ఆటంకం కలుగుతుందని పోలీసుల ఎలక్షన్ విధులకు సహకరించాలని ఎలక్షన్ అనంతరం గురువారం ఉదయం తప్పనిసరిగా ఉదయం 10 గంటలకల్లా చుంచుపల్లి పోలీస్ స్టేషన్ కు తీసుకువస్తామని బాధితులకు దళిత సంఘాల నాయకులకు హామీ ఇవ్వడంతో అందరూ ధర్నా విరమించారు. బాల శౌరి మాట్లాడుతూ గురువారం డైరెక్టర్ చలపతిరావు సాల్మన్ రాజు కుటుంబానికి న్యాయం చేయాలని లేకుంటే ప్రియదర్శిని డిగ్రీ కాలేజీని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు శోభ, ఆరిఫ్, నిస్సార్ ఇతర దళిత సంఘాల నేతలు మందా హనుమంతు,పూల రవీందర్, రామాంజనేయ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.
కొసమెరుపు
సోమవారం మధ్యాహ్నం దళితుడు సాల్మన్ రాజును కారుతో తొక్కించిన కారు ఓనర్ చలపతిరావుతో పాటు స్థానిక అధికార పార్టీ నాయకులు కారులోనే ఉన్నారని ముందు రోజు జరిగిన ఎలక్షన్ ఫలితాల అనంతరం ఫుల్లుగా పార్టీ చేసుకుని భోజనానికి బయటకు వెళుతున్న సమయంలో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు. పట్టపగలు మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో రోడ్డుపై వ్యక్తిని ఆక్సిడెంట్ చేసి పడిన మనిషిని సైతం చూడకుండా కారు ఎక్కి తొక్కించడం చూస్తుంటే మానవత్వం మంట కలిసి పోతుందని అర్థమవుతుంది. కుక్కకన్నా హీనంగా మనిషిని కారుతో తొక్కించిన ప్రియదర్శిని కళాశాల డైరెక్టర్ చలపతిరావు మరియు ఇతర అధికార పార్టీ నాయకుల పై ఏ మేరకు పోలీసులు చర్యలు తీసుకుంటారు వేచి చూడాల్సిందే...

# మేరీ ఆనంద్ గెలుపుతో ధర్మారానికి అభివృద్ధి వెలుగు

- పెన్షన్లు-ఇళ్లు-సంక్షేమ పథకాలు మరింత విస్తరిస్తాయి
- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్








**అడ్డగూడూరు (ధర్మారం), డిసెంబర్ 16 (వెలుతురు):**
ధర్మారం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి మేరీ ఆనంద్ గెలుపు ఖాయమని, గ్రామ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ పిలుపునిచ్చారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వార్డు సభ్యులందరినీ గెలిపించాలని ఆయన కోరారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో పెన్షన్ల సమస్యలు, ప్రభుత్వ ఇళ్ల మంజూరు, త్రాగునీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సర్పంచ్, వార్డు సభ్యులు గెలిస్తే గ్రామాభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని, ఇల్లు లేని పేద కుటుంబాలకు ప్రభుత్వ ఇళ్లు మంజూరు చేయడంలో ఎలాంటి వివక్ష ఉండదని హామీ ఇచ్చారు. రైతులు, కూలీలు, మహిళలు, యువత కోసం ఇప్పటికే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలులో ఉన్నాయని గుర్తు చేసిన ఆయన, త్రాగునీటి కొరత, ఉపాధి అవకాశాల లేమి, పాఠశాలలు – ఆరోగ్య కేంద్రాల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తోందన్నారు. గ్రామస్థులు తమ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కారం చేస్తామని భరోసా ఇచ్చారు. సర్పంచ్ ఎన్నికలు గ్రామ భవిష్యత్తును నిర్ణయించే కీలక ఎన్నికలని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే మందుల సామెల్ కోరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని, సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.




# సిడ్నీ దాడి ఉగ్రవాది సాజిత్‌కు భారత పాస్‌పోర్టు

- అతను హైదరాబాద్ వాసిగా పేర్కొన్న పోలీసులు
- స్టూడెంట్ వీసాపై వెళ్లి ఆస్ట్రేలియాలోనే నివాసం





**హైదరాబాద్,డిసెంబర్ 16( వెలుతురు):**
ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ఇటీవల చోటుచేసుకున్న ఉగ్రదాడి ఘటనకు సంబంధించి కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బోండీ బీచ్‌లో కాల్పులు జరిపిన నిందితుల్లో ఒకడైన సాజిద్ అక్రమ్ (50) వద్ద భారత పాస్‌పోర్ట్ ఉన్నట్లు ఆస్ట్రేలియా అధికారులు గుర్తించారు. అతడు హైదరాబాద్ నుంచి పాస్‌పోర్టు పొందినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే తెలంగాణ డీజీపీ కార్యాలయం దీనిపై ప్రకటన విడుదల చేసింది. సాజిద్ అక్రమ్ హైదరాబాద్ వ్యక్తి అని వెల్లడించింది. ఇక్కడే బీకామ్ చదివిన సాజిద్ 27 ఏళ్ల క్రితం 1998లో విద్యార్థి వీసాపై ఆస్ట్రేలియా వెళ్లాడు. యూరోపియన్ యువతి వెనెరా గ్రోసోను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమారుడు నవీద్ అక్రమ్, కుమార్తె. వీరిద్దరూ ఆస్ట్రేలియా పౌరులే. సాజిద్ అక్రమ్ ఇప్పటికీ భారత పాస్‌పోర్టునే వినియోగిస్తున్నాడు. అయితే, హైదరాబాద్‌లో అతడికి అతి తక్కువ సంబంధాలు ఉన్నాయని, ఆస్ట్రేలియాకు వలస వెళ్లాక సాజిద్ ఆరుసార్లు భారత్‌కు వచ్చాడని తెలిపింది. కుటుంబ, ఆస్తులకు సంబంధించిన వ్యవహారాల కోసమే ఇక్కడకు వచ్చాడు. హైదరాబాద్‌లో ఉన్నప్పుడు అతడికి ఎలాంటి నేర చరిత్ర లేదు. ఉగ్రవాదులతో సాజిద్‌కు సంబంధాలపై తమకేమీ తెలియదని హైదరాబాద్‌లోని కుటుంబసభ్యులు తెలిపారని తెలంగాణ డీజీపీ కార్యాలయం తమ ప్రకటనలో వెల్లడించింది. సిడ్నీలోని బోండీ బీచ్‌లోఆదివారం యూదులు 'హనుక్కా ఉత్సవం చేసుకుంటుండగా ఈ ఉగ్రదాడి జరిగిన సంగతి తెలిసిందే. సాజిద్ అక్రమ్, అతడి కుమారుడు 24 ఏళ్ల నవీద్ అక్రమ్.. విచక్షణా రహితంగా కాల్పులకు తెగబడ్డారు. సమాచారమందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని ఎదురుకాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో సాజిద్ హతమవ్వగా.. నవీద్‌ను పోలీసులు అరెస్టు చేశారు. వీరికి ఉగ్రవాద సంస్థ ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా(ఐసిస్)తో సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 15 మంది ప్రాణాలు కోల్పోయారు.ఆస్ట్రేలియాలోని సిడ్నీ బాండి బీచ్‌లో డిసెంబర్ 14న జరిగిన ఉగ్రదాడిలో 15 మంది మరణించగా, 40 మందికి పైగా గాయపడ్డారు. యూదుల హనుక్కా వేడుకలను లక్ష్యంగా చేసుకుని తండ్రీకొడుకులు సాజిద్ అక్రమ్ (50), నవీద్ అక్రమ్ (24) కాల్పులు జరిపారు. దాడికి ముందు నవంబర్‌లో తండ్రీకొడుకులు ఫిలిప్పీన్స్‌కు వెళ్లి వచ్చారు. అక్కడ ఐఎస్ఐఎస్–సంబంధిత ప్రాంతాల్లో శిక్షణ తీసుకున్నారనే అనుమానాలు ఉన్నాయి. వారి వాహనంలో ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోసివ్ డివైస్‌లు, హోమ్‌మేడ్ ఐఎస్ఐఎస్ జెండాలు లభ్యమయ్యాయి. దాడి ఐఎస్ఐఎస్ భావజాలం ప్రేరేపితమని ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ఈ ఘటనపై భారత నిఘా సంస్థలు సాజిద్ కుటుంబ సభ్యుల వివరాలు సేకరిస్తున్నాయి. విషయం తెలిసిన హైదరాబాద్‌లోని అతడి బంధువులు షాక్‌కు గురయ్యారు. దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, తండ్రి చనిపోయిన సమయంలో భారతదేశానికి సాజిద్ రాలేదని పోలీసులు చెప్తున్నారు.సాజిద్ అక్రమ్ ఐఎస్ఐఎస్ ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉన్నట్లు కుటుంబ సభ్యులకు తెలియదని పోలీసులు అంటున్నారు. సాజిద్ అక్రమ్, అతని కుమారుడు నవీద్ ఉగ్రవాదం వైపు వెళ్ళడానికి స్థానిక ప్రభావం లేదని గుర్తించారు. 1998 సమయంలో సాజిద్ అక్రమ్ పై భారతదేశంలో ఎటువంటి కేసులు లేవని పోలీసులు అంటున్నారు.

## ధ్వజస్తంభాల కోసం దివ్యవృక్షాల వనం

-పలమనేరులో వంద ఎకరాల్లో పెంపకం
- టీటీడీలోని 31 విద్యాసంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు
- పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి అదనంగా రూ.48 కోట్లు
- ముంబాయిలోని బాంద్రాలో రూ.14.4 కోట్లతో ఆలయ నిర్మాణం
- అలిపిరి వద్ద 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్
- జగిత్యాల జిల్లా కొండగట్టులో వసతిగృహాల నిర్మాణం
- టీటీడి ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు



**తిరుమల,డిసెంబర్ 16 వెలుతురు :**

దేశంలోనీ అన్ని ఆలయాలకు టీటీడీ నుంచి ధ్వజస్థంభాలు ఇవ్వడానికి 100 ఎకరాల్లో ఉద్యానవణం ఏర్పాటు చేయాలని టీటీడీ పాలక మండలి సమావేశంలో నిర్ణయించారు. టిటిడి ఆలయాలకు ధ్వజస్తంభం, రథాలు తయారు చేసేందుకు పలమనేరులో 100 ఎకరాలలో దివ్య వృక్షాలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు బీఆర్ నాయుడు అధ్యక్షతన మంగళవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో ముఖ్య నిర్ణయాలు ఇలా ఉన్నాయి. సమావేశం అనంతరం పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ బీఆర్ నాయుడు మీడియా సమావేశంలో వివరించారు. పద్మావతి చిన్న పిల్లల ఆస్పత్రి నిర్మాణానికి అదనంగా రూ.48 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. టీటీడీలోని 31 విద్యా సంస్థల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ముంబాయిలోని బాంద్రాలో రూ.14.4 కోట్లతో ఆలయ నిర్మాణం చేపడతామని.. అలిపిరి వద్ద 20 ఎకరాల్లో ఇంటిగ్రేటెడ్ టౌన్ షిప్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. టౌన్ షిప్‌లో వసతి సదుపాయంతో పాటు అన్నప్రసాద సముదాయం, ఇతర వసతులు భక్తులకు కల్పిస్తామని అన్నారు. కాటేజ్ డోనార్ స్కీంలో మార్పులకు ఆమోదం తెలిపామన్నారు. పద్మావతి కాలేజీలో అదనంగా 270 సీట్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్నామని.. . టీటీడీలోని నాలుగు కేటగిరిలలోని 60 పోస్టులను త్వరలోనే భర్తీ చేయనున్నట్లు ప్రకటించారు. తిరుపతిలోని పలు రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించినట్లు తెలిపారు. శ్రీవారి పోటులో 18 సూపర్‌వైజ్ పోస్టుల భర్తీకి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. తిరుమలలోని వీధులకు పేర్లు పెట్టేందుకు కమిటీ నియామకం జరిగిందన్నారు. టీటీడీలోని కాలేజ్‌లలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తామన్నారు. టీటీడీ అనుబంధ ఆలయాల్లోని 62 మంది పరిచారక, అర్చకులు జీతాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అదనంగా ఓ సన్నిధి గొల్ల నియమానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. కాలిబాటలో అనుభవమున్న 18 మంది అధికారుల నియామకానికి ఆమోదం తెలిపినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా తలకోనలోని శ్రీ సిద్దేశ్వర స్వామివారి ఆలయ పునః నిర్మాణ పనులలో భాగంగా రెండవ దశలో రూ.14.10 కోట్లు మంజూరుకు నిర్ణయించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రస్తుతం ఉన్న 2100 హాస్టల్ సీట్లకు అదనంగా మరో 270 హాస్టల్ సీట్లు పెంచాలని నిర్ణయించారు. టిటిడి ఇంజనీరింగ్ విభాగంలో నాలుగు కేటగిరిలలో ఖాళీగా ఉన్న 60 పోస్టులకు ఇప్పటికే ఇచ్చిన నోటిఫికేషన్ ఆధారంగా త్వరలో భర్తీ చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. తిరుపతిలో టీటీడీ నిర్వహిస్తున్న రోడ్ల నిర్వహణ, మరమ్మతులు, వీధి దీపాల నిర్వహణ కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నారు. తిరుమలలోని రహదారులు, ప్రధాన కూడళ్ళ పేర్లను వైష్ణవ పురాణాలు, ఆళ్వార్లు, అన్నమాచార్య సంకీర్తనలలోని శ్రీవారి నామాలు, తదితర పేర్లతో మార్చేందుకు కమిటీ ఏర్పాటు చేశాం. ఈ కమిటీలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం దూర విద్యా కేంద్రం డైరెక్టర్ డా. చక్రవర్తి రంగనాథన్, అన్నమాచార్య ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.మేడసాని మోహన్, పురాణ ఇతిహాస ప్రాజెక్టు ప్రత్యేక అధికారి డా.డి.ప్రభాకర్ కృష్ణమూర్తిలతో కమిటీ ఏర్పాటు చేశాం. శ్రీవారి ఆలయంలో ఒక ప్రధాన సన్నిధి యాదవతో పాటు అదనంగా మరో సన్నిధి యాదవ పోస్టుల ఏర్పాటు, నిబంధనల ప్రకారం భర్తీకి ఆమోదం ఇచ్చారు. తిరుమలలోను, కాలిబాటలో ఉన్న పురాతన ప్రాశస్త్యం గల నిర్మాణాల పరిరక్షణ కొరకు ప్రత్యేకంగా ఒక విభాగం ఏర్పాటు చేసి, అనుభవం గల అధికారుల నియామకానికి ఆమోదం ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అమలులో ఉన్న మధ్యాహ్న భోజన పథకం తరహాలో టీటీడీ ఎస్వీ జూనియర్ కళాశాల, ఎస్పీడబ్ల్యూ జూనియర్ కళాశాలలో డేస్కాలర్‌లకు మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయం. జగిత్యాల జిల్లా కొండగట్టులోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం వసతి సముదాయం నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు.

## గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పంచాయితీ ఎన్నికలు

- 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం
- పంచాయితీరాజ్ శాఖ మంత్రి సీతక్క వెల్లడి

**హైదరాబాద్,డిసెంబర్ 16 వెలుతురు :**

తెలంగాణలో రెండు విడతల్లో ఇప్పటివరకు 8,566 పంచాయతీల్లో ఎన్నికలు విజయవంతంగా పూర్తయ్యాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు.బీసీ కులగణన ఆధారంగా 42 శాతం రిజర్వేషన్ లక్ష్యంతో కేంద్రంపై పోరాటం కొనసాగుతూనే ఉంది. గ్రామాలకు పూర్తి స్థాయి నిధులు అందాలనే ఉద్దేశంతో ఎన్నికలు నిర్వహించాం అని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సహచర మంత్రుల నాయకత్వంలో ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ గ్రామస్థాయిలో సత్తా చాటిందన్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర, ఆదివాసీ సంస్కృతి, ఆత్మగౌరవంపై తప్పుడు వ్యాఖ్యలు చేసి, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదు. రాళ్లు కాదు.. రాతి శిలలపై చెక్కిన చరిత్రే ఆదివాసీ అస్థిత్వానికి నిదర్శనం. ఇళ్ల విషయంలో భారత రాష్ట్ర సమితి నాయకులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి పది ఇళ్లయినా ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో కొన్ని వేల ఇళ్లు ఇచ్చిందని అన్నారు. మహిళలకు చీరలు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, పేద పిల్లలకు గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు వస్తే కొందరికి కళ్లమంటగా మారింది. తాడ్వాయి ప్రాంతంలో ఆదివాసీ మహిళ గెలిస్తే భూములు లాగేసుకుంటారని ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేయడం నీచమైన రాజకీయం. మా ఆదివాసీ దేవుళ్ల జోలికి వచ్చినా, మా అస్థిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని దెబ్బతీసినా ఊరుకునేది లేదని మంత్రి సీతక్క హెచ్చరించారు.

## పేదలఅకు అండగా సిఎం రిలీఫ్ ఫండ్

- మంత్రి అనగాని సత్యప్రసాద్

**బాపట్ల,డిసెంబర్ 16( వెలుతురు):**

ఆర్థికంగా వెనకబడిన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని తెదేపా కార్యాలయంలో 41 మందికి రూ.86 లక్షల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఇప్పటివరకు ఈ నియోజకవర్గంలో సీఎంఆర్‌ఎఫ్ ద్వారా రూ.10 కోట్లు ఇచ్చినట్లు చెప్పారు. ఐదేళ్ల వైకాపా పాలనలో ఏ పేదవాడికీ సీఎం రిలీఫ్ ఫండ్ అందలేదన్నారు. కోటి సంతకాలంటూ వైకాపా నేతలు నాటకాలు మొదలుపెట్టారని మంత్రి విమర్శించారు. రెండేళ్లలో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తుందన్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడు ఒక్క మెడికల్ కాలేజీ కూడా పూర్తి చేయలేదన్నారు. జగన్‌కు అప్పట్లో రుషికొండపై ఉన్న శ్రద్ధ.. మెడికల్ కాలేజీలపై లేదని విమర్శించారు. 2019-24లో రాష్ట్రాన్ని అంధకారంలోకి తీసుకెళ్లారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో ఉందని చెప్పారు. రానున్న రోజుల్లో విశాఖ ఐటీ హబ్‌గా మారుతుందన్నారు.

# కర్ల రాజేష్ మృతికి కారకులైన పోలీసుల మీద చర్యలు తీసుకోవాలి

## డీజీపీకి మందకృష్ణ మాదిగ వినతిపత్రం






**హైదరాబాద్ వెలుతురు డిసెంబర్16:**

సూర్యాపేట జిల్లా కోదాడలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన చెందిన కర్ల రాజేష్ ను ఏ పిర్యాదు లేకుండానే చట్టవిరుద్ధంగా కస్టడీలోకి తీసుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టి అతని చావుకు కారకులైన చిలుకూరు ఎస్సై మరియు కోదాడ రూరల్ సీఐ అలాగే ఇతర పోలీసు సిబ్బంది మీద తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు, 'పద్మశ్రీ ' మంద కృష్ణ మాదిగ తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివదర్ రెడ్డి గారిని ఈరోజు మధ్యాహ్నం డిజీపీ కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు మృతుడి తల్లి కర్ల లలితమ్మతో కలిసి కర్ల రాజేష్ మృతికి సంబంధించిన సంపూర్ణ ఆధారాలు,సాక్ష్యాలు, సంబంధిత పత్రాలతో కూడిన మెమోరాండంను అందజేశారు. ఈ సందర్భంగా సంఘటనకు సంబంధించిన వాస్తవాలు, బాధిత కుటుంబం ఎదుర్కొన్న అన్యాయాన్ని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. కేసును నిష్పక్షపాతంగా, వేగవంతంగా విచారించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. డీజీపి గారిని కలిసిన అనంతరం మంద కృష్ణ మాదిగ గారు మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత అరుదైన కస్టడీ డెత్ కర్ల రాజేష్ ది కావడం గమనార్హం అన్నారు. ఇప్పటివరకు జరిగిన లాకప్ డెత్ లన్ని బాధితుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన తర్వాత లేదా ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత నిందితులను అదుపులో తీసుకొని పోలీసులు విచారిస్తున్న సందర్భంలో జరిగిన హింసల వల్ల జరిగాయని అన్నారు . కానీ ఏ ఫిర్యాదు లేకుండా , ఏ కారణం లేకుండా ఏ ఎఫ్ఐఆర్ లేకుండానే చట్ట విరుద్ధంగా తమ కస్టడీలోకి తీసుకొని తీవ్రంగా చిత్రహింసలు పెట్టి అమాయకుడి మృతికి పోలీసులు కారకులైన సంఘటన మాత్రం కేవలం కర్ల రాజేశ్ ది మాత్రమే అన్నారు. నవంబర్ 4 నుండి నవంబర్ 9 వరకు కర్ల రాజేష్ ను పోలీసులు చట్టవిరుద్ధంగా కస్టడీలో ఉంచుకున్నారని అన్నారు. చట్టవిరుద్ధమైన కస్టడీ, చట్ట విరుద్ధమైన చిత్రహింసలు రాజేష్ మరణానికి ప్రధాన కారణం అని అన్నారు. ఒకవేళ పోలీసులు చెబుతున్నట్లుగా సీఎమ్మారెఫ్ డబ్బుల విషయంలో రాజేష్ ను నవంబర్ 9వ తేదిననే అరెస్టు చేస్తే నవంబర్ 4 వ తేదీన రాజేష్ ను తన ఇంటికి వచ్చి తీసుకెళ్లిన కానిస్టేబుల్ రామారావు , హొంగార్డు నరసింహారావు ఎవరు అని ప్రశ్నించారు. నవంబర్ 5 వ తేదీన అరవింద్ అనే కానిస్టేబుల్ రాజేష్ ను తన బైక్ పైన ఎక్కించుకొని ఆయన పనిచేస్తున్న పెట్రోల్ బంక్ వద్దకు తీసుకెళ్లింది నిజం కాదా అని ప్రశ్నించారు. 5 రోజులపాటు కోదాడ రూరల్ మరియు చిలుకూరుపోలీస్ స్టేషన్ వద్దకు రాజేష్ తల్లి భోజనం తీసుకొచ్చింది నిజం కాదా? ఆ భోజనాన్ని పోలీసులు లోపలికి తీసుకెళ్లి లాకప్ లో ఉన్న రాజేష్ కు ఇచ్చింది నిజం కాదా? పోలీసుల కస్టడీలో రాజేష్ లేకపోతే ఆ భోజనం ఎవరికి పెట్టారు ? తన తల్లి రాజేష్ ను చూపించమంటే పోలీసులు నిరాకరించింది నిజం కాదా అని ప్రశ్నించారు? నవంబర్ 8 వ తేదీన బంధువులు ఒత్తిడి చేస్తే రాజేష్ తల్లిని లోపలికి తీసుకెళ్లి లాకప్ లో ఉన్న రాజేష్ ను చూపించిది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఇలా చెప్పుకుంటూ పోతే రాజేష్ ను ఏ ఫిర్యాదు లేకుండా చట్టవిరుద్ధంగా పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారని చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నాయని అన్నారు. రాజేష్ ను తీవ్రమైన చిత్ర హింసలు పెట్టారని చెప్పడానికి అనేక ఆధారాలు ఉన్నాయని అన్నారు.రాజేష్ తీవ్రమైన చిత్రహింసలు ఎదుర్కొని కోర్టులో నడవలేని స్థితిలో ఉన్నప్పుడు పోలీసులు హైకార్డ్ అనే ఇంజక్షన్ తెప్పించి సహ నిందితుడైన శేఖర్ ద్వారా రాజేష్ నరానికి ఇంజక్షన్ వేయించింది నిజం కాదా అన్నారు. పోలీసులు డాక్టర్ల సూచన లేకుండా రాజేష్ కు చట్ట విరుద్ధంగా ఇంజక్షన్ వేయించి కోర్టులో హాజరుపరిచారని అన్నారు. అందుకు సంబంధించిన సిరంజ్ , ఇంజక్షన్ బాటిల్ మరియు మిగితా ఆధారాలను ఇప్పటికే సేకరించినట్లు తెలిపారు .కర్ల రాజేష్ మృతి సంఘటనలో కోదాడ రూరల్ , చిలుకూరు పోలీసు స్టేషన్లు మరియు కోర్టు ప్రాంగణం, అలాగే వివిధ ప్రాంతాల సిసి ఫుటేజ్ లను పరిశీలించాలని అలాగే ఫిర్యాదారుడు మరియు నిందితులు మరియు పోలీసుల కాల్ డేటా, లొకేషన్ వివరాలు బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై సమగ్రమైన విచారణ జరిపితే పూర్తి వివరాలు బయటకు వస్తాయని అన్నారు. పోలీసులు కాకమ్మ కథలు చెప్పి తప్పించుకోలేరని అన్నారు. ఇప్పటికే తన కుమారుని చావుకు చిలుకూరు ఎస్సై కోదాడ రూరల్ సిఐ కారణమని కర్ల లలితమ్మ రెండుసార్లు డిఎస్పి కి, ఒకసారి సూర్యాపేట ఎస్పీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసిన కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేశారని అన్నారు. కర్ల రాజేష్ మీద కోడూరు రాజేష్ ఫిర్యాదు చేస్తే ఒక్క నిమిషం గడవకుండానే ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు కర్ల లలితమ్మ పోలీసుల మీద ఫిర్యాదు చేస్తే నెల రోజులు గడిచిన ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం అత్యంత దారుణమని అన్నారు. రాజేష్ సంఘటనలో ఎస్సై కేవలం రెడ్డి సామాజిక వర్గం కావడం వల్లనే చర్యలు తీసుకోవడం లేదని అదే స్థానంలో ఎస్సీ, ఎస్టీ బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎస్సై ఉండి ఉంటే ఇప్పటికే సస్పెండ్ చేసి అరెస్టు చేసేవారని అన్నారు. లేదా రాజేష్ స్థానంలో కస్టడీ డెత్ కు గురైన వారు రెడ్డి లేదా వెలమ కులాలకు చెందినవారు అయితే కారకులైన వారికి ఇప్పటికే శిక్షలు పడి ఉండేవి అని అన్నారు. ఈ వివక్షతను ప్రతి ఒక్కరు అర్థం చేసుకోవాలని కోరారు. తక్షణమే కర్ల రాజేష్ మృతికి కారకులైన చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి కోదాడ రూరల్ సిఐ ప్రతాప లింగం గార్లపై మర్డర్ కేసు అలాగే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని , వారిని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిపుణులైన ఫోరెన్సిక్ డాక్టర్ల చేత రాజేశ్ మృతదేహానికి రీ పోస్టుమార్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కేసులో ప్రధాన ఆధారాలుగా ఉన్న సిసి కెమెరాలు ఫుటేజ్ లు అలాగే కాల్ డేటా మరియు లొకేషన్ వివరాలు వెంటనే బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసును శాస్త్రీయంగా పరిశీలిస్తే సాక్షిగా ఉండాల్సిన రాజేష్ నిందితుడిగా మారి చివరకి హతుడిగా మిగిలాడని అని అన్నారు . ఇది పోలీసులు చేసిన చారిత్రక తప్పిదమని అన్నారు రాజేష్ సీఎంఆర్ ఫ్ డబ్బుల నేరంలో భాగస్వామి కాదు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కస్టడీలలో హింసకు గురై లాకప్ డెత్ లలో మరణిస్తుంది అత్యధికంగా దళితులే అని అన్నారు. కనుక ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీజీపీ గారిని కోరారు. రాజేష్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. అన్ని వివరాలు డిజిపి గారికి తెలిపామని , వారు న్యాయం చేస్తారనే. నమ్మకం ఉందని అన్నారు. మందకృష్ణ మాదిగ విజ్ఞప్తిపై డీజీపీ గారు స్పందిస్తూ ఈ సంఘటనపై త్వరలోనే విచారణ చేపడతామని న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా. గోవిందు నరేష్ మాది, కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి ఏపూరి రాజు మాదిగ, హైకోర్టు అడ్వకేట్ దున్న అంబేద్కర్ అలాగే కర్ల రాజేశ్ తమ్ముడు కర్ల కమల్ తదితరులు పాల్గొన్నారు.




# కాంగ్రెస్ కు డేంజర్ బెల్స్



**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**

తెలంగాణ వ్యాప్తంగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊరటను ఇస్తూనే, అంతర్లీనంగా తీవ్రమైన హెచ్చరికలను కూడా జారీ చేశాయి. ఇప్పటివరకూ వెలువడిన రెండు విడతల ఫలితాలను పరిశీలిస్తే, అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని కాంగ్రెస్ అగ్రస్థానంలో నిలిచిన మాట వాస్తవమే. కానీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకున్న పరిణామాలు, గణాంకాలను లోతుగా విశ్లేషిస్తే.. అధికార పార్టీ సాధించిన ఈ విజయం బలుపు కాదని, కేవలం వాపు మాత్రమేనన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు దక్కడం పరిపాటి. అభివృద్ధి నిధులు, ప్రభుత్వ పథకాలు అధికార పార్టీ మద్దతుదారులకే అందుతాయన్న నమ్మకంతో గ్రామీణ ఓటర్లు అధికార పక్షం వైపు మొగ్గు చూపుతారు. ఈ కోణంలో చూస్తే కాంగ్రెస్ పార్టీ స్వీప్ చేయాల్సి ఉంది. కానీ, తాజా ఫలితాలు ఆ అంచనాలను తారుమారు చేశాయి. కాంగ్రెస్ పార్టీ సుమారు 50 శాతం స్థానాల్లో విజయం సాధిస్తే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ 40 శాతానికి పైగా స్థానాల్లో గెలుపొందడం గమనార్హం. కేవలం 10 శాతం ఓట్ల తేడా మాత్రమే ఉండటం అధికార పార్టీ డొల్లతనాన్ని బయటపెడుతోంది. కాంగ్రెస్ విజయం వెనుక ఆ పార్టీ సంస్థాగత బలం కంటే, 'అధికారంలో ఉన్నాం' అన్న సానుకూలత మాత్రమే ఎక్కువగా పనిచేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఒకవేళ కాంగ్రెస్ అధికారంలో లేకపోయి ఉంటే, ఈ ఫలితాలు పూర్తిగా భిన్నంగా ఉండేవని అంచనా వేస్తున్నారు.కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికలు మిగిల్చిన అతిపెద్ద ఆందోళన.. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరు. రాష్ట్రంలో చక్రం తిప్పుతున్నామని భావిస్తున్న పలువురు మంత్రులు, కీలక ఎమ్మెల్యేల సొంత గ్రామాలు, సొంత నియోజకవర్గాల్లోనే కాంగ్రెస్ మద్దతుదారులు ఓటమి పాలయ్యారు. అధికార పార్టీ నేతలు తమ సొంత గడ్డపైనే పట్టు కోల్పోవడం, అక్కడ బీఆర్ఎస్ మద్దతుదారులు జెండా ఎగురవేయడం కాంగ్రెస్ అధిష్టానానికి మింగుడుపడని విషయం. ఇది కేవలం ఓటమి మాత్రమే కాదు, క్షేత్రస్థాయిలో నాయకత్వంపై ప్రజల్లో ఉన్న అసంతృప్తికి నిదర్శనం. నేతల అతి విశ్వాసం, గ్రూపు తగాదాలు, క్షేత్రస్థాయి కార్యకర్తలను విస్మరించడం వంటి కారణాలే ఈ ఫలితాలకు దారితీశాయని స్పష్టమవుతోంది.అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల ఓటముల తర్వాత డీలా పడ్డ బీఆర్ఎస్ శ్రేణులకు ఈ పంచాయతీ ఎన్నికలు టానిక్‌లా పనిచేశాయి. ప్రతిపక్షంలో ఉండి, అధికార పార్టీని ఎదుర్కొని మరీ 40 శాతానికి పైగా స్థానాలను దక్కించుకోవడం ఆషామాషీ విషయం కాదు. గ్రామీణ స్థాయి క్యాడర్ బీఆర్ఎస్‌కు ఇంకా బలంగానే ఉందని ఈ ఫలితాలు రుజువు చేశాయి. కాంగ్రెస్ వైఫల్యాలను, ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మలుచుకోవడంలో బీఆర్ఎస్ స్థానిక నాయకత్వం సఫలమైంది.ఈ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి కచ్చితంగా ఒక మేలుకొలుపు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, క్షేత్రస్థాయిలో పార్టీ పటిష్టతపై దృష్టి సారించకపోవడం, నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికిప్పుడు జనం ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో లేకపోయినా, ఈ ఫలితాలు మాత్రం భవిష్యత్తు రాజకీయాలకు ప్రమాద ఘంటికలే. ముఖ్యంగా స్థానిక సంస్థల్లో ప్రతిపక్షం బలంగా ఉంటే, అది ప్రభుత్వ పథకాల అమలులోనూ, వచ్చే ఎన్నికల్లోనూ అధికార పార్టీకి పెద్ద తలనొప్పిగా మారుతుందిమొత్తానికి, కాంగ్రెస్ సాధించిన ఈ విజయం అంకెల గారడీలో గొప్పగా కనిపించవచ్చు కానీ, వాస్తవంలో అది నిలకడ లేని విజయమని, పార్టీ ఇప్పటికైనా లోపాలను సరిదిద్దుకోకపోతే రానున్న రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# హైదరాబాద్ జూకు కంగారూలు, జీబ్రాలు

**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**

నెహ్రూ జూలాజికల్ పార్క్‌ను సందర్శించే పిల్లలు, కుటుంబాలు, వన్యప్రాణి ప్రేమికులు త్వరలో మొదటిసారిగా కంగారూలను చూడబోతున్నారు. జంతు మార్పిడి కార్యక్రమంలో భాగంగా ఈ ఆస్ట్రేలియా జాతి జంతువులను తీసుకురావడానికి హైదరాబాద్ జూ సిద్ధమవుతోంది.గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో రిలయన్స్ ఫౌండేషన్ నడుపుతున్న అంతర్జాతీయ వన్యప్రాణుల రక్షణ, పరిరక్షణ కేంద్రమైన వంతారా నుండి ఒక జత కంగారూలను తీసుకురానున్నారు. వాటి కోసం ఎన్‌క్లోజర్లు, రాత్రిపూట నివాస గృహాలను ఇప్పటికే సిద్ధం చేసినట్లు జూ అధికారులు తెలిపారు. వంతారా డైరెక్టర్ బ్రిజ్ కిషోర్ గుప్తా నేతృత్వంలోని ఒక బృందం ఇటీవల హైదరాబాద్ జూలోని సౌకర్యాలు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేసింది.'జూలో కంగారూలు ఉండటం ఇది మొదటిసారి. మేం త్వరలో వంతారా నుండి ఒక మగ, ఒక ఆడ కంగారూను తీసుకుంటాం. అవి వచ్చిన తర్వాత, వాటిని ప్రదర్శనకు ఉంచే ముందు కొన్ని రోజుల పాటు క్వారంటైన్‌లో ఉంచుతాం.' అని నెహ్రూ జూలాజికల్ పార్క్‌కు చెందిన ఒక సీనియర్ అధికారి తెలిపారు.ఇప్పుడు వంతారా నుంచి వచ్చే కంగారూలకు బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఏనుగులలోని ఒకదానిని వంతారాకు పంపనుంది. గతంలో 2020లో జపాన్‌లోని యోకోహామా జూలాజికల్ గార్డెన్స్ నుండి నాలుగు కంగారూలను తీసుకురావాలని హైదరాబాద్ జూ ప్రణాళిక వేసింది. కానీ కొవిడ్-19 మహమ్మారి కారణంగా ఏర్పడిన అంతరాయాల వల్ల ఆ ఒప్పందాన్ని నిలిపివేశారు.ఇదిలా ఉండగా ప్రస్తుతం జూలో ఒంటరిగా ఉన్న సన్నీ అనే మగ జిరాఫీకి త్వరలో ఒక ఆడ తోడు రానుంది. సీనియర్ అధికారులు ఇటీవల మైసూరు జూను సందర్శించి ఈ మార్పిడిని ఖరారు చేశారు. ఈ నెలాఖరులోగా జిరాఫీ వస్తుందని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం జూలో 2,200 కంటే ఎక్కువ జంతువులు, పక్షులతో పాటు 199 జాతుల జీవులు ఉన్నాయి.త్వరలో జీబ్రాలు కూడా ఇక్కడ మరింత సందడిగా చేయనున్నాయి. జూ త్వరలో వంతారా నుండి ఒక జత జీబ్రాలను తీసుకురానుంది. ఇప్పటికే ఆ కేంద్రం నుండి తీసుకువచ్చిన రెండు మగ, ఒక ఆడ జీబ్రాలతో కలిపి వీటి సంఖ్య పెరుగుతుంది. 37 ఏళ్ల విరామం తర్వాత హైదరాబాద్ జూకు జీబ్రాలు తిరిగి వచ్చాయి.

# ఢిల్లీ-ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై ఘోర ప్రమాదం..

**- పొగమంచు కారణంగా బస్సులు ఢీకొని మంటలు,**

**- 4 మంది మృతి**



**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**

ఢిల్లీ- ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై తెల్లవారుజామున సుమారు నాలుగు గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. దట్టమైన పొగమంచు కారణంగా ఒకదానికొకటి ఢీకొన్న నాలుగు బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. బస్సులతో పాటు సమీపంలో ఉన్న కొన్ని ఇతర వాహనాలు కూడా మంటల్లో చిక్కుకున్నాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ ఇంజన్లు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేస్తున్నాయి. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ప్రమాదం కారణంగా ఢిల్లీ - ఆగ్రా ఎక్స్‌ప్రెస్ హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడంతో పాటు ప్రమాద కారణాలపై విచారణ చేపట్టారు. దట్టమైన పొగమంచులో వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

# సానుభూతి మంత్రంతో రేవంత్




**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**

ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదు. పరిపాలన కూడా సరిగ్గా లేదు. అధిష్టానం ఏమాత్రం స్వేఛ్ఛ ఇవ్వడం లేదు. అభివృద్ధి ఆగిపోయింది. అప్పులు తేవడం పెరిగిపోయింది. 10 సంవత్సరాల కాలంలో తెలంగాణ విపరీతంగా అభివృద్ధి చెందితే.. ఇప్పుడు మాత్రం నేల చూపులు చూస్తోంది" ఇదిగో ఇలా సాగిపోతోంది గులాబీ పార్టీ విమర్శల వ్యవహారం. సోషల్ మీడియా ద్వారా రేవంత్ రెడ్డిని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతోంది. రేవంత్ వేసే ప్రతి అడుగును భూతద్దంలో పెట్టి చూస్తోంది గులాబీ సోషల్ మీడియా.ఈ స్థాయిలో విమర్శలు.. స్వపక్షం నుంచి ఒత్తిడి.. అధిష్టానం నుంచి అంతగా లభించని సపోర్టు.. ఇన్ని ప్రతికూలతల మధ్య రేవంత్ రెడ్డి పడుతున్న ఇబ్బందులు మామూలువి కాదు. ఇన్ని సమస్యలు ఎదుర్కొంటూనే పరిపాలన సాగిస్తున్నారు రేవంత్ రెడ్డి. వాస్తవానికి అతని స్థానంలో మరొక నాయకుడు ఉండి ఉంటే పరిస్థితి మరో విధంగా ఉండేది.. కాంగ్రెస్ పార్టీ నాలుగు ముక్కలయ్యేది. తనకున్న చాకచక్యంతో.. పరిజ్ఞానంతో ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నారు రేవంత్ రెడ్డి.. ఆయన పరిపాలనలో లోపాలు లేవా? ప్రజలకు అంతా మంచే జరుగుతోందా? ప్రభుత్వం నుంచి ప్రజలకు బ్రహ్మాండమైన సహకారం లభిస్తోందా? ఈ ప్రశ్నలకు లేదు అని, కాదు అని సమాధానం రావచ్చు. అందులో అనుమానం కూడా లేదు. కాకపోతే ఇన్ని ప్రతికూలతల మధ్య.. రేవంత్ రెడ్డి పరిపాలన సాగించడమే అసలైన ఆశ్చర్యకరమైన విషయం. ముఖ్యమంత్రి అయిన తర్వాత తీసుకున్న నిర?యాలు కొన్ని వివాదాస్పదంగా మారాయి. మంత్రుల వ్యవహార శైలి కూడా ఇబ్బందికరంగా మారింది.. ఇవన్నీ ప్రతిపక్ష గులాబీ పార్టీకి అనుకూలంగా మారాయి. అయితే ఇన్ని అవరోధాలు ఉన్నప్పటికీ.. రేవంత్ రెడ్డి పరిపాలన రథాన్ని సవ్యంగా ముందుకు సాగించడమే ఇక్కడ అసలైన గొప్ప విషయం. ఎందుకంటే గులాబీ పార్టీ సోషల్ మీడియా బలంగా ఉంది. ఆ పార్టీ మొత్తాన్ని కేటీఆర్ నడిపిస్తున్నారు. ఆర్థికంగా గులాబీ పార్టీకి బలం విపరీతంగా ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా నుంచి మొదలు పెడితే నాయకుల వరకు అన్ని లోపాలు కనిపిస్తున్నాయి. అయినప్పటికీ రేవంత్ రెడ్డి వీటన్నింటిని దాటుకొని అటు పార్టీని.. ఇటు ప్రభుత్వాన్ని ముందు వరుసలో నిలపడమంటే మామూలు విషయం కాదు.రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రంలో వరస విజయాలను సాధిస్తుంది.. తెలంగాణలో చెప్పుకునే స్థాయిలోనే మెజారిటీ సాధించిన కాంగ్రెస్ పార్టీ.. ముందుగా కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో విజయం సాధించింది.. ఆ తర్వాత జూబ్లీహిల్స్ ఉపయోగ ఎన్నికల్లో గెలుపును అందుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలవదని.. ఈ ఉప ఎన్నికలు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రెఫరెండం అని కేటీఆర్ పదేపదే వ్యాఖ్యానించారు. కానీ వాస్తవ ఫలితం మాత్రం రేవంత్ రెడ్డికి అనుకూలంగా వచ్చింది. ఒకరకంగా రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ద్వారా అటు కేటీఆర్ కు, ఇటు గులాబీ పార్టీకి ఏకకాలంలో చెక్ పెట్టారు. దానిని మర్చిపోకముందే స్థానిక ఎన్నికల్లో ప్రతిపక్ష గులాబీ పార్టీకి దిమ్మతిరిగే విధంగా సమాధానం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ చరిత్రలో కనివిని ఎరుగని స్థాయిలో స్థానిక సంస్థలలో సీట్లు సాధించి సరికొత్త రికార్డు సృష్టించారు. తద్వారా గులాబీ పార్టీ తనపై పదే పదే చేస్తున్న నెగిటివ్ ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు రేవంత్ రెడ్డి. ప్రజల ముందు సానుభూతి మంత్రాన్ని పఠిస్తూ సరికొత్త రాజకీయ నాయకుడిగా అవతరిస్తున్నారు.. తెలంగాణ ప్రజల్లో పాజిటివిటీ పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

# గులాబీకి ఊహించని ఫలితాలు

**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**







తెలంగాణలో మొదటి దశ పంచాయతీ ఎన్నికల ఫలితాలు ఇంట్రెస్టింగ్‌గా మారాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న అధికార పార్టీకి..బీఆర్ఎస్ కంటే ఎక్కవ స్థానాలే వచ్చాయి. అయితే ఫస్ట్ ఫేజ్ సర్పంచ్ ఎన్నికల ఫలితాలపై అధికార కాంగ్రెస్ అంత స్యాటిస్‌ఫైగా లేదట. పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతోంది. తొలి విడతలో మెజారిటీ స్థానాలను కైవసం చేసుకున్న హస్తం పార్టీ.. మలి విడతలోనూ అదే జోరు కొనసాగించింది. ఆదివారం జరిగిన రెండో విడత ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులే అత్యధిక స్థానాల్లో విజయబావుటా ఎగురవేశారు. మలి విడతలో 192 మండలాల పరిధిలోని 3911 గ్రామపంచా యతీలకు ఎన్నికలు జరగ్గా.. 2200కు పైగా స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొం దారు. మెజారిటీ సీట్లను సాధించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో అధికార పార్టీ తన పట్టును నిలుపుకున్నట్లయింది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి కూడా మలి విడత ఫలితాలు కాస్త ఊరటనిచ్చాయి. మలి విడతలో మొత్తం 4332 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉంది. అయితే వీటిలో 415 స్థానాలు ఏకగ్రీవం కాగా.. ఐదు గ్రామాల్లో నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 3,911 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. కాగా, రెండో విడతలో గెలిచిన స్వతంత్ర అభ్యర్థుల్లో ఎక్కువ మంది కాంగ్రెస్ రెబల్సే ఉండడం గమనార్హం.మొదటి విడతలో 4వేల 230 సర్పంచ్ స్థానాల్లో..ఏకగ్రీవాలతో కలిపి అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుదారులు 2వేల 425 స్థానాల్లో గెలిచారు.ఇక బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 1,168 స్థానాల్లో గెలిచారు. బీజేపీ మద్దతు ఇచ్చిన స్థానాల్లో 189 మంది విజయం సాధించారు. సీపీఎం 24 సీట్లు, సీపీఐ 23 స్థానాలను గెలుచుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పంచాయతీ ఎన్నికల్లో స్వతంత్రులు 401 స్థానాల్లో సత్తా చాటారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో గెలిచిన స్థానాలపై అధికార కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా కొంత అసంతృప్తి వ్యక్తం చేస్తోంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం ఆశ్చర్యపోతోందన్న చర్చ జరుగుతోంది.ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో గెలవాల్సిందని కాంగ్రెస్ అనుకుంటుంటే, అసలు ఏ మాత్రం పోటీ ఇవ్వలేమని భావించిన బీఆర్ఎస్ లోలోన తెగ హ్యాపీగా ఫీల్ అవుతోందట. అవును..పంచాయితీ ఎన్నికలను పెద్దగా పట్టించుకోకపోయినా ఫస్ట్ ఫేజ్‌లో సానుకూల ఫలితాలు రావడంతో ఇప్పుడు సీరియస్‌గా దృష్టి పెట్టిందట కారు పార్టస్థానిక సంస్థల ఎన్నికల్లో ఎప్పుడైనా అధికార పార్టీదే అప్పర్ హ్యాండ్ ఉంటుంది. పవర్‌లో ఉన్న పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులే మెజార్టీ స్థానాలను గెలవడం సర్వ సాధారణం. ఈ హోప్‌తోనే ఈ సారి పంచాయితీ ఎన్నికల్లో కనీసం 80 నుంచి 90 శాతం స్థానాల్లో విజయం సాధిస్తామని హస్తం పార్టీ ఆశించింది. కానీ మొదటి విడత ఎన్నికల్లో 57 శాతం స్థానాలతో సరిపెట్టుకోవాల్సి వచ్చిందట. ఇదే ఇప్పుడు కాంగ్రెస్‌లో అసంతృప్తికి కారణంగా తెలుస్తోంది. ఇదే సమయంలో ఫస్ట్ ఫేజ్ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు 27 శాతం అనుకూల ఫలితాలు వచ్చాయి.ఓ రకంగా ఇది గులాబీ పార్టీ కూడా ఊహించలేదని అంటున్నారు. ఎందుకంటే అసలు బీఆర్ఎస్ పార్టీ పంచాయతీ ఎన్నికలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో కాస్త నిరాశలో ఉన్న గులాబీ పార్టీ లీడర్లు, క్యాడర్..పల్లె పోరుపై పెద్దగా దృష్టి పెట్టలేదు. కనీసం పార్టీ అధిష్టానం ఒక రివ్యూ కూడా చేయలేదు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఉన్నచోట మినహా మిగతా నియోజకవర్గాల్లో సర్పంచ్ ఎన్నికలను కారు పార్టీ పెద్దగా పట్టించుకోలేదని ముందు నుంచి ప్రచారం జరుగుతోంది.స్థానిక సంస్థల ఎన్నికలను మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజా ప్రతినిధులు, ఇంచార్జ్‌లు చూసుకుంటారులే అని బీఆర్ఎస్ అధిష్టానం లైట్ తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు స్థానిక ఎన్నికల్లో ఎలాగూ అధికార కాంగ్రెస్ పార్టీదే పైచేయి ఉంటుందన్న ఉద్దేశంతో పెద్దగా పట్టించుకోలేదని అంటున్నారు. దీంతో గులాబీ పార్టీ అధిష్టానంతో పాటు..మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు కూడా లోకల్ బాడీ ఎన్నికలను లైట్ తీసుకున్నట్లే పార్టీలో చర్చ జరిగింది.గ్రామాల్లో జోరుగా పంచాయతీ ఎన్నికల రాజకీయం నడుస్తోంటే ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు ఏ మాత్రం పట్టించుకోకుండా హైదరాబాద్‌లో ఉన్నారని తెలంగాణ భవన్ వర్గాల్లోనే టాక్ వినిపించింది. అయితే అధిష్టానం నుంచి అండ లేకపోయినా, ఎమ్మెల్యేలు, ఇంచార్జ్‌లు పట్టించుకోకపోయినా..లోకల్ బీఆర్ఎస్ లీడర్లు మాత్రం పట్టుబట్టి..ఎన్నికల్లో ఫైట్ చేశారు. దీని ఫలితమే మొదటి విడత ఎన్నికల్లో 1,168 సర్పంచ్‌లను గెలిచేలా చేసిందని చెబుతున్నారు.ఏ మాత్రం ఊహించనట్లుగా ఫస్ట్ ఫేజ్ పంచాయతీ ఎన్నికల్లో 1,168 సర్పంచ్ స్థానాలను గెలవడంతో బీఆర్ఎస్ అధిష్టానం అలర్ట్ అయ్యిందట. సీరియస్‌గా తీసుకోకపోయినా ఇన్ని స్థానాల్లో గెలిచామంటే అదే ఇంకాస్త దృష్టి పెట్టి ఉంటే మరింత మెరుగ్గా రిజల్ట్ వచ్చేవని చర్చించుకుంటున్నారట. అందుకే సెకండ్, థర్డ్ ఫేజ్ పంచాయతీ ఎన్నికలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీరియస్‌గా దృష్టి పెట్టారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మాజీ మంత్రులు, ఇంచార్జ్‌లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కేటీఆర్..మిగతా రెండు విడత ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని చెప్పినట్లు తెలుస్తోంది.దీంతో వెంటనే జిల్లాల్లో ముఖ్యనేతలంతా రంగంలోకి దిగినట్లు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి. ఈ రెండు విడతల్లో మరిన్ని ఎక్కువ సర్పంచ్ స్థానాలను గెలుచుకునే పట్టుదలతో నేతలు పనిచేస్తున్నారట. కాస్త ఆలస్యంగా మేలుకున్న బీఆర్ఎస్‌కు సర్పంచ్ ఎన్నికల సమరం ముగిసే నాటికి ఎంతవరకు అనుకూల ఫలితాలు వస్తాయో చూడాలి మరి.

# కాలుష్య కాసారంగా రామగుండం...



**అదిలాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**

రామగుండం- జైపూర్ ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాంతం ఇప్పుడు రాష్ట్రంలోనే అత్యంత ప్రమాదకర ప్రాంతంగా మారింది. వాయు, జల కాలుష్యంగా పతాక స్థాయికి చేరడంతో ప్రజారోగ్య పరిరక్షణ ప్రమాదంలో పడింది. ఈ ప్రాం తంలో సుమారు 15 లక్షల జనాభా ఉండ గా, సుమారు 6 వేల మంది క్యాన్సర్ బారిన పడ్డారు. వేలాది మందికి ప్రీ క్యాన్సర్ లక్షణాలు బయటపడ్డాయి.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారీతిన బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలు, సిమెం ట్ ఫ్యాక్టరీలకు అనుమతులు ఇస్తుండటం తో కాలుష్యం రోజురోజుకూ పెరుగుతున్నది. ఈ ప్రాంతంలోని 5,400 మెగా వాట్ల థర్మల్ పవర్ ప్లాంట్లలో యాజమాన్యాలు ఏటా దాదాపు 50 లక్షల టన్నుల బొగ్గు మండిస్తున్నాయి. అలాగే సిమెంట్ తయారీ కోసం ఆ కంపెనీ 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. ఇవి కాక త్వరలో రామగుండం ప్రాంతంలో మూడు కొత్త థర్మల్ పవర్ ప్లాంట్లు ఏర్పా టు చేయాలనే ప్రణాళికలు ఉన్నాయి.అదేజరిగితే ఈ ప్రాంతంలో వాయు, జల కాలుష్యం అత్యంత ప్రమాదకరస్థాయికి పెరుగనుందని నిపుణులు హెచ్చరిస్తున్నా రు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాల ప్రకారం 5 మైక్రోగ్రా మ్ పర్ క్యూబిక్ మీటర్‌లో పీఎం 2.5 కాలుష్య రేణువులు ఉండటం ప్రమాదక రం కాదు. కానీ, నవంబర్ నెలలో రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆ సూచిక 175- 250 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్ నమోదైంది. అంటే సురక్షిత పరిమితికి కంటే.. అది 35-50 రెట్లు ఎక్కువ. బొగ్గు మండిన తర్వాత మిగిలిన బూడిదలో దాదాపు 40 శాతం అల్యూమినియం అవశేషాలు ఉన్నట్లు తేలింది. ఈ బూడిద వ్యవసాయ భూములు, అడవుల్లో పడుతుండటంతో సారవంతమైన భూములు నిస్సారమవుతున్నాయి. అటవీప్రాంతం పచ్చదనాన్ని కోల్పోతున్నది. అలా రామగుండం, కమాన్‌పూర్, జైపూ ర్ మండలాల్లో 80,000 ఎకరాలకు పైగా నిస్సారమైందని ఓ అంచనా.పంట దిగుబడులు తగ్గిపోవడంతో రైతులు, కూలీల జీవనాధారం దెబ్బతింటోంది. భూగర్భజలాలు కూడా కలుషితం అవతుండటంతో తాగునీరు కూడా విషమ యమవుతున్నది. ఒకప్పుడు స్నానానికి ఉపయోగపడే 'సీ' కేటగిరీలో ఉన్న గోదావరి జలాలు ఇప్పుడు 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. ఎన్‌టీపీసీ, జైపూర్ థర్మ ల్ ప్లాంట్, ఆర్ఎఫ్‌సీఎల్, బసంత్‌నగర్ సి మెంట్ ఫ్యాక్టరీల నుంచి విడుదలయ్యే వ్యర్థాలే కారణమని స్థానికులు చెబుతున్నారు. కాలుష్యం కారణంగా ఈ ప్రాంతంలో ఆనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయి. ప్రజారోగ్యం ప్రమాదపు అంచు నుంది. ఇటీవల రోహిణి అనే సంస్థ నిర్వహించిన ఓ వైద్య శిబిరంలో వైద్యులు 5,000 మందిని పరీక్షించగా, వీరిలో 183 మందికి ప్రీ లక్షణాలు ఉన్నాయని తేలింది. అలాగే 20 మందికి క్యాన్సర్ నిర్ధారణ అయింది. అలాగే ఎంతోమంది గుండె జబ్బులు, మూ్ర తపిండ వ్యాధులు, శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది.ఇక్కడ కొన్ని అకస్మాత్తు మరణాల సంఖ్య కూడా పెరుగు తండటం గమనార్హం. పరిస్థితి చేయిజారకముందే గోదావరిఖని, మంచిర్యాల, నస్పూ ర్ ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎంపీలు, 100 గ్రామ పంచాయతీల సర్పంచులు, 170 మున్సిపల్ వార్డు సభ్యులు వెంటనే స్పందించాలని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతున్నది.విద్యుత్ ఉత్పత్తి కోసం యజామాన్యాలు ఏటా 50 లక్షల టన్నుల బొగ్గు, సిమెంట్ త యారీ కోసం 95 లక్షల టన్నుల బొగ్గును మండిస్తున్నది. పీఎం 2.5 స్థాయి డబ్ల్యూహెచ్‌వో పరిమితికి 35 రెట్లు ఎక్కువ న మోదవుతుండటం ఆందోళన కలిగించే విష యం. కాలుష్యంతో ఈ ప్రాంతంలో 80వేల ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు నిస్సారమవుతున్నాయి. అటవీప్రాంతం కాలుష్యమై పచ్చదనాన్ని కోల్పోతున్నది. గోదావరి జలాల నాణ్యత 'సీ' కేటగిరీ నుంచి 'హెచ్' కేటగిరీకి పడిపోయింది. కాలుష్య ప్రభావంతో 15 లక్షల జనాభాలో సుమారు 6,000 మంది క్యాన్సర్ బారినపడ్డారు. మరకొంతమందిలో ఇప్పుడిప్పుడే క్యాన్సర్ లక్షణాలు బయటపడుతున్నాయి.

# యాదగిరిగుట్టలో ఘనంగా ధనుర్మాస వేడుకలు



**యాదగిరిగుట్ట డిసెంబర్ 16, ( వెలుతురు)**

భక్తుల కొంగు బంగారం యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం ధనుర్మాస వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం నుంచి జనవరి 14వ తేదీ వరకు ఈ వేడుకలను నిర్వహించనున్నారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుని కొలుస్తూ నెల రోజులపాటు నిర్వహించే పాశుర పఠనాలను ఆలయ అర్చకులు, పారాయణీకులు ప్రత్యేకంగా జరిపిస్తారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 4.30 నుంచి 5 గంటల వరకు శ్రీస్వామి వారి ఆలయ ముఖ మండపంపై ఉత్తర భాగంలోని హాల్‌లో గోదాదేవి అమ్మవారిని వేంచేపు చేసి తిరుప్పావై కార్యక్రమం నిర్వహిస్తారు. దీంతోపాటు మార్గళి నివేదన వంటి వేడుకలు జరుగనున్నాయి.

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని ఆలయ నిత్య కైంకర్యాల సమయాల్లో మార్పులు చేశారు. మంగళవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు వేకువజామున 3.30 గంటలకు ఆలయాన్ని తెరిచి స్వామివారిని మేల్కొలిపి సుప్రభాతం నిర్వహిస్తారు. అనంతరం 4 గంటల నుంచి 4.30 గంటల వరకు తిరువారాధన, 4.30 నుంచి 5 గంటల వరకు తిరుప్పావై సేవాకాలం జరిపిస్తారు. 5 నుంచి 6 గంటల వరకు నివేదన, చాత్మర, 6 నుంచి 7 గంటల వరకు నిజాభిషేకం, 7 నుంచి 7.45 గంటల వరకు సహస్రనామార్చన, ఉదయం 7.45 నుంచి స్వామివారి సర్వదర్శనాలు ప్రారంభిస్తారు. ధునుర్మాసోత్సవాలలో భాగంగా జనవరి 14న రాత్రి 7 గంటలకు గోదాదేవి కల్యాణం, 15న ఉదయం 11.30 గంటలకు ఒడిబియ్యం కార్యక్రమం నిర్వహిస్తారు.

ఘనంగా లక్షపుష్పార్చన

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందఠరేగా శాస్త్రోక్తంగా లక్ష పుష్పార్చన నిర్వహించారు. సోమవారం స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో అర్చక బ ృందం, వేద పం డితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. స్వయంభూ ప్రధానాలయ ముఖ మం డపంలో ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదిక పై తీర్చిదిద్దారు.

అర్చక బ ృందం, వేద పండితులు స్వామి, అమ్మవార్ల సహస్ర నామ పఠనంతో వివిధ రకాల పూలతో పాంచరాత్రగమశాస్త్ర ప్రకారం సుమారు రెండు గంటల పాటు లక్షపుష్పార్చన చేశారు. తెల్లవారు జామునే ఆలయం తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామి వారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. శ్రీస్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయస్వామివారికి సహస్ర నామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాల ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. సాయంత్రం వేళలో శ్రీస్వామివారికి తిరువీధిసేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు.

రాత్రి వేళలో శ్రీస్వామివారి తిరువారాధన చేపట్టి, స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీఆంజనేయ స్వామివారికి సహస్రనామార్చన జరిపారు. ప్రధానాలయ మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు నిర్వహించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉద యం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. అన్ని విభాగాలను కలుపుకుని స్వామివారి ఖజానాకు రూ.20,88,907 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈవో వెంకట్రావు తెలిపారు.

# భద్రచలంలో పెరిగిన చలి తీవ్రత



**భద్రాచలం డిసెంబర్ 16, ( వెలుతురు)**

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా ఉష్?గ్రతలు అతి తక్కువ స్థాయిలో నమోదు కావడంతో చలి తీవ్రత పెరిగి ప్రజలు చలికి గజగజ వణుకుతున్నారు.పిల్లలు పెద్దలు చలిమంటలకు స్వెట్టర్ లకు అతుక్కుపోతున్నారు . ఉదయం 9 గంటలు అవుతున్నా సూర్యుడు రాక మంచు దుప్పటి లో మిణుకు మిణుకు మంటూ గడుపుతున్నారు ప్రజానీకం.గత రెండు రోజులుగా భద్రాచలం పట్టణంలో మంచు తీవ్రస్థాయిలో పడుతూ,బ్రిడ్జి మీద వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుంది. వాహనాల లైట్లు వేసుకున్నా ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. .బ్రిడ్జి చెక్ పోస్ట్ వద్ద పార్క్ వద్ద కరకట్ట ప్రాంతంలో రామాలయం పరిసర ప్రాంతాల్లో మంచు బాగా కురుస్తుండడంతో రామాలయ ప్రాంగణాలు కనిపించే పరిస్థితి లేదు.రామాలయ స్నానఘట్టాలు,గోదావరి మాతా విగ్రహం,అభయాంజనేయ స్వామి ఆలయం,కళ్యాణ కట్ట మంచు కప్పేసి గోదావరి నది కూడా ఉందా లేదా అన్నట్టు గా ఉంది.భద్రాచలం పట్టణం నాలుగు వైపులా మంచు కురుస్తూ కొంత ఆహ్లాదకరంగా ఉన్నా,మరోపక్క వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతుంది.బ్రిడ్జి మీద వచ్చే పోయే వాహనాలు ఉదయం 8 గంటల వరకు లైట్లు వేసుకుని ప్రయాణం జాగ్రత్తగా చేయాల్సి వస్తుంది. రామాలయ ప్రాంగణాలు అన్ని మంచు కౌగిలిలో వుండిపోతున్నాయి.

# ఫ్రీ క్యాన్సర్ వ్యాక్సిన్


**మాస్కో, డిసెంబర్ 16, ( వెలుతురు)**




క్యాన్సర్.. ప్రస్తుతం సమాజంలో వేగంగా విస్తరిస్తున్న వ్యాధుల్లో ఇదీ ఒకటి. మారుతున్న జీవనశైలి.. ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల కారణంగా స్త్రీపురుష భేదం లేకుండా.. వయసుతో సంబంధం లేకుండా.. క్యాన్సర్ విస్తరిస్తోంది. ఇప్పటి వరకు చికిత్స తప్ప నివారణ లేని వ్యాధి. అయితే దీనికి రష్యా శుభవార్త చెప్పింది. క్యాన్సర్ నివారణకు వ్యాక్సిన్ అభివ ృద్ధి చేసినట్లు అధికారికంగా ప్రకటించింది. త్వరలో ప్రపంచవ్యాప్తంగా ఉచితంగా అందిస్తామని కూడా తెలిపింది. ఈ ఆవిష్కరణ ఆరోగ్య రంగంలో భారీ మలుపును తీసుకురావచ్చు.ఈ వ్యాక్సిన్ mRNA సాంకేతికతపై ఆధారపడి రూపొందించబడింది, ఇది శరీరంలో క్యాన్సర్ కణాలను గుర్తించి నశింపజేసే రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మెలనోమా, లంగ్ క్యాన్సర్, ప్యాన్‌క్రియాస్ వంటి ఆరు ముఖ్య రకాలపై ప్రధానంగా పనిచేస్తుంది. రష్యా గమాలేయా జాతీయ ఎపిడెమాలజీ - మైక్రోబయాలజీ రీసెర్చ్ సెంటర్‌లో అభివ ృద్ధి చేసిన ఈ వ్యాక్సిన్‌కు 'ఫ్యూచర్ - వీ' అనే పేరు ప్రతిపాదించారు.మొదటి, రెండవ దశ ట్రయల్స్‌లో 100 మంది పైగా రోగులపై పరీక్షలు విజయవంతమయ్యాయి. ట్యూమర్ పరిమాణం 30%- 50% తగ్గడం, రోగ నిరోధకత పెరగడం గమనించారు. మూడవ దశ 2026లో ప్రారంభం కానుంది, ఇందుకు డబ్ల్యూహెచ్‌వో, ఈఎంఏ ఆమోదాలు కోరుతున్నారు.2026 చివరి నుంచి ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందజేయనున్నారు. రష్యా ప్రభుత్వం, గమాలేయా సెంటర్, అంతర్జాతీయ సంస్థల సహకారంతో 10 కోట్ల డోసులు ఉత్పత్తి చేయబడతాయి. దిగువ ఆదాయ వర్గాలు, అభివ ృద్ధి చెదుతున్న దేశాలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపింది. భారత్, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలతో ఒప్పందాలు కుదిరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రపంచ ఆరోగ్య సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి, కానీ పూర్తి డేటా ప్రచురణకు ఆందోళన వ్యక్తం చేశాయి. పేటెంట్ హక్కులు, ఉత్పత్తి సామర్థ్యం ప్రధాన సవాళ్లు. విజయం సాధిస్తే, క్యాన్సర్ మరణాలు 40% తగ్గవచ్చని నిపుణులు అంచనా.ఈ వ్యాక్సిన్ విస్తరణతో క్యాన్సర్ చికిత్స ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. పర్సనలైజ్డ్ మెడిసిన్‌కు మార్గం సుగమం అవుతుంది. మరిన్ని ట్రయల్స్ జరిగిన తర్వాత పూర్తి అమలు సాధ్యమవుతుంది.

# ఆ రెండు పదవుల కోసం డజను మంది

**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**




తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఇప్పటి వరకూ రెండుసార్లు మంత్రి వర్గ విస్తరణ జరిగింది. ఇంకా రెండు మంత్రి పదవులు రేవంత్ రెడ్డి కేబినెట్ లో ఖాళీగా ఉన్నాయి. ఇటీవల జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు ముందు మహ్మద్ అజారుద్దీన్ ను ఒక్కరే మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. మరో రెండు పదవులు రెండేళ్లుగా ఖాళీగా ఉన్నాయి. దీంతో మంత్రి వర్గ విస్తరణ జరపాలని పార్టీ రాష్ట్ర నేతలు భావిస్తున్నారు. మరో మూడేళ్లు మాత్రమే సమయం ఉండటంతో మంత్రివర్గ విస్తరణ చేయకుండా నాన్చడం భావ్యం కాదన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా గత రెండు, మూడు రోజుల నుంచి ఢిల్లీలోనే ఉండి పార్టీ పెద్దలను కలసి మంత్రి వర్గ విస్తరణపై చర్చించినట్లు సమాచారం.తెలంగాణ పర్యాటకం మంత్రి వర్గ విస్తరణ చేయాలంటే ముందుగా మంత్రివర్గంలోనూ కొంత ప్రక్షాళన చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలియవచ్చింది. కొందరికి రెండేళ్లపాటు మంత్రిపదవిగా అవకాశమిచ్చినందున మరికొందరికి అవకాశం ఇవ్వాలంటే మంత్రివర్గ ప్రక్షాళన చేయాలని ఆయన నిర?యం తీసుకున్నారని సమాచారం. కొందరిని మంత్రి వర్గం నుంచి తప్పించి మరికొందరికి సామాజికవర్గం, ప్రాంతాలకు తగినట్లుగా మంత్రి వర్గం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. హైకమాండ్ మాత్రం ఇందుకు అంగీకరించిందా? లేదా? అన్నది తెలియక రాకపోయినా పంచాయతీ ఎన్నికలు ముగిసిన తర్వాత మంత్రి వర్గ విస్తరణ చేపడితేనే రానున్న ఎన్నికలకు తన టీం ను సిద్ధం చేసుకోవాలన్నది రేవంత్ ఆలోచనగా ఉంది.ఉన్న మంత్రివర్గంలో సభ్యులను అలాగే ఉంచి కేవలం ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేసినట్లయితే ఆశావహుల్లో మరింత నిరాశ ఎదురవుతుందని రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతల అభిప్రాయంగా కూడా ఉంది. ఖాళీగా ఉన్న మంత్రి పదవులు రెండింటితో పాటు మరో నలుగురిని అయినా తప్పించగలిగితే ఆరుగురికి కొత్త వారికి అవకాశం దక్కుతుందని, అప్పుడు ఎలాంటి అసంత ృప్తులు ఉండవన్న అంచనాలో ఉన్నారు. కానీ హైకమాండ్ ఇంత వరకూ దీనిపై ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిసింది. కేసీ వేణుగోపాల్ తో చర్చించిన తర్వాత కూడా క్లారిటీ రానట్లే తెలిసింది. మరొకవైపు పంచాయతీ ఎన్నికల తర్వాత మాత్రం మంత్రి వర్గ విస్తరణ ఉంటుందన్న ప్రచారం బలంగా వినిపిస్తుండటంతో ఆశావహులు ఢిల్లీ బాట పట్టే అవకాశముంది. మరి మూడో దశ పంచాయతీ ఎన్నికలు ఈ నెల 17వ తేదీన జరగనున్నాయి. అయితే మంత్రి వర్గ విస్తరణ అనేది ఎప్పుడన్నది మాత్రం క్లారిటీ రాకపోవడానికి కారణం ఎవరు ఇన్.. ఎవరు అవుట్? అన్న దానిపై హైకమాండ్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వకపోవడమే.

# ప్రియాంక గాంధీతో పీకే మంతనాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 16, ( వెలుతురు)**



రాజకీయాల్లో శాశ్వత మిత్రులు ఉండరు, శాశ్వత శత్రువులు ఉండరు.. ఉండేది కేవలం శాశ్వత ప్రయోజనాలు మాత్రమే. ఈ నానుడిని నిజం చేస్తూ.. ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ పార్టీ అధినేత ప్రశాంత్ కిశోర్ తాజాగా కాంగ్రెస్ అగ్రనాయకురాలు ప్రియాంక గాంధీతో భేటీ కావడం దేశ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. ఒకప్పుడు కాంగ్రెస్ నాయకత్వంపై అసహనంతో సొంత కుంపటి పెట్టుకున్న పీకే, ఇప్పుడు మళ్లీ అదే పార్టీ గడప తొక్కడానికి ప్రధాన కారణం.. ఇటీవలి బీహార్ ఎన్నికల ఫలితాలే అని చెప్పొచ్చు. ఇటు కాంగ్రెస్, అటు జన్ సురాజ్.. రెండూ ఘోర పరాజయాన్ని చవిచూసిన వేళ, ఈ కలయిక భవిష్యత్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చబోతోందా అనే ఆసక్తి నెలకొంది.పీకే - ప్రియాంకల భేటీకి కారణం బీహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ప్రశాంత్ కిశోర్ ఎంతో ప్రతిష్టాత్మకంగా స్థాపించిన జన్ సురాజ్ పార్టీకి బీహార్ ప్రజలు గట్టి షాక్ ఇచ్చారు. మొత్తం 238 స్థానాల్లో పోటీ చేస్తే, ఒక్క సీటు కూడా గెలవకపోగా.. ఏకంగా 236 చోట్ల డిపాజిట్లు గల్లంతయ్యాయి. "వ్యూహకర్తగా గెలిపించడం వేరు.. నాయకుడిగా గెలవడం వేరు" అనే సత్యాన్ని ఈ ఫలితాలు పీకేకి రుచి చూపించాయి.మరోవైపు కాంగ్రెస్ పరిస్థితి కూడా అంతకంటే భిన్నంగా ఏమీ లేదు. మహాకూటమిలో భాగంగా 61 సీట్లలో పోటీ చేసిన హస్తం పార్టీ, కేవలం 6 సీట్లకే పరిమితమైంది. ఈ ఫలితాలు రెండు పార్టీల అస్తిత్వాన్నే ప్రశ్నించేలా మారాయి. ఈ నేపథ్యంలోనే, ఇద్దరు పరాజితులు కలిసి భవిష్యత్ ప్రయాణం సాగించాలనే నిర?యానికి వచ్చినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.నిజానికి ప్రశాంత్ కిశోర్ కాంగ్రెస్ గూటికి చేరడం ఇది కొత్తేమీ కాదు. జేడీయూ నుంచి బయటకు వచ్చాక, ఆయన కాంగ్రెస్ పార్టీ పునరుజ్జీవనం కోసం ఒక బ ృహత్తర ప్రణాళికను సోనియా గాంధీకి సమర్పించారు. గాంధీ కుటుంబం కాని వ్యక్తికి పార్టీ పగ్గాలు అప్పజెప్పడం దగ్గరి నుంచి, సంస్థాగత నిర్మాణం వరకు అనేక సంచలనాత్మక మార్పులను ఆయన సూచించారు. అయితే, సోనియా గాంధీ ఆ నివేదిక పరిశీలనకు ఒక కమిటీని వేసి, పీకేను ఆ కమిటీలో ఒక సభ్యుడిగా చేరమన్నారు. కానీ, నిర?యాధికారాలు లేని కమిటీలో ఉండలేనని, తనకు ఫ్రీ హ్యాండ్ కావాలని పీకే పట్టుబట్టడంతో ఆ చర్చలు విఫలమయ్యాయి. ఆ తర్వాతే ఆయన జన్ సురాజ్ యాత్రను ప్రారంభించారు.సోనియా గాంధీ హయాంలో విఫలమైన చర్చలు, ఇప్పుడు ప్రియాంక గాంధీ చొరవతో మళ్లీ చిగురించడం ఆసక్తికరం. ప్రస్తుతం కాంగ్రెస్ లో రాహుల్ గాంధీ తర్వాత అత్యంత క్రియాశీలకంగా ఉన్నది ప్రియాంకే. ఆమెతో పీకే భేటీ అవ్వడం వెనుక రెండు ప్రధాన కారణాలు కనిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో సొంత పార్టీని నిర్మించి, క్యాడర్ ను తయారు చేసుకోవడం ఎంత కష్టమో పీకేకి బీహార్ ఎన్నికలు అర్థం చేయించాయి. ఇప్పటికే బలమైన ఓటు బ్యాంకు, చరిత్ర ఉన్న కాంగ్రెస్ లాంటి ప్లాట్ ఫామ్ పై తన వ్యూహాలను అమలు చేయడం సులువని ఆయన భావిస్తుండవచ్చు. వరుస ఓటములతో కునారిల్లుతున్న కాంగ్రెస్ కు, కేవలం సిద్ధాంతాలు మాత్రమే సరిపోవు.. గెలిచే వ్యూహం కావాలి. ఆ లోటును భర్తీ చేయగల సత్తా పీకేకి ఉందని అధిష్టానం నమ్ముతోంది. తాజా సమాచారం ప్రకారం, ప్రశాంత్ కిశోర్ మళ్లీ కాంగ్రెస్ కోసం పనిచేసేందుకు కొన్ని తాజా ప్రతిపాదనలతో వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈసారి ఆయన పాత్ర కేవలం ఎన్నికల వ్యూహకర్త గా ఉంటుందా? లేక పార్టీలో చేరి కీలక పదవిని చేపడతారా? అన్నది తేలాల్సి ఉంది. జన్ సురాజ్ ను కాంగ్రెస్ లో విలీనం చేస్తారా అనే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంలో, టికెట్ల కేటాయింపులో తనకు స్పష్టమైన పాత్ర కావాలని పీకే కోరుతున్నట్లు సమాచారం.మొత్తానికి, బీహార్ ఎన్నికల ఫలితాలు ప్రశాంత్ కిశోర్ కు వాస్తవికతను, కాంగ్రెస్ కు అనివార్యతను గుర్తుచేశాయి. ప్రశాంత్ కిశోర్ దగ్గర బ్లూ ప్రింట్ ఉంది, కాంగ్రెస్ దగ్గర బ్రాండ్ ఉంది. ఈ రెండూ కలిస్తేనే బీజేపీ వంటి బలమైన శక్తిని ఎదుర్కోగలమని ఇరువురూ గ్రహించినట్లు కనిపిస్తోంది. ప్రియాంక గాంధీతో జరిగిన ఈ భేటీ.. కేవలం చర్చలకే పరిమితమవుతుందా లేక కాంగ్రెస్ వార్ రూమ్ లో పీకే మళ్లీ చక్రం తిప్పుతారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# పోటీకి సిద్ధమవుతున్నకవిత పార్టీ

**హైదరాబాద్, డిసెంబర్ 16, ( వెలుతురు)**



తెలంగాణ జాగ ృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, 2029 ఎన్నికల్లో తాము పోటీ చేస్తామని.. పార్టీకి మాత్రం ప్రజలు సూచించిన పేరును మాత్రమే పెడతామన్నారు. 'ఆస్క్ కవిత' ఇంటరాక్షన్‌లో పాల్గొన్న ఆమె, యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యమన్నారు. కాంగ్రెస్ పాలన హామీలను నెరవేర్చడంలో 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని.. ప్రజలు తీవ్ర అసంత ృప్తితో ఉన్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు ఆత్మహత్యలు, సింగరేణి నిర్లక్ష్యంపై ప్రభుత్వంపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. వ్యక్తిగత అంశాల్లో, తాను చిరంజీవి అభిమానిని అని తెలిపారు.తెలంగాణ రాజకీయాల్లో రాబోయే కాలంలో కీలక పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయని తెలంగాణ జాగ ృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంకేతాలు ఇచ్చారు. సామాజిక తెలంగాణను తమ ప్రధాన లక్ష్యంగా ప్రకటించిన ఆమె.. 2029 సార్వత్రిక ఎన్నికల్లో తాము పోటీలో ఉంటామని స్పష్టం చేశారు. సోమవారం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' (గతంలో ట్విట్టర్) వేదికగా 'ఆస్క్ కవిత' హ్యాష్‌ట్యాగ్‌పై నెటిజన్లు అడిగిన ప్రశ్నలకు ఆమె నిశితంగా సమాధానాలు ఇచ్చారు.కొత్త పార్టీ స్థాపనపై అడిగిన ప్రశ్నకు కవిత ఆసక్తికరమైన సమాధానం ఇచ్చారు. 2029 ఎన్నికల్లో పోటీ చేస్తామని స్పష్టం చేసిన ఆమె.. పార్టీ పేరును ప్రజలు సూచించిన దానినే పెడతామన్నారు. యువత, మహిళలకు రాజకీయ అవకాశాలు కల్పించేందుకు జాగ ృతి క ృషి చేస్తుందన్నారు. యువత తమకు నచ్చిన రంగాల్లో అవకాశాలు పొందాలని.. అందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉద్యోగాలు, స్కిల్, భద్రత ఈ మూడింటిలో దేనికి ప్రాధాన్యం ఇస్తారని ప్రశ్నించగా.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తన ప్రథమ ప్రాధాన్యమని కవిత తేల్చిచెప్పారు. జాగ ృతిని బలంగా తయారు చేసి, త్వరలోనే మెంబర్‌షిప్ డ్రైవ్ ప్రారంభిస్తామని చెప్పారు.ప్రస్తుతం తెలంగాణలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కవిత తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'అట్టర్ ఫ్లాప్' అయ్యిందని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంత ృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు చదువులకు దూరం కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైతుల ఆత్మహత్యలు చాలా బాధాకరమని అన్నారు.ఫార్మా సిటీ కోసం తీసుకున్న భూముల్లో ఫ్యూచర్ సిటీ అంటూ హడావుడి చేయటంపై మండిపడ్డారు. త్వరలోనే అక్కడి రైతులకు మద్దతుగా పోరాటం చేస్తామని ప్రకటించారు. సింగరేణి సంస్థను తీవ్రంగా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. హెచ్ఎంఎస్‌తో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేస్తామన్నారు. హైదరాబాద్‌లో వెస్ట్ సిటీపై పెట్టిన శ్రద్ధ ఈస్ట్ సిటీని, అభివ ృద్ధి చేయటంలో పెట్టలేదని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని కవిత విమర్శించారు.కవిత తన వ్యక్తిగత అభిరుచులకు సంబంధించిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇచ్చారు. తాను చిరంజీవి అభిమానిని అని స్పష్టం చేశారు. నటుడు రామ్‌చరణ్ చాలా హంబుల్‌గా ఉండే మంచి డ్యాన్సర్ అని చెబుతూనే.. చిరంజీవి తర్వాతే రామ్‌చరణ్ అని సరదాగా పేర్కొన్నారు. చిన్నప్పుడు ఎర్రమంజిల్‌లో గడిపిన క్షణాలు తనకు అత్యంత సంతోషాన్ని ఇచ్చాయని తెలిపారు.

# ఓజి విజయంతో పవన్ ఖుషీ


## డైరెక్టర్ సుజిత్‌కు కారు బహుకరణ



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు చాలా రోజుల తర్వాత బ్లాక్ బస్టర్ అందుకున్న విషయం తెలిసిందే. చాలా రోజుల తర్వాత పవన్‌కి ఓజీ రూపంలో బ్లాక్ బస్టర్ రావడంతో ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. అయితే 'ఓజీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం.. నటుడు పవన్ కళ్యాణ్ చిత్ర దర్శకుడు సుజిత్ కు అద్భుతమైన బహుమతిని అందించారు. 'ఓజీ' సాధించిన అద్భుత విజయానికి సంతోషించిన పవన్ కళ్యాణ్, దర్శకుడు సుజిత్‌కు లగ్జరీ కారు ని బహుమతిగా ఇచ్చారు. ప్రముఖ కార్ల కంపెనీ లాండ్ రోవర్‌కి చెందిన రేంజ్ రోవర్ లగ్జరీ కారుని సుజిత్‌కి గిఫ్ట్‌గా ఇచ్చాడు. కాగా ఈ విషయాన్ని సుజిత్ ఎక్స్ వేదికగా పంచుకున్నాడు. నేను అందుకున్న బహుమతుల్లో ఇది అత్యుత్తమమైనది. మాటల్లో చెప్పలేనంత ఆనందంగా, కృతజ్ఞతతో నిండిపోయాను. నా అత్యంత ప్రియమైన ఓజీ, కళ్యాణ్ గారి నుండి లభించిన ఈ ప్రేమ, ప్రోత్సాహం నాకు అన్నిటికంటే ముఖ్యం. చిన్ననాటి నుంచి ఆయన అభిమానిగా మొదలై ఈ ప్రత్యేక క్షణం వరకు? ఇది నిజంగా అద్భుతం. జీవితంలో ఎప్పటికీ ఆయనకు రుణపడి ఉంటాను'. అంటూ సుజిత్ రాసుకోచ్చాడు.

# రౌడీ జనార్ధన్‌గా వస్తోన్న విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రవికిరణ్ కోల దర్శకత్వంలో 'రౌడీ జనార్దన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. కీర్తి సురేశ్ కథానాయిక. ఈ సినిమా ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న సంగతి తెలిసిందే. ఈనెల 18న దిల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దీనికి సంబంధించి విజయ్ డబ్బింగ్ పూర్తి చేసినట్లు తెలిసింది. ఇది కోనసీమ నేపథ్యంలో సాగే పీరియాడిక్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతోంది. దీంట్లో ఓ అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. విజయ్ ఈ సినిమాలో మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో అలరించనున్నారు.




# బోర్డర్-2 టీజర్ విడుదల

1997 నాటి ఐకానిక్ వార్ డ్రామా 'బోర్డర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న చిత్రం 'బోర్డర్ 2'. ఈ సీక్వెల్‌లో సన్నీ డియోల్‌తో పాటు వరుణ్ ధావన్, దిల్‌జిత్ దోసాంజ్, అహన్ శెట్టి కీలక పాత్రల్లో నటిస్తుండగా.. ఈ సినిమాకు అనురాగ్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం రిపబ్లిక్ డే కానుకగా జనవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. ఈ టీజర్‌లో బాలీవుడ్ నటుడు సన్నీ డియోల్ తన పాత మేజర్ కుల్‌దీప్ సింగ్ పాత్రలో తిరిగి కనిపించి అభిమానులను ఆకట్టుకున్నారు. మీరు ఆకాశం నుంచో, భూమి నుంచో, సముద్రం నుంచో ఎక్కడి నుంచి చొరబడాలని ప్రయత్నించినా, మీకు ముందు ఒక హిందుస్తానీ సైనికుడు నిలబడి కనిపిస్తాడు. కళ్లలోకి కళు పెట్టి, ధైర్యంగా నిలబడి, దమ్ముంటే రండి, ఇదిగో హిందుస్థాన్ ఇక్కడే ఉంది అంటాడు. అంటూ టీజర్‌లో సన్నీ డియోల్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటుంది. టీజర్ చివర్లో, సన్నీ డియోల్ తన సైనికులను ఉద్దేశించి మీ నినాదం ఎక్కడిదాకా వినిపించాలి? అని అడగగా, వారు గట్టిగా లాహోర్ దాకా!' అని జవాబివ్వడం హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రం కూడా 1971 ఇండో-పాకిస్తాన్ యుద్ధంలో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కించినట్లు మేకర్స్ తెలిపారు.




# శిల్పాశెట్టి బాస్టియన్ రెస్టారెంట్‌పై కేసు



బాలీవుడ్ నటి శిల్పా శెట్టికి చెందిన ప్రముఖ రెస్టారెంట్ 'బాస్టియన్' బెంగళూరులో మరో వివాదంలో చిక్కుకుంది. అనుమతించిన సమయం కంటే ఎక్కువసేపు కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు, అర్ధరాత్రి పార్టీలకు అనుమతించి నిబంధనలు ఉల్లంఘించినందుకు గాను బెంగళూరు పోలీసులు ఈ రెస్టారెంట్‌పై కేసు నమోదు చేశారు. సెయింట్ మార్క్స్ రోడ్‌లో ఉన్న 'బాస్టియన్' రెస్టారెంట్ డిసెంబర్ 11న రాత్రి 1.30 గంటల వరకు కార్యకలాపాలు కొనసాగించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఇది పోలీసులు ఇచ్చిన సమయానికంటే ఎక్కువ సేపు నిర్వహించినట్లు సమాచారం. దీంతో కర్ణాటక పోలీస్ చట్టంలోని సెక్షన్ 103 కింద సుమోటో ఫిర్యాదుల ఆధారంగా కబ్బన్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు మేనేజర్‌లు, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు అయ్యాయి. 'బాస్టియన్'తో పాటు, రెసిడెన్సీ రోడ్‌లో ఉన్న 'సౌర్ బెర్రీ పబ్' పై కూడా కేసు నమోదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా పబ్ సిబ్బందితో సహా ఎనిమిది మంది వాంగ్మూలాలను పోలీసులు రికార్డు చేశారు.

# శివ రాజ్‌కుమార్, ఉపేంద్రల మల్టీస్టారర్ చిత్రం '45'.



కన్నడ అగ్ర నటులు శివ రాజ్‌కుమార్, ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ చిత్రం '45'. ఈ సినిమా డిసెంబరు 25న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఈ చిత్రంలో శివ రాజ్‌కుమార్, ఉపేంద్రతో పాటు రాజ్ బి. శెట్టి కూడా ఓ ముఖ్య పాత్ర పోషిస్తున్నాడు. ఈ సినిమా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. సినిమా విభిన్నమైన కథాంశంతో, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ కు అధిక ప్రాధాన్యం ఇస్తూ రూపొందినట్టు స్పష్టమవుతోంది. ఉపేంద్ర తన గత చిత్రాల మాదిరిగానే ఇందులోనూ ఒక డిఫరెంట్, ఛాలెంజింగ్ రోల్‌లో కనిపించనున్నట్లు సమాచారం. ఈ చిత్రం డిసెంబరు 25న క్రిస్మస్ కానుకగా విడుదల కానుండగా తెలుగు ప్రేక్షకుల కోసం ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా, జనవరి 1న కొత్త సంవత్సరం కానుకగా విడుదల చేయనున్నారు.

# అమెజాన్‌లోకి రష్మిక థామా మూవీ


మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన హార్రర్ మూవీస్‌కు సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఇదే జోనర్‌లో రష్మిక మందన్నా, ఆయుష్మాన్ ఖురానా కాంబోలో దీపావళి సీజన్‌లో ఎంట్రీ ఇచ్చిన బాలీవుడ్ చిత్రం థామా . మ్యాడ్‌డాక్ హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా వచ్చిన ఈ చిత్రం థియేటర్లలో విడుదలై మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. తెలుగులో కూడా డబ్బింగ్ అయిన ఈ చిత్రానికి యావరేజ్ టాక్ వచ్చింది. ఆ తర్వాత థామా పాపులర్ ఓటీటీ ఎ÷-లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోలో ఇటీవలే రెంటల్ బేసిస్‌లో ఎంట్రీ ఇచ్చింది. ఈ చిత్రాన్ని ఇక ఉచితంగా చూసేయొచ్చు. థామా అమెజాన్ సబ్ స్క్రైబర్లకు ఉచితంగా అందుబాటులో ఉంది. హిందీ, తెలుగు ఆడియోతోపాటు ఇంగ్లీష్ సబ్ టైటిల్స్ తో వీక్షించవచ్చు. ఆదిత్య సర్పోట్‌దర్ డైరెక్టర్ చేసిన ఈ చిత్రంలో నవాజుద్దీన్ సిద్దిఖీ, పరేశ్ రావల్ ఇతర కీలక పాత్రల్లో నటించారు. సచిన్-జిగర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు. మలైకా అరోరా, నోరా ఫతేహి, వరుణ్ ధవన్ కామియో రోల్స్‌లో నటించారు.




# నా పెళ్లిపై అసత్య ప్రచారలెందుకు?

## నటి మెహరిన్ ఘాటు వ్యాఖ్యలు

తన పెళ్లి వార్తలపై అసత్య కథనాలపై నటి మెహరిన్ తీవ్రంగా స్పందించారు. తన పెళ్లంటూ ఆర్టికల్ రాసిన ఓ మీడియా సంస్థపై నటి మెహరీన్ అసహనం వ్యక్తంచేశారు. గత రెండేళ్లుగా ఇలాంటి వ్యవహారాలపై మౌనంగా ఉన్నా, ఇప్పుడు మాట్లాడక తప్పడం లేదన్నారు. నేను ఎవరినీ వివాహం చేసుకోలేదు. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు ప్రపంచానికి చెబుతా.. అంతేగానీ తన పెళ్లి గురించి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. హరియాణాకు చెందిన భవ్యా బిష్ణోయ్‌తో మెహరీన్ నిశ్చితార్థం జరిగినా అనివార్య కారణాల వల్ల పెళ్లి రద్దు అయింది. 2022లో వచ్చిన 'ఎఫ్ 3' తర్వాత ఆమె నటించిన తెలుగు సినిమా 'స్పార్క్'. కోలీవుడ్‌లోనూ ఒక్క సినిమాలోనే (ఇంద్ర) నటించారు. ప్రస్తుతం కన్నడలో ఓ చిత్రం చేస్తున్నారు. కెరీర్‌లో గ్యాప్‌పై ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. గ్యాప్ కావాలని తీసుకోలేదని, 'ఎఫ్ 3' తర్వాత చేసిన 'సుల్తాన్ ఆఫ్ ఢిల్లీ' వెబ్‌సిరీస్ కోసం ఎక్కువ సమయం కేటాయించానని తెలిపారు.



# అఖిల్ సినిమా కోసం బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే స్పెషల్ సాంగ్....

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) డిసెంబర్ 16 :** టాలీవుడ్‌లో అక్కినేని వారసుడిగా భారీ అంచనాల మధ్య ఇండస్ట్రీలో అడుగుపెట్టిన అఖిల్ కెరీర్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో ముందుకు సాగలేదు.స్టార్ ఫ్యామిలీ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నప్పటికీ, సరైన కథలు పడకపోవడం, వరుస పరాజయాలు ఆయన కెరీర్ గ్రాఫ్‌ను కిందికి లాగాయి.భారీ హిట్‌తో ఇండస్ట్రీకి తన సత్తా చూపించాలన్న లక్ష్యంతో 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నాడు.లెనిన్' అఖిల్ కెరీర్‌లో మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్‌గా మారింది. ఈ చిత్రానికి మురళీ కే కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఈసారి పూర్తిగా మాస్, యాక్షన్ డ్రామా జానర్‌లో అఖిల్‌ను కొత్తగా చూపించబోతున్నారని సమాచారం. గత సినిమాల్లా కాకుండా, డీ-గ్లామర్ లుక్‌లో, పక్కా లోకల్ రా క్యారెక్టర్‌లో అఖిల్ కనిపించనున్నాడని టాక్. దీంతో ఈసారైనా అఖిల్ హిట్ కొట్టగలడా లేదా అన్న ఆసక్తి అభిమానుల్లో బాగా పెరిగింది. అక్కినేని కుటుంబానికి చెందిన ప్రతిష్టాత్మక బ్యానర్ అన్నపూర? స్టూడియోస్‌తో పాటు, టాలీవుడ్‌లో వరుస హిట్లతో దూసుకుపోతున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నాయి. నాగార్జున, నాగవంశీ కలిసి ఈ సినిమాను ప్రొడ్యూస్ చేస్తుండటంతో ప్రాజెక్ట్ స్థాయి అమాంతం పెరిగింది.సినిమాలో ఒక భారీ స్పెషల్ సాంగ్ కోసం బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండేను ఎంపిక చేసినట్టు టాక్. అఖిల్‌తో కలిసి ఆమె డ్యాన్స్ చేయనుందని,ప్రచారం



# నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌లకు ఊరట




**న్యూఢిల్లీ,డిసెంబర్16( వెలుతురు):**
నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలకు తాత్కాలిక ఊరట లభించింది. ఈ కేసులో వారిరువురితో పాటు మరో ఐదుగురిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) దాఖలు చేసిన చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునేందుకు ఢిల్లీ కోర్టు మంగళవారం నిరాకరించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం లేదా పిఎంఎల్‌ఎ కింద ఇడి దాఖలు చేసిన ఫిర్యాదును ఎఫ్‌ఐఆర్ లేకుండా సమర్థించలేమని రోస్ అవెన్యూ కోర్టు పేర్కొంది. ఈ కేసులో ఢిల్లీ పోలీసుల ఆర్థిక నేరాల విభాగం ఇప్పటికే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిందని, దీంతో ఇడి చార్జిషీటుపై ముందస్తుగా స్పందించలేమని తెలిపింది. ÷శిషనల్ హెరాల్డ్ మాతృసంస్థ అయిన అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్‌ను మోసపూరితంగా స్వాధీనం చేసుకోవడానికి కుట్రపన్నారని ఆరోపిస్తూ సోనియా, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ విదేశీ విభాగం చీఫ్ శామ్ పిట్రోడా సహా ఐదుగురిపై ఆర్థిక నేరాల విభాగం (ఇఒడబ్ల్యు) గత నెలలో నివేదికను దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఇడి అందించిన సమాచారం ఆధారంగా ఇఒడబ్ల్యు ఈ నివేదికను సమర్పించింది.

# బిఆర్ఎస్ పార్టీ సమావేశం 21కి వాయిదా

**- వెల్లడించిన పార్టీ నేత హరీష్ రావు**




**హైదరాబాద్,డిసెంబర్16( వెలుతురు):**
ఈ నెల 19న జరగాల్సిన బీఆర్ఎస్‌ఎల్పీ, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం వాయిదా పడింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఐఅఖీ) ఆదేశాల మేరకు డిసెంబర్ 21న ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ సీనియర్ నేత హరీశ్ రావు వెల్లడించారు. ఈ నెల 19వ తేదీతో పార్లమెంట్ సమావేశాలు ముగియనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ పార్లమెంట్ సభ్యులు కూడా ఈ సమావేశంలో పాల్గొనడం కోసం వాయిదా వేయడం జరిగింది. ఈనెల 21న కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్ వేదికగా నిర్వహించే బిఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసన సభ్యులు పాల్గొననున్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయంపై, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన నీటిపారుదల ప్రాజెక్టులను నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకుపోవడంలో చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై ఈ సమావేశంలో చర్చ జరుగనున్నది. గోదావరి, కృష్ణ జలాలను కొల్లగొడుతున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దోపిడీని అడ్డుకోవడంలో రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ క్రమంలో తెలంగాణ ప్రజల రైతాంగ సాగునీటి హకులను కాపాడుకోవడానికి మరో ప్రజా ఉద్యమం తప్పదని బీఆర్ఎస్ భావిస్తున్నది. ఏపీ జలదోపిడీపై తెలంగాణ ప్రజా ఉద్యమాలు ఎలా చేపట్టాలనే అంశంపై పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి అధినేత కేసీఆర్ లోతుగా చర్చించనున్నారు.

# ఆరోగ్య వ్యవస్థలో మార్పులకు యత్నం

**- నిపుణుల ఆలోచనలకు అనుగుణంగా మార్పులు**

**- మంత్రి సత్య కుమార్ యాదవ్ వెల్లడి**



**అమరావతి, డిసెంబర్16(వెలుతురు):**
రాష్ట్ర ఆరోగ్య వ్యవస్థలో మార్పు తీసుకురావడం జరుగుతుందని మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. 10 వ్యాధులను మ్యాపింగ్ చేసి ఎక్స్‌పర్ట్స్ ఆలోచనలకు అనుగుణంగా ట్రీట్‌మెంట్ చేయటం జరుగుతుందని వెల్లడించారు. జాతీయ, అంతర్జాతీయ ఎక్స్‌పర్ట్స్‌తో ఉండే శాస్త్రవేత్తలు ఈ గ్రూప్‌లో ఉన్నారని తెలిపారు. దేశ విదేశాలలో ఉన్న ఈ సైంటిస్ట్‌లు వర్చువల్ విధానంలో మొదటి సమావేశానికి హాజరయ్యారన్నారు. వ్యక్తిగత చికిత్స అందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఈ ఎక్స్‌పర్ట్స్ గ్రూప్ పనిచేస్తుందని అన్నారు. ఆరోగ్య వ్యవస్థని పటిష్టత చేసే యోచనలో ముందుకి వెళ్తున్నామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో ఫీల్డ్ విజిట్ చేయటం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఇక.. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణపై మంత్రి స్పందించారు. కోటి సంతకాల రాద్ధాంతం మొదలైందని.. ఇది కోడి గీతల కార్యక్రమం అంటూ ఎద్దేవా చేశారు. సుపరిపాలన యాత్రలో ఎవరు కూడా కోటి సంతకాల కార్యక్రమంలో పాల్గొనలేదని తెలియజేశారు. లక్షల మందిలో కనీసం ఒక్కరు కూడా సంతకం చేసిన దాఖలు లేవన్నారు. గ్రామ, పట్టణ, కళాశాలలో కానీ పేదలలో ఎలాంటి చర్చ లేదన్నారు. కార్యకర్తలకు సంతకాలు పెట్టి చేతులు వాసిపోతున్నాయని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఃూగా.. ఈరోజు సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. అత్యున్నత స్థాయి నిపుణుల సలహా బృందంతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడారు. ఈ సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, గేట్స్ ఫౌండేషన్ కంట్రీ డైరెక్టర్ అర్చనా వ్యాస్ తదితరులు పాల్గొన్నారు.

# కెసిఆర్ వచ్చినా..కెటిఆర్ పాదయాత్ర చేసినా ఏం లాభం

## తెలంగాణలో బిఆర్ఎస్‌కు కాలం చెల్లిందన్న ఆది శ్రీనివాస్



**హైదరాబాద్,డిసెంబర్16( వెలుతురు):**
కెసిఆర్ బయటకు వచ్చినా..కెటిఆర్ పాదయాత్ర చేసినా ఉపయోగ మేమిటని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బయటకు వచ్చినా చేసేదేమీ లేదన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేసి ఏం సాధిస్తారని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్ పదేండ్లలో చేయనిది సీఎం రేవంత్ రెడ్డి రెండేళ్లలో చేశారని.. పాదయాత్ర చేస్తే కేటీఆర్‌కు ఈ విషయం అర్థమవుతుందన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌పై ఆది శ్రీనివాస్ నిప్పులు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫారం ఇచ్చినా కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఎందుకు ఓడిపోయారంటూ సందేహం వ్యక్తం చేశారు. కేటీఆర్ తొలిసారి 171 ఓట్ల మెజార్టీతో గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టారని.. కానీ తాను మొదటి సారి 14,561 ఓట్లతో విజయం సాధించానని ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. తండ్రి చాటు బిడ్డగా కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చారని ఆయన వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను కష్టపడి రాజకీయాల్లోకి వచ్చానన్నారు.

అయితే కేసీఆర్ మనవడు అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యారని.. కానీ రేవంత్ మనవడు ప్రయివేట్ కార్యక్రమానికి వచ్చారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వివరించారు. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు.. మూడు దశల్లో జరుగుతున్నాయి. రేపటితో అంటే డిసెంబర్ 17వ తేదీ మూడో దశతో ఈ ఎన్నికల పక్రియ ముగియనుంది. అయితే రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కొన్ని స్థానాలను గెలుచుకుంది. ఈ ఫలితాలు.. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను స్పష్టం చేస్తున్నాయని కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. రోవైపు డిసెంబర్ 19వ తేదీన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఆ పార్టీ అధినేత కేసీఆర్ సమావేశం కానున్నారు.

ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయలని హామీలు, తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలు, ఏపీ ప్రభుత్వం చేపట్టనున్న పోలవరం నల్లమల సాగర్ ప్రాజెక్ట్ అంశం, తెలంగాణలో ప్రాజెక్ట్ అంశాలను కేసీఆర్ ప్రస్తావించే అవకాశం ఉన్నట్లు సమాచారం.మరోవైపు తెలంగాణలో పాదయాత్ర చేపట్టనున్నట్లు కేటీఆర్ ఇప్పటికే ప్రకటించారు. కేటీఆర్ చేపట్టే ఈ యాత్ర వల్ల ప్రజలకు ఎటువంటి ప్రయోజనం చేకూరదంటూ ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నేతలు విమర్శిస్తున్న విషయం విదితమే.

# దాడులపై మౌనం వహిస్తే ప్రతిదాడులు తప్పవు

**- గ్రామాల్లో కాంగ్రెస్ రౌడీయిజం చేస్తోంది**

**- కామారెడ్డి జిల్లా బాధితులకు కెటిఆర్ పరామర్శ**



**హైదరాబాద్,డిసెంబర్16( వెలుతురు):**
గ్రామాల్లో కాంగ్రెస్ నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదన్నారు. పోలీసులు నిందితులపై చర్యలు తీసుకోకపోతే తిరగబడాల్సి వస్తుందని హెచ్చరించారు. నిజామాబాద్ జిల్లా సోమార్‌పేట్‌లో కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడి సికింద్రాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థి బిట్ల బాలరాజు, అతని భార్య గంజి భారతిని కేటీఆర్ పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ధైర్యం చెప్పి, వైద్య ఖర్చులు పార్టీనే భరిస్తుందని.. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ గూండాలు ఇష్టమొచ్చినట్టు దాడులకు తెగబడుతుంటే.. పోలీసులు నిశ్చేష్టులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితులపై చర్యలు తీసుకోకపోతే తాము కూడా తిరగబడాల్సి వస్తుందన్నారు. ఇక దాడికి ప్రతిదాడే సమాధానం అనుకుంటే, రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని, అప్పుడు జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రాష్ట్రంలో పోలీసులు వ్యవహరిస్తున్న అత్యంత దారుణంగా ఉందన్నారు. డీజీపీ స్థాయి నుంచి కిందిస్థాయి పోలీస్ అధికారుల వరకు అందరికీ గుర్తు చేస్తున్నా.. మీకు జీతాలు ఇస్తున్నది ప్రజల సొమ్ముతోనే. రేవంత్ ఇంట్లో సొమ్ముతోనే, కాంగ్రెస్ సొమ్ముతోనే కాదు. ప్రజల ప్రాణాలు పోతుంటే పోలీసులు చేష్టలుడిగి చూడటం పద్ధతి కాదని హెచ్చరించారు. భారతి, బాలరాజులపై దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదుచేయాలన్నారు. ఆస్పత్రి పాలైన వారి కుటుంబాని ఆర్థిక సహాయం, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండేండ్లుగా బీఆర్ఎస్ కార్యకర్తకలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడు తున్నారని చెప్పారు. సూర్యాపేట, నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థులపై దాడి చేసి మూత్రం తాగించారన్నారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల ముందు బీఆర్ఎస్ కార్యకర్త మల్లయ్య యాదవ్‌ను కాంగ్రెస్ గూండాలు హత్య చేశారు, ఇంకో బీసీ సోదరుడి భార్య నామినేషన్ వేస్తే, అతడిని కిడ్నాప్ చేసి కోమటిరెడ్డి అనుచరులు చిత్ర హింసలు పెట్టారన్నారు. ఇన్ని అరాచకాలు జరిగినా పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇవన్నీ గుర్తుపెట్టుకుంటున్నామని, పోలీసులు డ్యూటీ సరిగ్గా చేయకపోతే తామే డ్యూటీ చేస్తామన్నారు. దాడికి ప్రతిదాడి అనే పరిస్థితే వస్తే తాము కూడా తిరగబడతామన్నారు. కాంగ్రెస్ గూండాల దాడిలో తీవ్ర గాయాల పాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న భారతి, బాలరాజ్ కుటుంబానికి, ఇతర కార్యకర్తలకు అయ్యే పూర్తి వైద్య ఖర్చులను పార్టీనే భరిస్తుందని చెప్పారు. కార్యకర్తలు అధైర్యపడవద్దని.. దాడికి తెగబడ్డ కాంగ్రెస్ గూండాలను వదిలిపెట్టేది లేదని స్పష్టం చేశారు. అవసరమైతే డీజీపీ, ఎస్పీ కార్యాలయాల ముట్టడికైనా పిలుపునిస్తామన్నారు. న్యాయం జరిగే వరకు పోరాడుతామని చెప్పారు. సీఎం తన భాషతో కార్యకర్తలను రెచ్చగొట్టడం మానుకోవాలని, జరగబోయే పరిణామాలకు ఆయనే బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు.




Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com